ఆంధ్ర మహిళ



ANDHRA MAHILA
OCTOBER '55.
ANNAS 8.

ఆంధ్రమహిళ

సంపుటి 12 :: అక్టోబరు '55 :: సంచిక 6

ఇంకా సంక్షేమం, బాలానందం, సామెతలు, సౌందర్యపోషణ, కచేరీచావిడి మున్నగునవి.

సంవత్సరచందా :: :: ఆరు రూపాయలు

వ్యవస్థాపకురాలు : శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపాదకురాలు : శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

ముద్రణ : ఆంధ్ర మహిళా ప్రెస్.

విజ్ఞప్తి

ఆంధ్ర మహిళాసభ యొక్క పూర్వ విద్యార్థినీ సంఘమును నెలకొల్పుటకు సంకల్పింపబడినది. ఇందు మహిళా విద్యాలయములోను, రాణీ రాజ్యలక్ష్మి పారిశ్రామిక విద్యాలయములోను, నర్సింగుహోములోను, ఐ.టి.సి. లోను శిక్షణ పొందిన విద్యార్థినులు సభ్యురాండ్రుగా చేరవలయునని మా ఆశయము.

పై శాఖలలో శిక్షణపొందిన విద్యార్థినులు తమ తమ చిరునామాలను కార్యదర్శికి తెలియపరచి ఆంధ్ర మహిళాసభతో సన్నిహిత సంబంధము యేర్పరచు కొనవలెనని కోరుచున్నాను.

బి. తిమ్మాబాయి,

సంయుక్త కార్యదర్శి,

ఆంధ్ర మహిళాసభ.

పాలపంపకం

గిల్డ్ ఆఫ్ సర్వీసువారు ఆగస్టు 16 తే ఆంధ్ర మహిళాసభకు 220పౌన్లుగల పాలపొడరు టిన్నులు 4 సప్లయి చేసినారు.

ఆ పొడను పాలుగా కలిపి ప్రతి ఆదివారము బీదపిల్లలకు (బాలబాలికలకు) సప్లయి చేయుచున్నాము ప్రతి దినము హాస్టలు నౌకరులకు, హాస్టలులో నివసించు బీదబాలికలకు కూడా, ప్రొద్దుటిపూట పాలు ఇచ్చుచున్నాము.

పాల సప్లయి వివరములు:

ఆగస్టు	21-8-55	ఆదివారము	మొత్తం	73	మంది బీద	బాలబాలికలకు.
,,	28-8-55	,,	,,	93	,,	,,
సెప్టెంబరు	4-9-55	ఆదివారము	మొత్తం	100	,,	,,
,,	11-9-55	,,	,,	106	,,	,,
,,	18-9-55	,,	,,	156	,,	,,

ఈ పాల సప్లయి నాగేశ్వరపురంలో శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారి స్థలంలో ఆంధ్రమహిళాసభ హాస్టలు వార్డెనుగారు నలుగురు హాస్టలు బాలికలను వెంటతీసుకుని వెళ్ళి జరిపించుచున్నారు.

ఆం. మ. సభ.

ఆంధ్రమహిళ

సంపుటి 12 :: అక్టోబరు '55 :: సంచిక 6

సమస్యలు

నాలుగు మాసముల అనంతరము పునర్దర్శనము.

కాలవాహిని ఎప్పటివలెనే ప్రవహించుచున్నా ప్రపంచ పరిస్థితులు బహుశీఘ్రగతిని మార్పు చెందుతూ వున్నవి. మొన్ననే స్వరాజ్యము చేపట్టి స్వాతంత్ర్యము సాధించి తన రాజ్యాంగమును చక్కదిద్దుకొనుచున్న భారతదేశము మరింత త్వరత్వరగా మార్పు చెందుతూవున్నది.

భారతాంబను సర్వాంగ సుందరముగా నుండేటట్లు దిద్ది తీర్చవలయుననే ప్రతిభారతీయుని ఆశయము. కాని ఆ లక్ష్య సాధనమందు తొందరపాటువల్ల కొంత రసాభాస కలుగకలదేమోయని భయముకూడ కలుగుచున్నది.

త్వరలో పుత్రులతోపాటు పుత్రికలును తండ్రి ఆస్థిపాస్థులు సమముగా పంచుకొన గలరు. ఇందుచే పడి పోతూ విడిపోతూవున్న సమిష్టికుటుంబ పద్ధతి పరిపూర్ణముగా నిర్మూలము కాగలదు. కొంతకాలమునుండి ఈ సమిష్టి కుటుంబ వ్యవస్థ ఇయ్యవలసిన లాభమునుకలిగించక కొంతవరకునష్టము కుటుంబ దేశపురోవృద్ధికి ఆటంకము కూడా కలిగించుచున్నదని ఒప్పుకొనవలసియే వచ్చుచున్నది, కావలసినది పూర్వమువలె సంపూర్ణమైన నిజమైనసమిష్టి కుటుంబము. కాని. అట్టిది ఇప్పటి(Transitional period) పరిణామ పరిస్థితులలో ఏర్పడుటఅసంభవము. కావున సంపూర్ణ నిర్మూలనమే వాంఛనీయము. దీనికితోడు రైతుల ఆస్థితుత్తునియలగు అవకాశముగలదు. భూసంస్కరణల సంఘమువారు త్వరలోనే భూమి యాజమాన్య గరిష్ఠత నిర్ణయింపనున్నారు. కావున పుత్రపుత్రికా భేదము లేకుండ చేయుట ముదావహమే. వ్రతము చెడ్డా ఫలము దక్కగలదు.

ఆస్థిహక్కుతోపాటు ఆంధ్రలో కట్నముల నిషేధము చట్టరూపములో రానున్నది. కట్నముల నిషేధ ఆవశ్యకత వేరుగచెప్పవలసినదిలేదు, ప్రస్తుతము పుత్రికలకు ఆస్థిహక్కు సంక్రమించినప్పుడు కట్నములు తమంతట తమే ఆగిపోగలవేమో. కాని ఆస్థిలేని సామాన్య కుటుంబీకులవరకైన ఈ కట్నముల నిషేధము లాభమొనరించ గలదేమో.

కొన్ని కొన్ని చట్టముల నుల్లంఘించుటకు యుక్తులుండకపోవు. చట్టములు మనశ్రేయస్సుకొరకు మనమే చేసుకొను చున్నప్పుడు కుయుక్తులతో ఆచట్టములను భగ్నము చేయుట అవివేకము.

దేశపరిస్థితుల వాతావరణమును బట్టి మానవ మనస్సును సంస్కరించు కొనవలసియున్నది. చట్టరూపముగ లభించు సంస్కరణ సంస్కరణయే కానేరదు. మానసిక సంస్కరణవే సంక్రమించు లాభమే వాంఛనీయము. అనతికాలములోనే అట్టిలాభము మనకు లభించగలదని ఆశించవచ్చును.



రాజకీయాలు

శ్రీ గోళ్ళమూడి రామచంద్రరావు

1955 ఆగస్టు నాలుగోవారం మొదలుకుని సెప్టెంబర్ చివరి వారంవరకూ నడిచిన ప్రముఖ సంఘటలు ఈ విధంగా ఉన్నవి:—గోవాలో భారతీయుల సత్యాగ్రహాన్ని భారత ప్రభుత్వం నిషేధించటం. కాశ్మీర్ విషయంలో తిరిగీ పాకిస్తాన్ ఆర్భాటం, పశ్చిమ జర్మనీ- సోవియట్ యూనియన్‌ల మధ్య రాయబార సంబంధాలు ఏర్పడటం. చైనా అమెరికాలమధ్య పౌరులపరటా ఒప్పందం ఆర్జెంటీనాలో పెరాన్ ప్రభుత్వపతనం. దేశంలో ఎన్నికల పద్ధతి సవరణకు ఆలోచనలు జరగటం.

• • •

ఆగస్టు 15 వ తేదీన పోర్చుగీసు పోలీసుల కాల్పులతో గోవాలో భారతీయసత్యాగ్రహపరిస్థితి విషమించింది. ఈ పరిస్థితుల్లో సత్యాగ్రహం చేయనివ్వటమా. లేదా అన్న సమస్య ఏర్పడ్డది. మొదటినుంచీ ఈ విషయమై అంత ఆసక్తిచూపని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠాన వర్గం సెప్టెంబర్ 4 న ఒక తీర్మానంచేస్తూ గోవాలో భారతీయుల సత్యాగ్రహం పనికిరాదనీ, కాంగ్రెసు వాదులు వ్యక్తిగతంగా కూడా అందులో పాల్గొనరాదనీ నిర్దేశించింది. సెప్టెంబర్ 6 వ తేదీన రాజ్యసభలో ప్రధాని నెహ్రూ విదేశాంగ చర్చను ప్రారంభిస్తూ గోవాలోకి భారతీయ సత్యాగ్రహులను అనుమతించేది లేదని ప్రకటించారు. ఆ ప్రకారం ఉత్తరువులు చేయబడినవి. వాటిని పోలీసులు అమలు జరుపుతున్నారు.

సత్యాగ్రహ సాధనం ప్రయోగించదగిన వ్యక్తులు పోర్చుగీసువాళ్ళు కాదు అని తేలింది కనుక దానిని ఉపసంహరించుకున్నామని కాంగ్రెస్ కానీ భారత ప్రధాని కానీ చెప్పిఉంటే ఎవరూ ఆశ్చర్య పడేవాళ్ళు కాదు. అట్లా చేయకుండా బొంబాయి ప్రజలు ఉద్రేకంతో చేసిన పనులు కారణమని నెహ్రూ చెప్పప్రయత్నించటం హాస్యాస్పదం. ఉన్న విషయాన్ని సూటిగా అంగీకరిస్తేపోయేది. కాని కాంగ్రెసు నాయకులు ఏమేమో వివరణలు చేయ ప్రయత్నించారు. ఈ వివరణలు ఉన్నసందేహాన్ని తొలగించటానికి బదులు, అసలు భారతదేశ స్వాతంత్ర్యం ఈ నాయకులు అదేపనిగా ఎక్కడబడితే అక్కడ ఏకరువు పెడుతున్నట్లుగా 'శాంతియుత సత్యాగ్రహ మార్గాన' రాలేదన్న నమ్మకం కలిగిస్తున్నవి. 1942 ఆగస్టు ఉద్యమం, ఆజాద్‌హింద్‌ఫౌజు, భారత నౌకాదళం తిరుగుబాటు, దేశంలో అనేకచోట్ల పోలీసుల్లో సాయుధబలాల్లో సమ్మెలు, తూర్పు ఆసియా దేశాల్లోవలె కమ్యూనిస్టులు బలపడతారేమోనని బ్రిటన్ పడ్డ ఆందోళన ఇవన్నీ కలిసి భారత దేశాన్ని బ్రిటన్ వదిలిపెట్టటానికి కారణ మయినవని కొందరు చేసే వాదం నిజమేమోనన్న అనుమానం కలుగుతున్నది. సత్యాగ్రహం అన్నది నిద్రావస్థలో ఉన్న ప్రజలను మేల్కొలిపేందుకు ఉపయోగిస్తుంది కాని, అంతిమవిజయాన్ని ఇవ్వలేదన్ననమ్మకానికిదారితీస్తున్నది.

తమ చర్యను సమర్థించుకునేందుకు కాంగ్రెసు నాయకులు పడుతూన్న తిప్పలనుచూస్తే, గోవాసమస్యను రాబోయేఎన్నికల్లో ప్రతికూల పక్షాలు ఉపయోగించు కుంటయ్యేమోనన్న ఆందోళన వాళ్ళకు ఉన్నట్లు కనిపిస్తున్నది. అయితే నెహ్రూ నిర్ణయంలో మాత్రం తప్పేమి లేదని చెప్పవలసి వుంటుంది.

ఆసియా ఆఫ్రికా దేశాలు బాండుంగ్‌లో తీర్మానించినట్లుగా వలస వాదాన్ని ప్రతిఘటించటానికి ఈ దేశాలన్నీ సహకరిస్తే ఈ సమస్యసురీ సులభంగా పరిష్కారమయేది. కాని పాకిస్థాన్ మాత్రం పోర్చుగీస్ అధికారులకు అనేక విధాల సహాయం చేస్తున్నది.

• • •

పాకిస్థాన్ పోర్చుగీస్ అధికారులకు సహాయపడటమే కాక ఇండియామీద కక్షతీర్చుకునేందుకు దీనినొక సాధ

నంగా ఉపయోగించదలచినట్లు కనిపిస్తున్నది. పాకీస్థాన్ తాత్కాలికగవర్నర్ జనరల్ ఇస్కందర్‌మీర్జా(ప్రస్తుతం గవర్నర్ జనరలే అయిననారు) గోవాలో సత్యాగ్రహం పాకిస్థాన్‌లో క్రైస్తవులకు ఆందోళన కలిగిస్తుదన్నారు. భారతీయులు గోవాతో సత్యాగ్రహం చేస్తున్నప్పుడు పాకిస్థాన్ ప్రజలు కాశ్మీర్‌లో ఎందుకు సత్యాగ్రహం చేయకూడదని ఒక ప్రశ్న వేస్తూ, పాకిస్థానీయులుఅట్లాచేయాలని సూచనగా చెప్పారు. కాశ్మీర్ సమస్యను తిరిగీ భద్రతా మండలికి తీసుకుని వెడతామని కూడా సూచించారు. పాకిస్తాన్ కొత్తప్రధాని చౌదరీ మహమ్మద్‌అలీకూడా ఈ అభిప్రాయాలనే వెల్లడించారు.

పాకిస్థాన్ పాలకుల వాదం చాలా తీవ్రపరిణామాలకు దారితీస్తుంది. ఇది తిరిగి ఉభయదేశాల ప్రజల మధ్యనూ విద్వేషాలనూ, జాతివైరాన్ని రెచ్చగొడుతుంది. ఇటీవలే బాగుపడుతున్న వ్యవహారాలు నాశనమయి, దేశ విభజనాటి పరిస్థితులకు క్రమంగా దారి తీస్తుంది.

పాకిస్థాన్ నాయకులు తమ సమస్యలను సవ్యమయిన మార్గాల పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తారను కొనటానికి అనుకూల పరిస్థితులు ఇటీవల కనిపించినవి. ఆఫ్‌గనిస్థాన్‌తో వచ్చిన జండా అవమానం తగాదాకూడా పరిష్కారమయింది. కాని పశ్చిమపాకిస్థాన్‌ను ఏకరాష్ట్రం చేయాలన్న ప్రయత్నాన్ని ప్రజలు ప్రతిఘటించకుండా. వాళ్ళ దృష్టిని మళ్ళించటానికి పాకిస్థాన్ పాలకులు కాశ్మీర్ సమస్యని ఇప్పుడు రేపెట్టవచ్చు. టర్కీ. ఇరాక్ పాకిస్థాన్‌ల సమిష్టి ఒప్పందాన్నికూడా, ఎంతో కాలం వేచి ఉన్నమీదట, ఈ నెలతోనే. పాకిస్థాన్ ప్రభుత్వం ఆమోదించింది.

• • •

కాశ్మీర్ విషయంలో పరిస్థితులు విషమించకుండా ఉండాలంటే, అది త్వరలో తేలిపోవాలంటే, బాండుంగ్ సభ దేశాలు కొన్నిటి మధ్యవర్తిత్వాన ఆ సంస్థాన భవిష్యత్తునుగురించి జనవాక్యం జరిపించవలసిందే. అజాద్ కాశ్మీర్‌లో పాకిస్థాన్ పోలీసుల అత్యాచారాల వల్ల ప్రజలు భారతదేశానికి పారిపోయివస్తున్నారని అజాద్ కాశ్మీర్ ముస్లిం కాన్ఫరెన్స్ పాకిస్థాన్ రాజ్యాంగ పరిషత్తుకు విన్నవించుకున్నది. అందువల్ల జనవాక్యం విషయంలో ఏభయాలూ ఇండియాకు అనవసరం. అంతే కాని జనవాక్యం జరపరేమోనన్న అపోహలకు అవకాశం ఇచ్చే ప్రసంగాలనూ, కార్యకలాపాలను — లోగడ హోం మంత్రి పంత్ చేసినట్లుగా — సాగించకూడదు.

• • •

జర్మనీ ఏకీకరణ రెండుపద్ధతులమీద సాగాలని జూలైలో అగ్రనాయక సమావేశంలో సోవియట్ ప్రధాని బుల్గానిన్ స్పష్టపరిచారు (1) ఐక్యజర్మనీ తటస్థంగా ఉండాలి (2) జర్మనీ ఏకీకరణను ఉభయజర్మనీ ప్రతినిధులే సాధించాలి. మొదటిదానికోసం అఖిలయూరపు దేశాల రక్షణ ఒప్పందంచేసుకోవాలని సూచించారు.

ఉభయజర్మనీలూ సంప్రదించేట్లు చేయటానికి రష్యా అనేకచర్యలు తీసుకుంటున్నది. జర్మనీ ఏకీకరణ జరగాలంటే రష్యా షరతులను అమలుజరపటం అవసరమని గుర్తించేవాళ్ళు పశ్చిమ జర్మనీలో నానాటికీ అధికమవుతున్నారు. దీనివల్ల సోవియట్ యూనియన్ రాయబార సంబంధాలు ఏర్పాటుచేసుకుందామని సూచించగా పశ్చిమ జర్మన్ ప్రధాని అడెనోవర్ నిరాకరించలేకపోయినారు. అడెనోవర్ కోరినట్లుగా యుద్ధఖైదీల విడుదలకుకూడా రష్యా అంగీకరించింది.

రష్యా తూర్పుజర్మనీలో వేరే ఒక ఒప్పందం చేసుకుంటూ, ఏకీకరణచర్యను ఉభయులమధ్యనే జరగాలని సూచించింది. ఉభయులనూ దగ్గరగాజేర్చే నిమిత్తం ఉభయసరిహద్దుల మధ్యవచ్చే సమస్యలను ఆ ఉభయులూ పరిష్కరించుకొనటానికి అనుకూలపరిస్థితుల్ని సృష్టించింది. తూర్పుజర్మనీకి సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చింది. పశ్చిమ జర్మనీనుంచి పశ్చిమరాజ్యాల సేనలు నిష్క్రమించిన తక్షణం తమ సేనలు తూర్పు జర్మనీనుంచి వెళ్ళిపోగలవని చెప్పింది.

• • •

రష్యా జర్మనీ ఏకీకరణకోసం ఉభయజర్మనీలనూ ఒకచోటు జేర్చటానికి కృషిచేస్తుండగా, మరొక చెంప అమెరికా ఇండోచైనా, కొరియా ఏకీకరణలకు విఘాతాలు కలిగిస్తున్నది. ఏకీకరణకు సంప్రదింపులు జరుపుదామని ఉత్తర వియత్నాం, ఉత్తర కొరియాలు ఎంత ప్రయత్నిస్తున్నా దక్షిణకొరియా, దక్షిణ వియత్నాంలు వ్యతిరేకిస్తున్నవి. వీటికి అమెరికా పూర్తిమద్దత్ ఇస్తున్నది.

అమెరికా వైఖరి ఇట్లా ఉన్నదికనుకనే కాంబోడియా ఎన్నికల్లో పూర్తివిజయం సాధించిన మాజీరాజునరోదం అమెరికా సహాయం ఇంకా తీసుకోవాలా, అక్కర్లేదా అన్న విషయమై నాయకులు పరిశీలించటం అవసరమని అన్నారు. సైనిక ఒప్పందాల్లోతాము జేరేదిలేదని అన్నారు.

అమెరికా, దాని అనుచరుల వైఖరి ఈవిధంగా ఉన్నదికనుకనే ఇండోచైనా ఒప్పందాన్ని కుదిర్చిన జెనీవా సభ దేశాలు తిరిగి సమావేశం కావాలని ఉత్తర వియత్నాం సూచించింది. ఆసియా సమస్యలను చర్చించేందుకు అగ్రనాయక సమావేశం జరగాలని నెహ్రూ సూచించారు. దానిని సోవియట్ విదేశాంగ మంత్రి మాలటోవ్ ఐక్యరాజ్య సమితిలో సమర్పించారు. లావోస్ కూడా జెనీవా ఒప్పందం పూర్తిగా అమలుజరగాలనే కోరుతున్నదని లావోస్ యువరాజు ఈనెలచివరివారంలో ఢిల్లీ వచ్చినప్పుడు వెల్లడించారు.

• • •

రష్యా విదేశాల్లో ఉన్న తన సేనలను ఉపసంహరించే కార్యక్రమం అమలుజరుపుతున్నది. మొదట ఆస్ట్రియా నుంచి ఉపసంహరించుకున్నది. ఈనెలలో ఫిన్లెండులో పొర్కలా నౌకాస్థావరాన్ని వదులుకున్నది. అంతకు ముందు చైనాలో ఉన్న పోర్ట్ఆర్థర్, దాయిరెన్‌లను వదులుకున్నది. ఇతర దేశాలుకూడా విదేశాల్లో ఉన్న తమ స్థావరాలను వదిలి, సేనలను వెనక్కి పిలిపించుకోవాలని హెచ్చరిస్తున్నవి.

• • •

అమెరికాలో దిగుబాటు అయిఉన్న చైనా విద్యార్థులను వాళ్ళదేశానికి, చైనా నిర్బంధించిన అమెరికన్‌పౌరులను వాళ్ళదేశానికీ పంపించుకునేందుకు జెనీవాలో ఉభయ ప్రతినిధులకూ ఈనెలలో ఒప్పందం కుదిరింది. ఒప్పందం అమలుజరగటం ప్రారంభమయింది. అమెరికాలో ఉన్న చైనా పౌరులను ఎవరూ అడ్డగించకుండా చూసి ఇళ్ళకు పంపించేందుకు భారతదేశం సహాయాన్ని చైనాకోరింది. అట్లాగే బ్రిటన్ సహాయాన్ని అమెరికా కోరింది. ఇప్పుడింక ఇతర వివాదాంశాలనుకూడా చర్చించటానికి ఉభయులూ సిద్ధపడ్డారు. ఈచర్చల్లో ఫార్మోజాసమస్యరాదు.

• • •

దాదాపు పదిసం॥లనుంచీ అర్జెంటీనా నియంతగా ఉన్న పెరాన్ ప్రభుత్వాన్ని కాథలిక్‌చర్చి అనుయాయులు ఈ నెల 19 వ తేదీన కూలదోశారు.

అర్జెంటీనా దక్షిణ అమెరికా దేశాల్లోకల్లా రెండో పెద్దదేశం. వాటన్నిటిలోకీ అభివృద్ధి చెందినదేశం. దక్షిణ అమెరికా రాజ్యాలను బ్రిటన్, అమెరికాలు ఆర్థికంగా తమ గుప్పెట్లో పెట్టుకున్నవి. ఈకుట్రలవల్ల రోజుకొక ప్రభుత్వం కూలిపోతూఉంటుంది. పెరాన్‌అధికారంలోకి వచ్చినప్పటినుంచీ అమెరికా, బ్రిటన్‌లను ప్రతిఘటిస్తున్నాడు. వాటిబలాన్ని నాశనం చేసేందుకు చాలా ప్రయత్నాలు చేశాడు. అఖిల అమెరికారాజ్యాల సభల్లో అమెరికాను అర్జెంటీనా ఎప్పుడూ ప్రతిఘటించేది.

పెరాన్ కార్మికుల బలంతో అధికారంలోకివచ్చాడు. వాళ్ళకు సహాయం కొంతవరకూ చేయకలిగాడు. ఇతడి ప్రణాళికలకు కాథలిక్‌చర్చి అడ్డంవచ్చింది. దాని అధికారాలను తగ్గించ ప్రయత్నించగా, పోప్ ఈ ప్రభుత్వాన్ని వెలివేశాడు. కాథలిక్ అభిమానులు సైన్యంలో నౌకాదళంలో తిరుగుబాటుచేసి గెలిచారు. కార్మికులు పెరాన్‌కోసం పోరాడుతున్నారుకాని, పరిస్థితి ఇప్పట్లో మారేటట్లు కనిపించదు.

* * *


దేశంలో అప్పుడే రాబోయే ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభమయినవి. ఎన్నికల చట్టాలను సవరించటానికి ప్రభుత్వం ఉద్యమించింది. అందులో ఒక సవరణ చిన్న పార్టీల అభ్యర్థులకూ, బీదపార్టీల అభ్యర్థులకూ, బీద స్వతంత్ర అభ్యర్థులకూ అన్యాయంచేసేది. ఎన్నికలకోసం అభ్యర్థులుచేసే ఖర్చును లెక్కవేసేటప్పుడు వాళ్ళపార్టీలు పెట్టే ఖర్చును పరిగణించకూడదని ఈసవరణ ప్రతిపాదిస్తున్నది. పార్టీ అనేకమంది అభ్యర్థులకు కలిపి ప్రచారం చేస్తుందికనుక, ఒక్కొక్క అభ్యర్థికీ విడిగా లెక్కతేల్చటం కష్టమని దీనికి కారణం చెప్పబడుతున్నది.

ఇట్లాగే ఆంధ్ర రాష్ట్రంలో జిల్లాబోర్డు ఎన్నికలను ప్రజలద్వారాకాకుండా, పంచాయతీ సభ్యులద్వారానే జరిపించాలని ప్రయత్నాలు జరుగుతున్నవి. మద్రాసులో వోటింగును ఇంకా రహస్యంగా జరిపించటం అన్న పేరుతో, చదువురాని వాళ్ళను చిక్కులు పెట్టే ఆలోచనలు జరుగుతున్నవి. ఒక్కొక్క అభ్యర్థికీ ఒక పెట్టె ఉంచటానికి బదులు ఒకే పెట్టె ఉంచుతారట. అందరు అభ్యర్థులపేర్లు

గుర్తులు ఉన్న వోటుకాగితం మీద కావలసిన గుర్తు పక్కన వోటరు ఒక గుర్తువేసి ఆ పెట్టెలో వేయాలట. ఇవన్నీ ప్రజల వోటింగుకు ఆటంకాలుగా పరిణమించేవే.

• • •

రాష్ట్ర పునర్నిర్మాణ సంఘం నివేదిక సెప్టెంబర్ 30 వ తేదీన ప్రభుత్వానికి సమర్పించ బడుతుందని తెలుస్తున్నది. అందులో రెండు తెలుగురాష్ట్రాలు (ప్రత్యేక తెలంగాణా) సూచించబడతవనీ. ఉభయరాష్ట్రాల శాసన సభలు కోరితే అవిరెండూ కలిసిపోవచ్చునని అనుమతించబడుతోందని తెలుస్తున్నది. తెలంగాణా శాసన సభ్యులు 66 మంది రాష్ట్ర పునర్నిర్మాణ సంఘానికి ఒక నివేదిక పంపుతూ హైదరాబాద్ రాజధానిగ ఏర్పడాలని విజ్ఞప్తి చేశారట. ఐక్యకేరళ. కర్నాటక కూడా ఏర్పడగలవని. రాజప్రముఖ పదవులు రద్దు కాగలవనీ కూడా తెలుస్తున్నది.



జెమినీ చిత్రం "ఇన్‌సానియత్"లో నటించిన జిప్పీ.

• •

సెప్టెంబర్ 25 వ తేదీన ఆంధ్ర రాష్ట్ర శాసనసభలో వరకట్నం నిషేధం బిల్లు ప్రతిపాదించబడది. బహుభార్యాత్వ నిషేధం, వివాహిల బిల్లులను ప్రతిపాదించిన అయ్యదేవర కాళేశ్వర రావు గారే దీనినికూడా ప్రతిపాదించారు.

ఈచట్టం ప్రకారం కట్నాలు ఇవ్వటం. పుచ్చుకోటం దాని మీద ఒప్పందాలు చేసుకొనటం కూడా నేరాలే. కట్నం ఒప్పందాలను అమలు జరపకుండాను. ఇచ్చిన కట్నాలను రాబట్టుకునేందుకూ ఏర్పాట్లు ఉన్నవి. అయితే 3 వేల రూపాయల వరకూ ఖరీదుగల కానుకలను ఇవ్వవచ్చునను నియమాన్ని ఉల్లంఘించిన వాళ్ళకు ఏడాదివరకూ జైలు శిక్ష. జరిమానా విధించవచ్చు

మనలోమనమాట

నేర్చుకొనవే నీరజాక్షి

వద్దుర బాబోయి వద్దు

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్



"ముదితల్ నేర్వగరాని విద్యకలదే ముద్దార
నేర్పించినన్" ? ! ?

నిజమే కావచ్చు. కాకపోవచ్చునూడా. స్త్రీలు నేర్వగ రాని విద్యలు ఇవే అని చెప్పవచ్చు. మనరాజ్యాంగము ఆసంగతి చెప్పనే చెప్పను. ఎవరికైనా మహిళలకు తెలియకుండా వుండగలదేమో నని భయపడి మనస్త్రీ ఎమ్. పి. లు ఆవిషయము పలుసార్లు పలువిధముల ఘోషించారు. సరే సంఘ సంస్కారణాభిలాషుల సంగతి వేరే చెప్పాలా ?

విద్యలైతే నేర్వవచ్చు. నేర్పేదెవరూ అని ప్రశ్న. పిల్లికి గంట కట్టేదెవరూ అనేది పూర్వము పిల్లులకు ఎంత సమస్యో స్త్రీలకూ ఇది అట్టి సమస్యే. గురువుల వద్ద నేర్చుకొనవచ్చు. పెద్దలవద్దనేర్చుకొనవచ్చు. మిత్రురాండ్రు నేర్పితే నేర్చుకొనవచ్చు. కాని భర్తలవద్ద మాత్రము వద్దురబాబోయి. విద్యలు నేర్చుకోకపోతే పీడా బోయను గాని భర్తలవద్ద శిష్యత్వము మాత్రము వద్దు.

మీకీ విషయములో ఏమాత్రము అనుమానమున్నా సందేహ నివారణ చేసికొనుట ఉత్తమము. Sample గా కొంచెము ఇంగ్లీషు నేర్చుకొనుటఆరంభించండి. జాగ్రత్తసుమండీ, వినాయకపూజ మనస్సులోనైనా చేసుకొనకుండా ఆరంభించకండి. ఏదో చెప్పుతున్నానని ఏమరుపాటు పడకండి. సినిమాలో చూచినట్టు C A T cat అని పొయ్యిలో విలాసంగా పుల్లలు విరచివేస్తూ నేర్చుకొనటమును కొని భ్రమపడకండి. కాని A S S ass గాడిద అంటే అత్తగారు చీపురుతో వేంచేస్తారని కూడా భయపడకండి. అంతకన్నా ప్రమాదకరమైన పరిస్థితులకు సంసిద్ధులై యుండవలసి వస్తుంది. మీ శ్రీవారు అప్పుడే ఇంట్లో కాలుబెట్టుతూ మీ C A T cat విన్నారా ఇంకే ముందు ఏటంబాంబు బ్రద్దలైనంత పని అవుతుంది. చరచరా ఉత్తరీయము తీసి కంజీవేయిక్ లో కూలబడి ముందు ఉపోద్ఘాతముగా హా! హా! బాగను నేర్చుకుంటున్నానా యని అనవచ్చు. అంతటితో మాత్రము మీరు ఉబ్బితబ్బిబ్బ హా! హా! ఎంచక్కా నేర్చుకుంటున్నానో చూడండి అంటూ ఒక Tooth-paste నవ్వుతో ఆయనగారి దగ్గరకు పోకండి. ఆయనగారు ఉపోద్ఘాత అనంతరము నేను చదువుకునే రోజుల్లో C A T ఎట్లా నేర్చుకొన్నదీ, నిముషాలలో ఎట్లా ఇంగ్లీషు పలికిన వగలాడివలె వచ్చి పడిందీ స్కూలులో ఎన్ని బహుమతులు బడసినదీ, కాలేజీలో ఎన్ని వెండికప్పులు, మెడల్సు దొరికినదీ ఎన్ని డిగ్రీలు ఎక్కడెక్కడ అవలీలగా లభించింది, ఆఖరుకి విదేశీయులు సైతము ఆయనగారి Zeroని జీరో అనుట Government ని గవర్నమెంటు అనుట గురించి ఎంతగా ప్రశంసించారో చెప్పగలరు. ఏకధాటిగా దబ్బావాయించడము ముగించిన తరువాత అప్పుడు మీరు హా హా యని ఆనందించినట్లు, సంతోషించినట్లు, ఇంగ్లీషు భాషంతటి భాష మీకు నేర్చుకొనుట చాలా కష్టముగా వున్నట్లు అభినయిస్తూ అన్నం వడ్డించిరా ఫరవాలేదు. కాని దీనికి భిన్నంగా హేళనగా తర్డుఫారములోని గజనీ దండయాత్రలు, S.S.L.C. లోని ఎలగ్జాండరు దండయాత్రలు, కాలేజీలో M.S.M. ప్రయాణ విశేషములు జ్ఞాపకము చేస్తిరో మీగతి దైవమునకే ఎరుక..... ..... !

ఇక ఇంగ్లీషు నేర్చుకొనుటే కాదు. మీరు ఏ విద్యనైనా నేర్చు కొన చూడవచ్చు. కాని వంట కుట్టు Domestic economy వగైరాలు వారిని అడగరనే నా వుద్దేశము.

భర్త ఉపాధ్యాయ వృత్తిలో వుంటే ధర్మోపదేశాలు నేర్చుకొనవచ్చు. అంటే ప్రయత్నము చేయవచ్చుని

మాత్రమే సూచన. భర్త రాజకీయ వేత్తయితే గోడమీద పిల్లివాటముగా కబుర్లు చెప్పటము నేర్చుకోవచ్చు. వకీలైతే ఎల్లిని మల్లిగా, మల్లిని ఎల్లిగా తిప్పి చెప్పటము నేర్చుకోవచ్చు. ఉన్నతాధికారైతే అధికారము చెలాయించటము నేర్చుకోవచ్చు. N.G.O. అయితే అంచితే జుట్టూ లేకపోతే కాళ్ళు పట్టుకో మాట్లాడము నేర్చుకోవచ్చు. భర్త పత్రిక మహాశయ అయితే అన్నిటికీ చూస్తూ చూస్తూనే లాభాలు నష్టాలు జమకట్టడము నేర్చుకోవచ్చు. ఇట్లా ఈ విద్యలన్నీ నేర్చుకోవచ్చుగాని పొరపాటునైనా ఒక్కటి మాత్రము భర్తవద్ద నేర్వరానిది వున్నది.

అసలే ఆ విద్య ప్రమాదకరము, దానిని భర్తవద్ద నేర్చుకొనుట మహా ప్రమాదకరము. అదియేమి బ్రహ్మవిద్య కాదు సుమండీ కారు డ్రయివింగు.

దీనిని భర్తవద్ద నేర్చుకొన దలచారా కొన్ని విషమ పరిస్థితులకు సంసిద్ధులై యుండాలి. మొట్టమొదట ఆపస్థ మీరు ఆయన ఇన్స్యూరెన్సు ఏజంటు దగ్గరకు వెళ్ళుట. ఇకపోతే ఎప్పుడు తనువీడని విషయము ఆలోచించి మీరు వినగలరు. ఎందుకంటే మీ జీవితము ఆయన జీవితము కన్నా ఎక్కువ విలువగలదని!! ధీమా ఏజంటేనచెప్పింది.

కారు ఎక్కి స్టార్టుచెయ్యటము మొదలు పెట్టిన పది పదిహేను నిమిషాలలో మీరు ఎంత తెలివి తక్కువవారైంది. ఎంత అసమర్థురాలు మీ తలలో నున్న బురద మట్టి Composition మీ Road-sense, road judgement, మీ బుద్ధి మందగొడి తనము, మీ కాళ్ళ చేతుల వికృత సంచలనా విధానము మీకు Signals ఇవ్వటము తెలుసుకొనుటలోని లోపజ్ఞానము, ఆ పైని స్త్రీల డ్రయివింగు యొక్క ప్రమాదాల ఉపన్యాసధోరణిలో (కొంచెం హెచ్చుస్థాయిలోనే) వినవలసి వుంటుంది. ఎంత ఓపిక వున్న స్త్రీ అయినా ఇదంతా వినేటప్పటికే ఆమె సహనము సంపూర్తిగా కరగి పోగలదు. కారు డ్రయివింగు నేర్చుకొనటమనేది అసలు జరుగనే జరుగదు. అందుకనే ముందుగనే వార్నింగిస్తున్నది. ఆ పాటునకారు తీసికొని పోయి ఏ చెట్టుకో కొట్టెయ బుద్ధికూడా కావచ్చు. సుమండీ! కారు డ్రయివింగు నేర్చుకొనదలిస్తే ఏ అన్న దగ్గరో, తండ్రివద్దో నేర్చుకొనవచ్చు. కాని భర్త వద్ద మాత్రము వద్దు అన్న తండ్రి లేకపోతే 'ఏదిగతి' యని సంగీతము నేర్చుకొనుట శ్రేయస్కరము.

మీ క్షేమనా అనుమానముంటే ఒకరోజు నమూనా పాఠము అభ్యసించి చూడండి. నాకు వెంటనే ధన్యవాదాలు అర్పిస్తారు తెండి.

వచ్చిచెడి ఏ మాటకో ఒకరో కోటిలో ఒకరో భర్తగారివద్ద డ్రయివింగు నేర్చుకొనిరో శ్రీమహిళాయ శ్రీనారి గుణవతీలు ఇప్పటికే జీవితాంతమువరకు తలతాకట్టు పెట్టి ఆయనగారికి అన్నిటికి లొంగవలసిందే!!

మీవారికి చెప్పకండి ఇదిసలహా మనలో మన మాట.

ఆగష్టు 15.

ఆగష్టు 15 వ తేదీ స్వాతంత్ర దినోత్సవ సందర్భములో ఎ. ఎస్. ఆర్. మహిళాభవనమునందు శ్రీమతి. కీనాడ సరస్వతీదేవిగారిచే, పతాకము యెగురవేయబడినను. ఆదినము మూడు వందలమంది బీదలకు అన్నదానము, వస్త్రదానము సభ్యురాండ్రచే చేయబడినది. తరువాత సభలో ఎన్. లీలావతి. బి. లలితాంబగార్లు స్వాతంత్రదినోత్సవ అవశ్యకతనుగూర్చి, ప్రస్తుతదేశపరిస్థితుల గురించి వుపన్యసించిరి. కార్యదర్శిని అయిన పి. వెంకటరమణమ్మగారు ధన్యవాదము లర్పించిరి. జనగణమనగీతముతో సభముగిసినది.

ఇట్లు. అయ్యగారి సింహాద్రమ్మ, నెం॥ 263
విశాఖపట్టణము.

దినచర్య

నిదుర లేచిన యంతనే నీమనోజ్ఞ
చిత్రపటమును తొలుత వీక్షింపకుండ
అన్య మేమియు చేయ — త్రియామ వేళ
పటము కనుగొన్న యావల పవ్వళింతు.

నడుమ నడుమను భగవతీ నామమునకు
బదులు, నేను పరధ్యాన పరవశతను
యుష్మదీయాభిరామాఖ్య ఉచ్చరించి
ఏమి భేదము మీ కని ఎంతు నవల

ఇష్టదేవతలో భేద మేల ! అమె
ఒకట ఆగమ విపిన మయూరివోలె
ఒక్కొకప్పుడు విపిన మయూరి వోలె
కానబడుచుండు నంట నిక్కమ్ము సుమ్ము !

శ్రీ శివశంకర శాస్త్రి


సాహితీ సమితి

విజ్ఞాపన

"ఆంధ్ర మహిళ" పన్నెండవ జన్మదిన సంచిక డిసెంబరు సంచికగా నవంబరు నెలాఖరుననే వెలువడును.

పాఠకులూ, రచయితలూ విజ్ఞాన ప్రబోధకములైన తమ తమ ప్రత్యేక కథలూ, గేయాలూ, నాటికలూ, చిత్రాలూ, వార్షిక సంచికలో ప్రచురించుటకు గాను త్వరలో పంపగలరని ప్రార్థిస్తున్నాను.

కె. ల. ర.



ఎవరెస్టు విజయము

హిమాలయా పర్వత ఎవరెస్టు శిఖరాన్ని 1953 లో ఒక భారతీయుడు మొట్ట మొదటగా అధిరోహించి ప్రపంచ ప్రశంసలు బడసినాడు. అదే సంవత్సరము వెలువడిన తపాలాబిళ్ళలలో ఈ ఎవరెస్టు విజయ చిత్రపు 0-14-0 బిళ్ళ ఒకటి. దీనిని నాసిక్ భారతీయ సెక్యూరిటీ ప్రెస్సువారు రచించిరి.

ఇటీవల ఇటలీలో జరిగిన పోటీలలో ఈ తపాలాబిళ్ళ **బహుమతి** పొందినది. భారత స్టాంపులకు బహుమతి లభించుట ఇదియే ప్రథమము. నేషనల్ ఇటాలియన్ ఒలింపిక్ కమిటీ వారు ఈ బిళ్ళకు బహుమానముగా ఎమిలియో కొమిలి యను వెండిపతకమును బహూకరించిరి.

స్వామి నిఖిలానందకు వాట్ముల్ బహుమానం

స్వామి నిఖిలానందకు 500 డాలర్ల ప్రత్యేక బహుమానాన్ని వాట్ముల్ ధర్మసంస్థవారు ప్రకటించారు. ఆయన రచించిన "వివేకానంద: ఎ యోగాస్ అండ్ అదర్ వర్క్స్" అన్న గ్రంథానికిగాను ఈ బహుమానం ప్రకటించబడింది. ఈ గ్రంథం 1953 లో ప్రచురించబడింది.

అమెరికన్ హిస్టారికల్ అసోసియేషన్ వారి ద్వారా వాట్ముల్ ధర్మసంస్థవారు రెండేళ్ళకొకసారి ఇటువంటి బహుమానాన్ని ఇస్తూవుంటారు. గత రెండు సంవత్సరాలలోను భారతదేశ చరిత్రనుగురించికాని, రాజకీయాలనుగురించికాని, ఆర్థిక విషయాలనుగురించికాని ప్రచురించబడిన అత్యుత్తమ గ్రంథానికి ఈ బహుమానమివ్వబడుతుంది.


స్వామి నిఖిలానంద, రామకృష్ణమిషన్ సభ్యుడు. ఈ రామకృష్ణమిషన్ కేంద్రస్థానం కలకత్తాకు సమీపాన బేలూరులోవుంది. స్వామి నిఖిలానంద చాలా సంవత్సరాల పాటు అమెరికాలో గడిపారు; న్యూయార్క్ నగరంలో రామకృష్ణ-వివేకానంద కేంద్రాన్ని 1933 లో ఆయన స్థాపించారు.

వాట్ముల్ ధర్మసంస్థ 1942 లో హోనలులులో స్థాపించబడింది. "ముఖ్యంగా సాంస్కృతిక సంబంధాల ద్వారా ఇండియా అమెరికా దేశీయులు ఒకరిని మరొకరు ఇంకా బాగా అర్థం చేసుకునేటట్లు చేయడం" ఈ ధర్మ సంస్థ లక్ష్యాలలో ఒకటి.

★ చంద్రలోకయాత్ర ★

చంద్రలోకానికి ప్రయాణం. ఈరోజుల్లో ప్రతీవారికీ ఇదొక ఊతపదమై పోయింది. సాంఘికమైన కట్టుబాట్ల ప్రమేయం లేకుండా, స్వేచ్ఛగా ప్రణయజీవితం సాగించ దలచిన ప్రేమికులకూ యిదేపాట. జనాభా సమస్యను పరిష్కరించలేక, కొత్త సామ్రాజ్యాలకు ఉన్నభూమి చాలక సతమత మవుతున్న సామ్రాజ్య వల్లభులకూ యిదేపల్లవి. దీనికి అనుపల్లవి ఇట్టిది అసలు సాధ్యమా అంటూ శాస్త్రజ్ఞులు సాగించే తర్జన భర్జనలు. నేలను కరచితిరిగే మానవుడు చుక్కలవంక దృక్కులు సారిస్తూ అమాంతంగా అంతరిక్షంలోకి యెగిరిపోవాలనే ఆలోచన అతి ప్రాచీనమైనది. ఈ ఆలోచనకు అర్వాచీన రూపమే రాకెట్టులు. నేటిరాకెట్లకు జనక ప్రాయమైనది తారాజువ్వలు. ఆనాటి తారాజువ్వలు సూరేకారంతోనూ, పటాసుతోనూ రివ్వున పదిగజాల దూరం దూసుకుపోతే గొప్ప అనుకునేవారు. మరి కొన్నాళ్ళో, పరమాణుశక్తి సాయంతో ప్రగతిగర్భంలో నుంచి దూసుకుపోయి, మన భూమండలానికి చాలా దూరంలోవున్న వివిధ గ్రహమండలాలను చేయకోవాలని వైజ్ఞానికులు కలలుకంటున్నారు. ఇప్పటి పరిశోధన తీరు చూస్తేవీరి సుందరస్వప్నాలు సార్థకమయ్యేటట్లే కనుపడుతోంది.

దాదాపు ఐదు దశాబ్దాల క్రిందట రైట్ సోదరుల అపూర్వ కృషిఫలితంగా, రెక్కలు లేకపోయినా, పక్షిలాగ యెగరడానికి మానవాళికి "లోహవిహంగాలు" అందుబాటులోకి వచ్చాయి. దీనితో దేశకాలాల అవధులన్నీ సంకుచితమై పోయాయి. విమానాల్లో ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి సురక్షితంగా ప్రయాణం చేయడం ఎలాగన్నది యీనాటి వైజ్ఞానికులకూ సమస్యకాదు. వైమానికులకూ సమస్యకాదు. ఇప్పటిసమస్య అల్లా మనభూమిని ఆవరించుకుని వున్న వాయుమండలాన్ని దాటి, ప్రదేశాంతరాళంలో వున్న నిర్వాత సీమలలో క్షేమంగా ప్రయాణం చేయడం ఎలాగ? అన్నది ప్రధానసమస్య అయింది. ఈ సమస్యా పరిష్కారానికి తోడ్పడగల అమోఘసాధనాలు రాకెట్లు. వీటి చరిత్ర, పనిచేసే పద్ధతి యెంతో ఆసక్తిజనకంగా వుంటాయి. అసలీలాంటి పరిస్థితులలో రాకెట్ తప్ప, మరే యంత్ర విశేషమూ పనిచేయలేవు.



ప్రపంచంలో అందరికంటె ముందుగా రాకెట్ల సంగతి తెలుసుకున్నవాళ్ళు చైనావాళ్ళు. ఇప్పటికి ఏడుశతాబ్దాలకు పూర్వమే, అంటే క్రీ. శ. 1200 ప్రాంతంలో, చైనీస్ విజ్ఞానులు వీటిని గురించి చాలా గుణకారమే చేశారు. అప్పటికే, వీరు గుణించి, గణించిన విజ్ఞానం చాలా యెక్కువ. ఆ తరువాత కాలంలోకూడా దేశదేశాల వైజ్ఞానికులు దీన్నిగురించి చాలా పరిశోధనలు చేస్తూనే వచ్చినప్పటికీ, ద్వితీయ ప్రపంచయుద్ధ సమయంలో జర్మన్లు దాదాపు 50 కోట్ల రూపాయల వ్యయంతో పీనేముండే దగ్గర ఒక రాకెట్ స్థావరాన్ని నిర్మించే వరకూ వీటి విశేషమేమిటో, వీటి మహాత్మ్యమేమిటో, వీటి శక్తిసామర్థ్యాలేమిటో ప్రపంచానికి తెలిసిరాలేదు. ఇందువల్ల, అనంతావకాశంలోకి ప్రయాణాలుచేయగల అవకాశాలు అనంతమని యిప్పుడిప్పుడే వైజ్ఞానికులు తెలుసుకుంటున్నారు. ఇదంతా, మనకు, ద్వితీయ ప్రపంచ మహాయుద్ధం పెట్టిన బిక్ష. దీనినే కీడులో మేలు అనాలి. యుద్ధమే లేకపోతే, యీ శాస్త్రం యింతగా అభివృద్ధి చెందివుండేదికాదు. దీనికోసం, ఇన్నిదేశాలు యింత అంగబలాన్నీ, యింత అర్థబలాన్నీ సమీకరించి కృషి చేసేవీకావు.

రాకెట్ కథ: శ్రీ వి. భానుమూర్తి

చంద్రలోకయాత్ర

మన భూమిని పరివేష్టించివున్న వాయుమండలం దాటిన తర్వాత. వుండే ప్రదేశమంతా కటికి నిశ్శబ్దంతో నిండి వుంటుంది. అక్కడ కాంతి రేఖలే లేనప్పుడు. మనకు తెలిసిన ముద్దినుసురంగు లెక్కడనుండివస్తాయి? అక్కడ ఘర్షణలేదు. బరువులేదు. వాయువే లేనప్పుడు. గంధ మెక్కడనుండి వస్తుంది? అక్కడి ఉష్ణోగ్రత ప్రమాణాలు ఊహాకందవు. దూరం, దూరం ఒకటే దూరం. అంతూ. దరిలేని ప్రదేశ పారావారం అది. మహా మేధావుల మస్తిష్కపు లోతుల అట్ట అడుగున ఏ కొంచమో రేఖామాత్రంగా, దీని రూపు గోచరిస్తుందేమో. ఈ మహాప్రదేశంలో మన భూమి, మన సూర్య మండలం, మన కంటికి మినుకు, మినుకుమంటూ కనిపించే అసంఖ్యాక తారకలూ. యితర ద్రవ్యసంచయమూ అంతా కలిసి ఆపగింజలో అరువందల కోట్లు గూడా వుండదు.

మానవుని మనుగడ అంతా భూమి మీదనే. అందునా, నేలను అంటిపెట్టుకునివుండే వాయు సముద్ర మధ్యంలో. పట్టుమని పది గజాలు అటూ, ఇటూ అయితే, ఊపిరి రాదిక ఉక్కిరి బిక్కిరై పోతాడు. అథవా, ఏవరైనా తెగించి నేల విడిచి సాముచేయదల్చుకుంటే నింగిలో 3½ మైళ్ళకు మించి పైకి పోలేడు. అప్పుడైనా. అందు కోసం యెంతో సాధన కావాలి. ఆ క్రొత్త పరిస్థితులలో బ్రదకటానికి కొత్త అలవాట్లు కావాలి. పాతవన్నిటినీ శరీరం మరిచి పోగలగాలి. ఇలాగ పైపైకి పది, పదిహేను మైళ్ళదూరం వెళ్లేసరికి గాలి ఒత్తిడి పల్చబడిపోతుంది. సముద్ర మట్టపు సమీపంలో ఉన్నదానిలో 20 వ వంతైనా వుండదు. 50 మైళ్ళ ఎత్తు వెళ్లేసరికి యిది యింకా పల్చబడిపోతుంది. అయినప్పటికీ భూమికి అభిముఖంగా రివ్వున దూసుకుంటూ అమితవేగంతో వచ్చిపడే వుల్కలు దీని ఘర్షణకు ఆవిరై పోతాయి. ఇలాంటి ప్రదేశంలో గంటకు లక్షమైళ్ళ వేగంతో. పైకి. పైకి యింకా పైపైకి దూసుకుపోయినప్పుడు. భూమికిగల ఆకర్షణశక్తి ప్రభావం క్రమ. క్రమంగా, క్షీణించిపోతుంది. ఈవిధంగా 12 వేల మైళ్ళదూరం ప్రదేశాంతరాళంలోకి పోయేసరికి భూమి గురుత్వాకర్షణ మహత్త్వం యెంత తగ్గిపోతుందంటే కాసు ఎత్తు ఎసమెత్తు అయిపోతుంది. బరువులో రూపాయిలు అణాలై పోతాయి.బండలు,బెండులై పోతాయి.

విశ్వాంతరాళపు విశేషాలను గురించి నేటి వైజ్ఞానికులకు చాలా తెలుసు. అయినప్పటికీ ఆ తెలిసింది. తెలుసుకోవలసినదానితో పోల్చిచూస్తే, చాలా తక్కువ. దాదాపు ఏమీ లేదనే చెప్పవచ్చు. అందుచేత చంద్రగ్రహయాత్రకు సమకట్టడానికి పూర్వం యింకా తెలుసుకోవలసింది చాలా వుంది. ఈ మహాప్రయత్నంలో అతి సున్నితమైన రికార్డింగుయంత్రాలనూ,కెమెరాలనూ, అమర్చిన రాకెట్లను 250 మైళ్ళయెత్తుకు పంపగలగడంలో యీనాటివారు కృతకృత్యులయ్యారు. అంతేకాదు గంటకు 1650 మైళ్ళ వేగంతో 90 వేల అడుగుల ఎత్తున ప్రయాణం చేయగల విమానాలనుకూడా నేడు నిర్మిస్తున్నారు.

ఇప్పటి మన యంత్రాలన్నీ వాతావరణ మండలంలో ప్రయాణం చేయడానికి అనువైనవి. సముద్రమట్టానికి సమీపంలో గాలిలో ఆమ్లజని చాలా యెక్కువ. అది విమానాలలో పెట్రోలు ఆవిరిశక్తిగా మారడానికి, యెంతో తోడ్పడుతుంది. అయితే. గాలి సాంద్రత విమాన వేగానికే ఒక పెద్ద ఆటంకం. పైకి పోయిన కొద్దీ, వాయువూ. దానితోపాటు ఆమ్లజని తక్కువైపోతాయి కనుక నిర్వాతసీమలో విమానాలను నడపడం ఒక పెద్ద సమస్యై పోతుంది. రాకెట్ యీసమస్యను కొంతవరకూ తీరుస్తుంది. ఎందుకంటే, దీనితోపాటు ఆమ్లజనినికూడా కావలసిన ప్రమాణంలోనింపవేసి తీసుకుని వెళ్ళవచ్చు. ఇంకా, భూమి ఆకర్షణశక్తిని తప్పించుకోవడం ఎలాగ అనేది యిందుకు సంబంధించిన మరొక సమస్య. ఏవస్తువైనా గంటకు 25 వేల మైళ్ళ వేగంతో ప్రయాణం చేస్తే భూమ్యాకర్షణ శక్తిని తప్పించుకోవచ్చునని మన వైజ్ఞానికులకు తెలుసు. ఆవిధంగా విశ్వాంతరాళంలో ప్రయాణంచేసే రాకెట్లను నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇప్పటివరకూ తమకు లభించిన విజ్ఞానం సాయంగా రాకెట్లలో ఇతరగ్రహాలకు ప్రయాణం చేయడానికి మొదటి మెట్టుగా ఒక కృత్రిమమైన ఉపగ్రహాన్ని ఒక దానిని సృష్టించి, విశ్వాంతరాళంలోకి వదిలిపెట్టాలని రష్యన్, అమెరికన్ విజ్ఞానులు కృషిచేస్తున్నారు. వచ్చే రెండు సంవత్సరాలలో సెకనుకు 5 మైళ్ళు అనగా గంటకు 18 వేల మైళ్ళ వేగంతో ప్రయాణం చేయగల ఉపగ్రహాన్ని వదలగలమని వారాశిస్తున్నారు. ఈ ఉపగ్రహంలో వివిధ యంత్రాల నమర్చి వాటి సాయంతో ఆయా ప్రాంతాలలో వాయు సాంద్రత, ఆకర్షణశక్తులూ, శీతోష్ణాలూ,

గమనాలూ, వగైరా వివరాలనన్నిటినీ తెలుసుకోవచ్చునని వీరాశిస్తున్నారు. సరిగ్గా తొంభై నిముషాల్లో ఒకసారి భూమిని చుట్టిరాగల యీ ఉపగ్రహంమీద అమర్చిన యంత్రాల తోడ్పాటుతో మన భూమిమీద ప్రతి చదరపు మైలును వివరంగా ఫొటోగ్రాపులు తీయగలమని కూడా భావిస్తున్నారు. అనగా 12 గంటలలో ప్రపంచంలో ప్రతి ప్రాంతం అడ్డుగుట్టు ఆనవాళ్ళతోసహా ఫొటో తీయబడుతుందన్నమాట అప్పుడు ప్రదేశాన్ని గురించీ, ప్రపంచాన్ని గురించీ, యింతవరకూ కాలగర్భంలో దాగివున్న అనేక రహస్యాలను అతి సుళువుగా తెలుసుకోవచ్చునని యీ వైజ్ఞానికులు ఉరట్లూగుతున్నారు. మొదటిదశలో, భూమికి ఒక ఉపగ్రహాన్ని సృష్టించి వదలి నట్లుగానే, రెండవ దశలో చంద్రునికి మరొక ఉపగ్రహాన్ని పదలాలని వీరిభావన. అందులో అమర్చిన యంత్రాల సాయంతో, చంద్రగోళపు స్థితిగతులన్నిటినీ సమగ్రంగా తెలుసుకోగలమనీ, అప్పుడు చంద్రమండలంతో సరాసరి సంబంధా లేర్పరుచుకోవచ్చునని ఎదురు చూస్తున్నారు.

ఈ కృత్రిమ ఉపగ్రహాన్ని వదిలే ప్రయత్నంలో. ఒక రాకెట్ల దొంతరను వదలాలని నిర్ణయించబడింది ఈ దొంతరలో మొత్తం మూడు రాకెట్లు ఒకదానిలో ఒకటి యిమిడి వుంటాయి. ఇందులో పైన వుండే పెద్ద రాకెట్టు ఉపగ్రహంతోపాటు రివ్వున గంటకు 25 వేల మైళ్ళ వేగంతో పైకి దూసుకుపోతుంది. ఇది ఇలా 50. 60 మైళ్ళు పైకి వెళ్ళేసరికి ఊడి ప్రేలిపోతుంది. దొంతరలోని రెండవ రాకెట్టు బలంతో ప్రయాణం యథాపూర్వ వేగంతో యింకా పైకి సాగుతోంది. అలా అది 250 మైళ్ళ పైవరకూ వెళ్ళి అక్కడ అదికూడా ఊడిపోతుంది. ఆ తరువాత ఉపగ్రహంతో మూడో రాకెట్ ప్రయాణం సాగిస్తుంది. ఇది ప్రయాణం చేసేచోటు. గాలిలేని గగనసీమ. ఆ తరువాత కొంత సేపటికి. ఆ మూడోది కూడా విడి ప్రేలిపోతుంది. ఉపగ్రహం మాత్రం రెండు మూడు వందల మైళ్ళ ఎత్తులో $1\frac{1}{2}$ గంటల సేపటిలో ఒక ప్రదక్షిణం చేసివస్తుంది. అది అలా తిరిగి తిరిగి నేలమీద పడి భస్మమైపోతుంది.

పథకమైతే చాలాబాగుంది. అయితే, దీనినిఅమలులో పెట్టాలంటే, యెదుర్కోవలసివచ్చే యిబ్బందులు అనేకం. మానవులను చంద్రమండల యాత్ర చేయించి, సురక్షితంగా తీసుకురాగల పెద్ద రాకెట్ విమానాన్ని నిర్మించాలంటే. ఎక్కడా ఆగకుండా. దాదాపు అయిదులక్షలమైళ్ల దూరం ఏకటాకీని ప్రయాణంచేయగలిగేటట్లు నిర్మించాలి. అంతేకాదు. భూమివాతావరణంనుంచి బయటకు దూసుకుపోయేటప్పుడూ తిరిగి, గగనసీమనుంచి, భూమిమీద వాయుమండలంలో ప్రవేశించేటప్పుడు ఏర్పడే ఘర్షణకు ఆగగల పటిష్టమైనదిగాకూడా నిర్మించాలి. అన్నింటిని మించి, యిది అనుకున్న ప్రకారం అమిత వేగంతో ప్రయాణం చేయగల్గి వుండాలి. ఇన్ని హిరణ్యాక్ష వరాలు సమకూరితేనే యిదిసాధ్యమవుతుంది. ఇందుకోసం అనేక మంది అనేకపద్ధతులు చూస్తున్నారు. భూమిమీదనో, లేక చంద్రోపరితలంమీదనో వాలేటప్పుడు సురక్షితంగా దిగడానికి వీలుగా పెద్దపెద్ద రెక్కలు ఈరాకెట్ విమానానికి బిగించాలని కొంతమంది అభిప్రాయ పడుతున్నారు.

ఈ రాకెట్టు ఒకసారి నిర్వాత మండలంలో ప్రవేశిస్తే అది దానంతటదే వేరేయింజను గొడవలేకుండా. అమిత వేగంతో తిరుగుతూనేవుంటుంది. ఇప్పుడు యీ ప్రదేశంలో మనము తిరుగుతున్నది గంటకు 65 వేలమైళ్ళ వేగంతో. అంటే ఇది భూపరిభ్రమణ వేగమన్నమాట.

చంద్రమండల యాత్రకు బయలుదేరవలసిన ముహూర్తంతోనాటు. భూమ్యాకర్షణ మండలం దాటిన తరువాత పాటించవలసిన ప్రయాణ వేగాన్నికూడ ముందుగానే లెక్క వేసుకోవాలి. లేకపోతే. ఇంతా కష్టపడి పంపించిన యీ ప్రదేశ వాహనం తిరిగి భూమినే చేరుకోవలసి వస్తుంది గంటకు 25 వేలమైళ్ళ వేగంతో ఏకటాకీని ప్రయాణం చేసేటట్లయితే. మన భూమినుంచి చంద్రగోళం చేరుకోడానికి అరురోజులు పడుతుంది. శుక్రగ్రహానికి 145 రోజులు పడుతుంది. కుజగ్రహానికి 250 రోజులు పడుతుంది.


ఈ విధంగా, నిర్మించబడిన రాకెట్టు కేవలం రసాయనికమైన యింధనాలతోనే గడపలేదు. మొదట్లో దాని బరువే అనేక లక్షలకోట్ల టన్నులుంటుంది. అయితే యీ బెడదేమీలేకుండా పరమాణుశక్తినుపయోగించి పంపించవచ్చు. ఇదంతా మొదటి ఉపగ్రహాన్ని పంప గలిగేంత వరకూ మాత్రమే. తరువాత రాకెట్టు ఉరవ పెద్దది చేయడం ఎలాగ అనే సమస్య మాత్రమే మిగులుతుంది.

అమెరికాలో పరమాణు శక్తితో జలాంతర్గామిని నడపడం మొదలయ్యింది. అలాంటి యంత్రంతోటే యిలాంటి ప్రదేశవాహనాలనీ నడిపించవచ్చు.

ప్రదేశ వాహనాలు మాసాలతరబడి ప్రయాణంచేయవలసి వుంటుంది గనుక. అవి ఎక్కడికక్కడ స్వయం సమృద్ధంగా హాయిగా కాలక్షేపం చేయడానికి అన్నిహంగులతోటీ వుండాలి. పైగా 18 వేలమైళ్ళవేగంనుంచి క్రిందికి దిగేటప్పుడు ఒక్కసారిగా 100 మైళ్ళవేగానికి తగ్గించుకో వలసివుండాలి.

ఇంతాకష్టపడి యింతగొప్ప రాకెట్టువిమానాన్ని నిర్మించుకుని మంచిముహూర్తం చూసుకుని చంద్రలోకయాత్రకు బయలుదేరితే. అదిమధ్యదోవలో యేఉల్కాదీకొట్టాకొని నమూనాలు లేకుండా నాశనమయ్యే ప్రమాదంవుంది. ఈ ఉల్కలు ప్రతి 24 గంటలకు 750, 000, 000, 00. కోట్లు మనభూమిమీదకి దూసుకు పడుతూనే వుంటాయి. కాని వీటిలో చాలా ఉల్కలు ఇసుకరేణువులంతంత వుంటాయి. ఇవి దూరదూరంగా వుంటాయి పైగావీటివల్ల కలిగే ప్రమాదమూ తక్కువే. అందుచేత యిదింత పెద్ద సమస్య కాదనుకోండి.

ఇప్పటికే రేడియోప్రసారక విజ్ఞానం మనకుచాలా ఎక్కువైంది. సమీపగ్రహాలతో రేడియో వార్తావహన సౌకర్యాలను పెంపొందించుకోవడంలో పెద్ద కష్టం లేదు. ఇప్పటికే మనభూమి మీదనుంచి పంపిన రేడియోతరంగాలు చంద్రోపరితలానికి తగిలి తిరిగి వచ్చాయి. అంటే రాకెట్లలో సూర్యుని ప్రదేశాంతరాళంలో ప్రయాణంచేసే మానవులు శక్తివంతమైన రేడియోప్రసార యంత్రాల సాయంతో ఎప్పటికప్పుడు తమ భావాలను మనభాషలోనే మనకు వినిపించవచ్చును. అయితే, యిందులో కొంత కాలహరణం వుంది. సెకనుకు లక్ష 86 వేలమైళ్ళ వేగంతో ప్రయాణంచేసే రేడియోతరంగం చంద్రోపరితలానికి తగిలి తిరిగి రావడానికి 2½ క్షణాలు పడుతుంది. అలాగే శుక్రగ్రహానికి వెళ్ళిరావడానికి 5 నిమిషాలు, కుజగ్రహానికి వెళ్ళి రావడానికి 9 నిమిషాలు పడుతుంది. ఏమైనప్పటికీ, ప్రపంచపుటపధులను అధిగమించి ప్రదేశపు అందాలను చూచిరావడానికి సఫల ప్రయత్నాలు సాగుతున్న యీ సమయంలో జీవించడం మన అదృష్టం కాక మరేమిటి ?



నందపూరు ప్రభుత్వ వ్యావసాయక క్షేత్రంలో యంత్రాలే పంటలను కోసి కుప్పలు పెడతాయి.

అంతర్వాహిని

శ్రీ కందుకూరి లింగరాజు

"నువ్వు రణపెంకివి;రాలుగాయివి అయిపోతున్నావు"

"ప్రపంచంలో ఎటువంటి శాంతమూర్తయిన మగాడు కూడా, నీ కాల్చుకుతినడం ముందర ఆగలేడు".

"ఏదో అంటే ముట్టనట్లుగా సంసారం నెట్టుకు వస్తున్నాను కాని, నీలాంటిమనిషిని పెళ్ళాడి, ఇంకొకడైతే, ఈపాటికి జంధ్యాలు తెంపి సన్యాసుల్లో కలసిపోయేవాడు"

లంపరసలో గత మాసం పైనుండీ పరుశురామయ్య అంటూవుండడం, అదీ సమయా సమయాలు లేకుండా, అనేసి పేలాకోళం అన్నట్లు నవ్వెయ్యడం జరుగుతూనే వుంది. ఇల్లాంటివి విన్నప్పుడల్లా లలితమ్మకు ఉరేసుకున్నట్లు వుండేది. తన్ని సంపుటీకరించుకుంటే, ఇదమిద్ధంగా తను మారిన విషయం ఏమీ కన్పించటంలేదు. అల్లాంటప్పుడు, ఆయన ఎత్తిపొడవటంలో సందర్భశుద్ధి కన్పించటం లేదు.

ఆ మొట్టమొదటి రోజులు జ్ఞాపకంగా తిరిగేవి. అప్పుడు కళ్ళల్లోకి చూస్తూనే ప్రపంచాన్ని మరచిపోయానని, రాత్రీ, పగలూ, దినాలూ, వారాలూకూడా తను ఎదురుగా కూర్చుంటే, తెలియకుండానే గడిచిపోతాయని, చెవులో రహస్యంగా రామనామస్మరణ చేసే ఆయన, ఈ గత కొన్ని రోజులనుండీ ఇంత కఠినంగా ద్వేషంతో తనెదురుగ్గానే అనెయ్యడం హృదయాన్ని తోడేసినట్లయ్యేది.

ఇంట్లోకూడా, ఐదేళ్ళ సంసారం నడిచినా ఇంకొకళ్ళు లేక పోవడం వల్ల తను, ఆయన అన్నదే సంసారం క్రింద జమవేసి పూర్ణంగా ఆయనకొరకు కేంద్రీకరించింది. ఆరాధనాకల్ల చేసుకుంది. ఇంత త్యాగం చేసినా ఆరాధన అన్నదాని క్రింద విచిత్ర రకరకాల పరిస్థితులు అనురాగంలో వొనర్చినా, కృతజ్ఞత లేకుండా, ఈసడింపు మాటలు అనడం మనస్సును విరిచేసింది,

ఒక్కొక్కసారి ఎదుట నిలబెట్టి అడుగుదామని ఆయత్తత కల్గేది. తీరా అడిగితే ఏం రాద్ధాంతాలు లేచి, అన్నం తినడం మానేసి, రాత్రల్లా ఎడతెగకుండా సిగరెట్లు కాలుస్తూ కూర్చుంటారని భయపడి అడగలేక పోయింది. ప్రతిరోజూ 'సిగరెట్లు కాల్చకండి' అని తనుపోరు పెట్టడం వల్లనే, ప్రతీకారంలో ఇల్లామారితే, మానేస్తుందన్న భావనలో మొదలు పెట్టేరేమో అన్నదీ తట్టింది. కాని ఇంత అల్ప విషయానికి అంత కఠినత్వం వహిస్తారన్నది, తొడుక్కోని కోటులా వుంది.

ఆ రోజుల్లో పత్రికల్లో ప్రచురించిన ఆయన కథలు చదివేది, ప్రతికథలోనూ తన్ని ఏదో పేరుతో, ఎత్తిపొడవడమో న్యూనపరుచడమో, కన్పించింది. ఈ నాటి కథలకు ఆ నాటి వాటికి నిష్పష్టంగా తేడా కన్పిస్తూనే వుంది. ఒక్కొక్క కథ చదివినప్పుడు, ఆయన దృష్టిలో తను ఎంత నీచస్థితిలో వుందో అని తట్టినప్పుడల్లా, ఇంకెందుకు జీవించడం, అనురాగం అధఃపాతాళాన్కి వెళ్ళినప్పుడుఅన్న ఉద్రేకమూ వచ్చేది. జీవితంమీద విరక్తిరోతా కల్గి ఏ అఘాయిత్యపుపనికేనా ప్రోత్సహించడంకూడా జరిగేది. కాని అది పిరికితనం యాపొందించుకోలేక పోయేది

మళ్ళీ ఎప్పటికైనా తనదారిలోకివచ్చి, సముదాయింపు కల్గదా అన్న ఆశను వదులుకోలేక వుండి పోయింది లలితమ్మ.

ఆరోజు ఆకాశంనీలిరంగుతో, ఎడంవైపు పైగా గులాబీముద్రతో, ముత్యాలాపేరులాంటి ఎడ్రసు వ్రాతతో కవరు వచ్చింది. కవరు చూచేసరికి అనుమానం కల్గింది. ఇదే పెద్దదయి, ఉత్తరం చింపి చదవాలన్న ఉద్రిక్తతా కల్గింది. మడతలు విప్పుతుంటే చక్కని సెంటువాసన వేసింది. దాంతో అనుమానం గుబాళించి ఉక్కిరి బిక్కిరీ చేసేసింది. "నేను కాకుండా, నావెనుక ఆయనకు...." తట్టుకోలేకపోయింది.

ప్రియమైన.... ....

మీ ఉత్తరం.

చాలాకాలం నుంచి మిమ్మల్ని చూడాలన్న కోర్కె పెరుగుతూనేవుంది. కనీసం మీరు పంపిన ఫొటోకు కృతజ్ఞురాల్ని.

గత కొన్ని నెలల నుండీ మీ కథల్లో మీ హృదయం సంసారంలో ఎంత సుఖం లేకుండా వేగిపోతోందో అన్నది నన్ను చాలా ఆర్ద్రి పరుస్తోంది. కళ్ళమ్మట నీళ్ళు తెప్పిస్తున్నాయి.

ఒకోరి కొకరు. సంపూర్ణత్యాగం చేస్తేనే కాని సంసారం నడవదు అని ఎలుగెత్తి చాటినా. మీ భార్య ఆవిడ మూర్ఖత్వం ఎందుకు మిమ్మల్ని ఈవిధంగా హింసిస్తోందో అర్థం కావటంలేదు. ఆవిడ ఏ పెద్దపులో బ్రహ్మరాక్షసో అయివుంటుందని, మానవత్వం పూర్తిగా పోగొట్టుకున్న వ్యక్తి క్రింద తడుతోంది.

దీనికి నా హృదయపూర్వక సానుభూతి.

ఏనాటికైనాసరే. మా ఇంటికి ఆహ్వానం పలుకుతుంది. ఆదినం ఎప్పుడు వస్తుందో అని వెయ్యి కళ్ళతో వేచియున్నా.

మీ

లక్ష్మి"

పూర్తిగా చదివేసరికి కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి. ప్రపంచక దృష్టిలో తను ఎంత పతనమైపోయి, ఉన్నతి పోగొట్టుకుందో ఎదురైంది. దాంతో ఏడుపు వచ్చింది.

యథాలోపంగానే. ఆరోజు భోజనం చేస్తూవున్నప్పుడే "నువ్వు పెద్ద పులివా? బ్రహ్మరాక్షసివా?" అని ఆయన అడిగాడు.

"మహమ్మారిని" అని కోపంతో ఒక్కసారి అనేయ్యాలనుకుంది. కాని ఆ ముక్క నోరు పెగిలి రాలేక పోయింది.

• • •

నల్లమందు అలవాటుకు పూర్వం చాలా చిన్న వంతే. ఆవగింజంలో అరసగంతోనే ప్రారంభిస్తుంది. దాంతర్వాత అది కుంకుడుగింజంత అవుతుంది.

ఒక్కరోజు విప్పిన ఉత్తరంలోని విషయంవల్ల, ఇంక ప్రతిరోజూ వచ్చే వుత్తరాలన్నిటిని చదవాలన్న కుతూహలం రేకెత్తితే, చంపుకోలేని నిస్సత్తువులోనే, అన్నీ నెమ్మదిగా ఊడతియ్యడం, చదవడం మళ్ళీ అంటించడం ఓ నిత్యకృత్యం అయ్యింది లలితమ్మకు.

ఈ రెండు మూడు రోజులకు వచ్చిన ఉత్తరాల్లో ఒకటి రెండింట్లో తప్పకుండా తన్ని దుమ్మెత్తి పొయ్యడం. ఆయన్ని ఆదరాభిమానాల్తో ఆహ్వానిస్తూ, ప్రేమ చిదిమిపెడతామని ఆఖరు చెయ్యబడేవి వుండేవి. ఈ బరిదెగించిన యువతీరత్నాల ఉత్తరాలు చూస్తూంటే, ప్రపంచం ఎంత మారిపోయిందో అనుకుంది. తనుకూడా అల్లా మారిపోతే అన్న ఆశ విరిజ అయినా మారలేదు. ఎంచేతనంటే. ఈ నూతనంగా కాలేజీల్లోనుండి బయటికి వచ్చిన వాళ్ళ ఆదర్శాలు, విజ్ఞానాలకంటె తను అలవరచుకున్న అలవాట్లు ఆరాధనలూ కూడా అయిదు సంవత్సరాలు ముందరికి పురోగమించి వున్నాయి కనుక.

క్షణికం. ఈ లక్ష్మి, అనసూయ, అరుంధతి, పద్మిని, సీత వగైరాల బృందంతో ఆఖరైన ఉత్తరాలన్నీ పట్టుకుని "ఏమండీ! వీళ్ళందరి దృష్టిలోనూ కూడా అంత నీచంగా వున్నానా నేను? మీరు కూడా గానితో ఏకీభవిస్తున్నారా?" అని నిలబెట్టాలన్న ఉద్రేకం వచ్చింది. కాని ఏరోజు వచ్చిన ఉత్తరంలోని సంగతులు. అదే రోజున తనకి ఏదో ఓ సందర్భంలో వప్పగించెయ్యడంతో. ఈ ఆరాటం అన్నది పట్ల తెలివితక్కువతనంగానే కన్పించింది. అది తన వ్యక్తిత్వానికే లోపం అని తట్టింది.

ఎన్ని తట్టినా, అవన్నీ సత్యంలా వుంచడంతో, ఉత్తరాలు హెచ్చేయి. వ్రాసిన వాళ్ళు పునః విపులీకరించడం, సాగతియ్యడం, అనునయాలు జారీచెయ్యడం, స్వాగతాలు పంపడంతో ఆ నెలంతా నిండిపోయింది. ఆ ఉద్రుతాలు ప్రతీకారాన్ని ప్రోత్సహించేయి లలితమ్మలో.

ఆరోజు కూర్చుని ఉత్తరాల్లో ఇచ్చిన చిరునామాలకి పేరు పేరునా "మీరు గ్రహించినది నే చిత్రించ గలిగినంత రాయిగాయి తనంలోను చాలా కొద్దీ భాగం. ఒక్కసారి ప్రత్యక్షంగా చూచివుంటే ఎంత యమలోకం అనుభవిస్తున్నానో తెలిసివస్తుంది.

స్వానుభవంలో సుఖదుఃఖాల్ని నిర్ణయించడంముఖ్యం ఎంచేతనంటే పరోక్షంగా చేసినవి నిల్వలేవు కనుక. అవి నిరాధారంగాను వుంటాయి.

రేపు ఆదివారం, మాఇంటికి తప్పకుండా రావలసిందని కోరుతున్నా నా ఈ అభిమాన ఆహ్వానాన్ని మన్నిస్తారని ఆశిస్తున్నాను"

అనివ్రాసి పోస్టులో వేసింది. అవన్నీ అయ్యింతర్వాత తీరా కట్ట కట్టుకుని వీళ్ళందరూ వస్తే తనేం చెయ్యాలి అన్న విషయంలో గాభరా కల్గింది. తీరా వాళ్ళతో కలసి ఆయనకూడా, చిత్రవధకు పూనుకుంటే ఇంట్లోంచి లేచి పోవలసేపరిస్థితి వస్తే. అప్పుడు తనంతటతాను ఆకులు పట్టుకోవలసే స్థితిలోకివెళ్ళడం తటస్థించడం తధ్యంఅవుతుంది. ఇది వస్తుందా రాదా? అన్నది నిర్దుగ్గా చెప్పలేని విషయం.

అయినా. ఇప్పుడు ఆ ఆదివారం కోసం తను వేచియుండడం కంటే చేసేదేమీ కన్పించలేదు. ఆనాడు తన నాతకాన్కి ఫలితం దశ, అంతర్దశల్తో చెప్పబడితీరాలి. అదేమిటో అన్న ఆందోళన తప్ప ఇంకేమీ పెట్టుకోలేదు.

• • •

ఒక్కరైల్లో ఒకే పెట్టిలో. ఒకేపూయనుండి బయలుదేరి. ఒకే గమ్యస్థానంకు అప్పుడు ఆ అందరూనుమంచి, ఒకేసూరు తనింటికి. తన్నే ప్రత్యేకంగా యాత్రానికి రావడం పరశురామయ్యను ఉల్లా పల్లా చేసింది. 'ఎందుకు' వచ్చేరు ప్రశ్నకు సమాధానం తనుచేసుకోలేక పోయేడు. చూచాయగా. వాళ్ళ వుత్తరాల్లో వ్యక్తపరచిన ప్రేమని. అనురాగాన్ని. ఆపేక్షని, ఉమ్మడిగా ఇప్పుడు ప్రదర్శించడం ప్రారంభిస్తే, సన్యాసత్వం పుచ్చుకోవలసి వస్తుంది. పైగా లలితమ్మ?

ఖంగారుగానే లోపల్కివస్తూ, వాళ్ళంతా వచ్చేరని, కాస్త కాఫీ తయారు చెయ్యమని ప్రతిమాలినట్లే విన్నవించుకున్నాడు. లంచం అన్నట్లే తాను బజారుకువెళ్ళి ఫలహారం తెస్తాననీ చెప్పేడు.

'ఓసారి! సావిట్లోకి వస్తావా? వాళ్ళందరికి పరిచయం చేస్తాను" అనీ అన్నాడు.

ఆయనలోని ఖంగారుకు నవ్వుకుంది. అందులోనే "ఏమని?" అని కళ్ళతోటే అడిగింది.

పరశురామయ్యా నిజంగా దీని విషయం ఆలోచించలేదు. పైగా ఇన్నాళ్ళూ తన కావ్య పఠనంలో ఆవిడని, అన్నమాటలన్నీ గుర్తుకుతిరిగితే. ఈసమయంలో ఎదురు తిరిగి మొరాయిస్తే. నిజంగా చేతులు ఎత్తెయ్యాలి దాసోహం అంటూనే.

చూచేడు ప్లేటుల్లో తీపి ఒకటి, కారంపెట్టి, కోపాల్లో కాఫీ పోస్తుంటే తెల్లబోయేడు. సరిపడ్డట్లుగానే కోపాలు లెఖ్కపెట్టేయి.

"తీసుకు వెళతారా?" కొలుకుల్లోంచి నవ్వింది.

ఆశ్చర్యం తేరుకోలేకనే "జీ హుజూర్!" అన్నాడు. తనకి ఎండలో శ్రమ తప్పించినందుకు.

ట్రేలో కాఫీలు పట్టుకుని ఆవిడా బయల్దేరింది, సావిట్లోకి వచ్చేసరికి, అన్నిజతలు. ఆపాదమస్తకం సమీక్షకు పూనుకున్నారు. ఓ విధంగా సిగ్గు వచ్చింది, వాళ్ళవయస్సుని చూస్తే. తనకు జ్ఞానంలోపే అనుభవాన్కి ఉన్నంతైనా వయస్సు ఉండక పోవడంతో. వాళ్ళ ఎడ అనురాగం కల్గింది. వాళ్ళ పెద్రితనాన్కి బోళాతనాన్కికూడా జాలిపడింది ఈ పై మెరుపు విజ్ఞానానికి నొచ్చుకోనూ నొచ్చుకుంది. వాళ్ళంతా తనవాళ్ళే అన్నట్లు అయిపోయింది.

"ఈవిడే నా భార్య" అన్నాడు పరశురామయ్య.

అందరూ చెయ్యెత్తి నమస్కారంపెట్టేరు. ఇదమిద్ధం కాని భావాలు, గౌరవం ద్వేషాలమధ్య వాటల్లో చిత్రించుకుంది. ఒక్కసారిగా లలితమ్మ ఉక్కిరి బిక్కిరై పోతే యవ్వనంలో కులికి పోయింది. కను బొమ్మలు ఎరుపెక్కాయి.

"అమ్మాయిలూ!" అంది. అంతే సిగ్గు పులిమితే లోపల్కి వెళ్ళిపోయింది.

పరశురామయ్యా టీక చెప్పలేక మౌనం వహించేసేడు. ఈ గోచీపోసి కట్టిన చీర, మోచేతిల వరకూ రవిక, ఒక్క నల్లపూసలతాడు, చేతికి రెండుమూడు గాజులు, మొఖాన్కి దమ్మిడీ అంతబొట్టుతో లక్ష్మిలా ఉన్న ఈ విడలో, తాము నిర్దేశించిన క్రౌర్యం నిబిడీ కృతం అయివుందా అన్నసందేహం అందరిలోను. రేకెత్తితే, ఒక్కొక్కళ్ళే లోపల్కి వెళుతూ, వస్తూ, సీతాకోక చిలుకలే అయిపోయి. సావిట్లో అలంకరించేసేరు.

అంతసేపూ కూడా లలితమ్మనోరు కుట్టేసిన పెద్ద తనంలోనే సదుపాయాలు చూపించేసింది.

రెండుకూరలుతో, పాయసం వగైరాల్తో, అన్నపూర్ణే అయిపోయి, వాళ్ళందరికి ఒక్కసారిగానే. సహపంక్తిగా ఆయనతో కూర్చో పెట్టేసింది.

ఆరాత్రి వాళ్ళు కబుర్లు చెప్పేరు ఆయనతో. ఆయన మాట్లాడేడు. అన్నీ వింది.

నిద్రపోతుంటేనే కలలుగన్నట్లే అయ్యింది ఆరోజు.

• • •

ఒక్కళ్ళూకూడా, ఏదో తప్పిదం చేసినట్లే తన ఎదుటపడి, ఆంక్షలేకుండా మాట్లాడ లేక పోవడం నవ్వు తెప్పించింది లలితమ్మకు. ఈ ఆంక్షలోనే ఆహ్వానపు ఉత్తరాన్నిగూర్చి ఒక్కరూ ఎత్తనేలేదు.

భోజనాలైన తర్వాత తాంబూలాలు వేసుకుంటు నప్పుడే ఆయన, తనకీ ఆయనకీ జరిగిన సిగరెట్టు పోరాటానికి. చిలవలూ పలవలూ అల్లి చాలా మధురంగా వర్ణించేరు. అందరూ కూడా. నవ్వుతుంటూనే విన్నారు.

ఈ వకీళ్ళల్లా వచ్చిన వాళ్ళపర్యవేక్షణ. అవయవాల్ని చిత్రవధచేసి విజ్ఞానం నేర్చుకునే డాక్టర్లలాగే. తనకవలిక మాట, పొందికగల ప్రవర్తనను సమీక్ష చెయ్యడాన్కి ప్రయత్నించడం కనపడితే. అదీ ఓ విచిత్ర అనుభూతిని కల్గిస్తే. వీళ్ళంతా వాదులుగాను, తను ప్రతివాదిగాను. ఆయన అనే జడ్జి కోర్టులో తగువు తీర్పు వలసించినాను. ప్రయత్నాలు సల్పడం, ఓ చక్కటి శృంగార కావ్యంలాగే ఉట్టింది.

సహజంగా, సరైన వాతావరణం, అవకాశం ఇవ్వాలి వాళ్ళకు అన్న భావనలోనే ఆ రోజుల్లో. వాళ్ళందర్నీ కూర్చోపెట్టి వరసాగ్గా జడలు వెయ్యడం, పువ్వులు తురమడం, దగ్గరనుండి, ఆఖర్కి నిద్రపోయేవరకూ కూడా చేయవలసిన సపర్యలన్నీ తనే చేసింది. దీంతో అర్థం కాని కుమిలింపు. తప్పిదాల్లో వాళ్ళు ఎండ మావుల్ని చూచిన పాంధుడిలా వుండడం మనస్సును నొవ్వచేసింది ఇంత వెర్రిబావుల పిల్లలు ఎల్లా జీవితంను నిగ్రహిస్తారు. అని జాలిపడింది.

ఒక్కొక్క సమయంలో "ఏం తల్లీ! నేనంత బ్రహ్మ రాక్షసినా ?" అని అడుగుదామనుకుంది. కాని వయస్సు ఇప్పుడు వాళ్ళ ఎడ కల్గిన అవాజ్య అప్రీయతకూడా నోరు కుట్టేస్తోంది.

ఆరోజు సినిమాకి కట్టకట్టుకుని వెళ్ళి వచ్చిన తర్వాతనే, భోజనాలదగ్గర "ఏమండీ! మమ్మల్ని అందర్నీ కూడా తప్పు మార్గాల్లోకి పోయేట్లు దగా చేసేసేరు. దానివల్ల మేం అందరం కూడా వట్టి మూర్ఖులం అయిపోయేం" అంది పద్మిని.

"ఔను" అంది లక్ష్మి.

తక్కినవాళ్ళు తలలూపేరు.

"నేనేం చేసేనమ్మా" ఆయన అమాయకం కరుడు కట్టినట్లే అన్నాడు.

"మమ్మల్ని అందర్నీ వట్టి వాజమ్మల్ని చేసేసేరు. అందుకే అమ్మని వ్రాసేయకూడా ? అవునా కాదా ?"

లలితమ్మ ఊపిరి బిగబట్టేసింది.

"నేనా ?"

"అవును. పైగా అల్లా అడుగుతారేం! మీరు ఉత్తరాలు వ్రాయలేదూ ?"

"లేదే"

అంతా ఓసారి తెల్లబోయేరు. ఆవిడ వ్రాస్తుంటుంది అన్నది. నిస్సందేహంగా ఇప్పుడు సత్యం అయి కూర్చుంది.

లలితమ్మ వెయుగువడ్డిస్తూనే "మిమ్మల్ని అందర్నీ ఓసారి చూడాలని, నేనే వ్రాసే" అంది చాలా నెమ్మదిగా.

ఉండేలు దెబ్బ తిన్నట్లు తెల్లబడ్డారు. పరుశురామయ్య కళ్ళప్పగించేరు.

"ఇన్నాళ్ళూ మీరంతా, నన్ను ఓ బ్రహ్మరాక్షసి, మహమ్మారి, పెద్దపులి, రణపెంకి, రాలుగాయి వగైరాల క్రింద జమవేసేరు. అయినా తందానతాన అన్నట్లు కథలు అల్లేరు. మరి ఈనాడు నేను........" ఉద్రేకం ఉక్కిరి బిక్కిరి అయింది. మాట్లాడలేక వూరుకుంది.

పరుశురామయ్య "ఆకథల్లో భార్యలు కాని తమరు కాదు. మహారాణీ!" అన్నాడు.

"మరి...."

గట్టిగా నవ్వుతూనే "దాసోహం! అడియేన్ దాసోహం.... తోబా, తోబా తప్పయిపోయింది"

అంటే వాళ్ళూ నవ్వేసేరు.

ఒక్కసారి దధి సముద్రం అయిపోయింది. వాళ్ళంతా ఒక్క కంఠం అన్నట్లే"

"అమ్మగార్ని గూర్చి ఇంక ఇల్లాంటి కథలు వ్రాస్తే మేం ఒప్పుకోం" అని ఖండితంగా తీర్పు చెప్పేసేరు.

పరశురామయ్య వామపక్షం అయిపోవడంతోటే ఆర్ద్రిత అంతా చిలికుతూనే "లలిత నా జీవితంలో ఓ వెలుగు. ఆ వెలుగునే స్ఫటికంలోంచి చూస్తా. ఇంద్ర ధనస్సులు చిత్రిస్తా. అవిదే లేకపోయివుంటే .... ఈనాడు మీరు ఊహించినంత గొప్పవాణ్ణి కాలేకపోయేవాణ్ణి" అనేసేడు.

లలితమ్మ పూర్తిగా సిగ్గుపడిపోయి "చాల్లెండి. ఏదో నన్ను సామాన్యుల లిస్టులోనే వేయండి" అంటూనే వంటింట్లోకి తుర్రుమంది.

ఒక్కొక్కళ్ళే వెళ్ళిపోయేరు. తను పొదివి పట్టుకునే వాళ్ళ చేతుల్లో రవికల గుడ్డలు. తాంబూలం పెట్టింది. హృదయం నమిలేసినట్లయింది. వాళ్ళ ఎడబాటు.

పరశురామయ్య. బోసిపోయిన ఇల్లు చూస్తూనే "శ్రీవారు. గోడకుర్చీ వెయ్యమన్నారా? గుంజీలు తియ్యమన్నారా?" అనేసేడు.

రుసరుస లాడుతూనే. వక్కో దూర్చుని, గుండెల్లో తలపెట్టి రాధాత్మత పొందింది లలితమ్మ.

• • •

ఒక్కొక్కళ్ళ శుభరేఖల కోసం ఇద్దరూ ఎదురు చూస్తూనే వున్నారు.

★ మనస్తత్వాలు ★

శ్రీ కొంపల్లి బ్రహ్మానందరావు.

"పాలడబ్బా అయిపోయింది. ఆఫీసునుంచి వచ్చేటప్పుడు బజారుకెళ్ళి కొనుక్కురండి" అంది భార్య ఆఫీసుకెళ్తూన్న రంగాన్ని.

"మొన్న నేగా తెచ్చింది!" కొద్ది కోపంతోనే అన్నాడు.

"అవును" అని ఊరుకుంది.

"ఒహో! అన్నిసార్లే అయిపోయిందని చెప్పటానికి, కారణం దొరక లేదు కాబోలు!"

"బాగుంది. నేనేమయినా మింగుతున్నానా? రెక్కంత డబ్బా ఎన్నాళ్ళు వస్తుందని?!"

"ఏమో! తల తిరిగిపోతోంది ఈ పాలడబ్బా ఖర్చుతో! ఉన్నది ఒక్క సంతానం! పాలడబ్బాలకు మితంలేదు..." గొణుగుకుంటూ గడప దిగి వెళ్ళిపోయాడు

రాజ్యం భర్త పరిస్థితి అవగాహనం చేసుకుంది. పాలడబ్బా కొనుక్కొచ్చి నాలుగు రోజులైంది. మూడేండ్ల వయస్సుగల పిల్లకు పాలడబ్బా ఎన్నాళ్ళు వస్తుంది? వృధాగా పారపొయ్యటానికి తనకు కూడా జ్ఞానముంది. తను త్రాగేందుకు... భర్తకు ఆలోచన శూన్యం. కేవలం తన సంపాదనను తినడానికే వచ్చాననుకునే వ్యక్తి. ఇంట్లో కాఫీ పొడి అయిపోతే తెమ్మనడం తప్పు. పాలదాన్ని లెక్క చూడండి అంటే కసరటం. పనిదానికి జీతం ఇవ్వమంటే రెండు చేతులు మొహంమీద పెట్టుకోవడం.

చీరలన్నీ చినిగి తుంపులయిపోయినయి. నా సంగతి కాస్త పట్టించుకోండి" అంటే సమాధానం "నా పెట్టె నిండా పట్టు ధోవతులు అమర్చుకున్నాను. తీసుకుని అలంకరించుకోండి" బట్టలు కొని ఇమ్మనడం ఘోర కృత్యం.

"ఉగాది వస్తోంది. మన చిట్టి తల్లికి చిన్న గౌను కుట్టించండి" అన్నపుడు తను ఏమన్నారో తెలుసా, వాళ్ళకున్నది, వాళ్ళమ్మాయికి కుట్టించుకున్నారు. దాన్ని జూసి మనం కూడ అనుసరించాలంటే చాలా కష్టం. ఈ ఓర్వలేని స్వభావాలు కూడదు. పోతే స్త్రీ జాతికున్న నాశనం తప్పదు.

పండగంటే అందరూ బట్టలు కుట్టించుకుంటారు. ఇంటి పక్క అమ్మాయి మంచి దుస్తులు కొనుక్కొంది. పిన్నిగారూ పిన్నిగారూ! అంటూ తనకు చూపించాలని వచ్చింది. చాలా బాగున్నాయమ్మా, మా లలితకుకూడా కొంటాను సాయంత్రం! అనడం జరిగింది. అందుకని ఆ పిల్లని చూసి ఓర్వలేకపోవడమా! ఎంత విచిత్రం! నీ కూతురికి కూడా బట్టలు కుట్టించండి అనడం ఆ పిల్లను చూసి ఓర్వలేకపోయి......!!"

"పోనీ పండక్కి ఇంటికి పోతాను. నాన్నగారు పదే పదే వ్రాస్తున్నారు. పంపిస్తారా?"

"ఎపుడు వ్రాసారు?"

"చాలా సార్లు. నిన్న కూడ ఒకటి వచ్చిందిగా?"

"ఇప్పటికి ఎన్నిసార్లు వ్రాశారు?"

"అదేం ప్రశ్న? వచ్చిన ఉత్తరం మీరు చూసే నాకిస్తున్నారుగా!"

"ఏమన్నారు?"

"ఏమంటారు! పండక్కి రమ్మన్నారు ఇద్దర్నీ!"

"నన్ను కూడానా?"

"అవును!"

"అయితే వచ్చి తీసుకెళ్ళకూడదూ!"

"అదేం మాటండి! వాళ్ళకూ అక్కడ బండెడు సంసారం! అమ్మయితే కదల్లేని స్థితి. అదీగాక తమ్ముడికి పరీక్ష సమయాలు. నాన్నగారు ఆఫీసు గొడవలు ఆపీని."

మనస్తత్వాలు

పెళ్ళయి అయిదేండ్లు అయింది. ఇంకా మామగారువచ్చి అల్లుణ్ని బతిమలాడడం అంటే అది విపరీతమైన కోరిక. ఇంకా నల్గురి కూతుళ్ళకు వివాహం చెయ్యవలసిన ఆయన. కేవలం పెద్ద అల్లుడికే అంటే చాల కష్టం. పండక్కి రమ్మని వ్రాసేవారు గానీ ఇంటికొచ్చి తీసుకుపోవడం అంత వయస్సుగల పెద్దాయనకు భారమైన వ్యవహారం! కొత్త అల్లుడిగానే ఎల్లకాలం వుండిపోవాలంటే అతీతమైన ఆశయం!

"ఏమంటారండీ! పంపిస్తారా లేదా?"

"ఇదుగో చూడు. ఈ పండక్కి వేధించకు. మీ నాయనగారిలాగ నాకూ ధనరాశి వుంటే నిరభ్యంతరంగా వెళ్ళొచ్చు. నాల్గొందల మైళ్ళున్నా విడిచిపెట్టి వచ్చే వాణ్ని. అయినా పండగ ఇక్కడ మటుకు లేదటే పిచ్చి దానా! వీలయితే వచ్చే ఏడు కోరుకో..."

భార్య అంటే భర్తకు అదొక సులకన. తనొక్కడే ఘనుడు అనుకోవడం తప్పులేదు. ఏళ్ళ ఎదురుగా వున్న భార్యకూడా కనీసం మనిషే అని కూడా అనుకోవడం తప్పా. దాదాపు ఇరవయి సంవత్సరాలు పుట్టిన ఇంట్లో తోబుట్టువులతో పెరిగాను. చెల్లాయిలతో కలిసి పెరిగాను. తమ్ముళ్ళతో ఆడుకున్నాను. అందరూ పంక్తిగా కూర్చుని భోజనం చేసేవాళ్ళం! పండగ వస్తోందీ అంటే ఎంతో సరదా పడేవాళ్ళం. నాన్నగారు ఓ చిన్న బట్టలషాపు కొని తెచ్చేవాళ్లు. ఏది సెలక్టు చేసుకోవాలో అర్థమయేది గాదు. పండగ అంటే ఎంతో ఇదిగా గడిపేవాళ్ళం. ఆడ పిల్లలం అని అమ్మ మాకు ఇంకా ఏమేమో చేసేది. ఎంతో తాపత్రయ పడేది. సినిమాలనీ, నాటకాలనీ ఎంతో తియ్యగా గడిచేది దినమంతా. అలాంటి చోటికి తను పోవాలను కోవడం పిచ్చికోరిక! నేను పిచ్చిదాన్ని. "వచ్చే ఏడు కోరుదికోలి..." ఈ ఏటికి అయింది!! పండగ ఇక్కడా వుంది. అక్కడా వుంది! ఇక్కడ వున్న పండగ కనిపిస్తోందిగా! హుషారులేనిరోజు. చినిగిన బట్టలు. కూతురుకు గౌను ఇవ్వలేని తల్లి చేసుకుంటున్న పండగ!

"ఏమండీ! నేను వూరికి పంపించమని అడగను. అక్కర్లేదుగూడ. కానీ పాపాయికి గౌను కొనివ్వండి చాలు"

"ఈ పండగ వున్నదే చూశావో లేదో నెల ప్రారంభంలో రాలేదు. మధ్యలో ఏర్పడింది. చేతులో కానీలేదు. బాధపడనవసరంలేదు. మన అమ్మాయికి బట్టలు కొనకపోతే బాధ ఎందుకే పిచ్చి వెధవా! అంతగా అంటే నీ పాత చీరలేదూ. అది చింపి......"

"నమస్కారం ఇహ చాలండీ మీ సలహాలు"

"అయితే అనతలకు దయచెయ్యి. నా బుర్ర వేడెక్కించకు."

ఆయనతో తనుపడే అగచాట్లు చెప్పుకుంటే తీరేవికావు. దాంపత్య జీవితం కలిగివున్న దంపతులుకారు అనుకుంటారు అందరూ! అందకని నోరు మూసుకోవాలి. భర్తమీద భార్యకు అనురాగం ఉండాలట! ఓర్పు అవసరం! ఆఫీసు నుంచి రాగానే ఆనంద సంతోషాలతో స్వాగతం ఇవ్వాలట! కానీ ఆ భార్య స్థితిగతులు చెవికెక్కించుకోటానిక్కూడా వీలుండకు తనకు! మంచి బట్టలవసరంలేదు. ఆభరణాలు అవసరంలేదు కానీ శుభ్రంగా కనిపించకానిక్కూడా కొన్ని అవసరం అన్నది గ్రహించరు. పైగా కొనుక్కోండీ అంటే "మనమేం భోగం వాళ్ళం కాదు" అని కసరడం ఎంత వివేకమో!

ఎంత ఓర్చుకున్నా ఓర్పు కరిగిపోతుంది. "స్త్రీకి ఓర్పే ఆభరణమట" ఓర్పును పరీక్షించాలంటే నెగ్గటం సులభం.

అన్నీ మానుకున్నాను. ఏమీ అవసరం లేదు. ఎలాగో బతుకుతాను నా అదృష్టం ఇంతే అనుకుంటాను. కానీ "తన కూతురుకు పాలడబ్బా తప్పదన్నాను ఏమోమరి..."

♦ ♦ ♦

ఆఫీసరు ముందు కుర్చీలో కూర్చుని గంట పైన అయింది. వర్క్ తలంతా విచారాలతో నిండి వుంది. ఆలోచనలకు అంతులేదు. ఒడ్డు చేరే దిశలేదు. పాల డబ్బా కొని నాల్గు రోజులయి వుంటుంది. అప్పుడే అప్పుడే హుక్కుం జారీ! ఛీ...ఛీ స్త్రీలు వివాహం చేసుకోవడం కేవలం మగ వాళ్ళను పీడించేందుకే. సందేహంలేదు. నాల్గు రోజులకో పాలడబ్బా అయితే నెలకు..." అవును నాలాంటి డబ్బయి నాలుగు రూపాయల జీతగాడి వ్యయంకాదు అది. సామాన్యుడు కొనే ధరకాదు. కన్నబిడ్డే! అవును. కన్నబిడ్డకే ఇచ్చుకోలేని జీతం! సిగ్గు ఎందుకు!! సిగ్గుపడనవసరంలేదు.

మనస్తత్వాలు

ఇది ఎలాగుంటే తనకు బిల్లులు. ఏం? తనే కొని పెట్టకపోతే వాళ్ళమ్మను ఓ పది కొని పంపించమని రాయకూడదూ! అంత లేక ఏడుస్తున్నారా? ధనవంతురాలు తనకే ఆ తాహతు లేకపోతే నాకేమిటి? నాకూతురుకు నేను పెట్టలేకపోయానని నన్ను దుయ్యబట్టకపోతే తన తల్లి తనకు ఏం తెచ్చిందో ప్రశ్నించుకోకూడదూ? పెళ్ళి చేసుకున్నంత మాత్రాన అన్నీ భర్తే భరించుకోవాలా? వివాహం చెయ్యగానే కూతురు కాకపోతుందా? ఖర్చు పెట్టడానికి కూతురుగాదేం? పండక్కి ఇంటికి పంపటానికి మళ్ళీ కూతురుగా రూపొందుతుంది! అహా! ఏమి విచిత్ర వ్యక్తులయ్యా!

పోనీ పంపించాలనే అనుకో! తను వచ్చి ఏమయినా తీసుకెళ్తున్నాడా? అదీ లేదు. ఆ ఖర్చంతా తను భరించకూడదు. రాను పోను ఎటులేదన్నా అరవయి రూపాయలు అవుతుందని భయమే! దూర భారాలు సంబంధాలు ఇన్నుక చెటబ్బాడు ముందు ఆలోచనలుకుంచ మనస్సులో నుంచుకోవడం అవసరం.

ఇచ్చే జీతం ఎనభయి కూడా కావు. రోజంతా కూలి వాడి చాకిరి బండచాకిరి. మొరటు వ్యవహారం ఆఫీసరు చేతుల్లో అవమానింపులు. బెదరింపులు. అబ్బబ్బ మగవాడి పని రొచ్చు. యమయాతన అనుభవించాలి. ఇంట్లో గదమాయింపులు, బయట కోపాలు, ఆఫీసులో నిష్ఠూరాలు. ఆడదాని జీవితం మేలు. భర్తను వేధించి గడపవచ్చు. ఇంట్లో కుర్చుని మింగొచ్చు. ఒక బాధలేదు. భయంలేదు. చింతలేదు.

అయినా ఆలోచన జ్ఞానం లేని స్త్రీ జీవితం వద్దేమో అనిపిస్తుంది. మా ఇంటావిడ సంగతే. భర్త సంపాదన తనకి తెలీకపోతేనా? 74 రూపాయలు జీతగాని భార్య. కోరవి దేవతా కోరికలు. ప్రతి పండక్కి చీర కొనాలట. అమ్మాయికి గౌనులు. పక్కింటి పిల్ల ఏగౌను కొనుక్కుంటే అదే గౌను మన అమ్మాయికి. వాళ్ళతో వంతుకు పోతే మనం నెగ్గగలమా అనే ఆలోచన పూజ్యం.

అబ్బబ్బ! ఇది ఒకటే అయితే బాధ పడనవసరంలేదు. కానీ... కానీ... ఇంకా ఎన్నో ప్రతి పుట్టినరోజు పండగ పాపకి ఎంతో వైభవంగా చెయ్యాలట. పది మందినీ పిల్చి వేడుగ్గా చేసుకుందాం? "వద్దు" అనగానే ఇహ రంకెలూ, బెదిరింపులూ, హుంకారాలు.

అందరూ రేడియోలు కొనుక్కుంటున్నారు. మనంకూడా కొనుక్కుందాం. అప్పుడప్పుడు కొంత కొంతగా కట్టొచ్చు ఇస్తారట...... అంటూ మొదలు!

రేడియోలు గ్రామ ఫోనులు ఇహ చూడండి రాణి కోరికలు. ఏ అంతస్తులో వుండే వాళ్ళ కాపురం అక్కడే అనే జ్ఞానం లేదుగదా! మరి తెలిసే అడుగుతోందో లేక అగమ్యగోచరమనుకుని అంటోందో?

ఏ పనీ పూర్తి కాలేదని ఆఫీసరు చేత నాలుగు చివాట్లు తిని ఆయన కాగానే ఆఫీసు గడప దాటి వచ్చేశాడు ఇంటికి.

ఇల్లు చేరుకోగానే వాకిట్లోనే భార్య ఎదురుగా వచ్చి ఖాళీ చేతులు గమనించి, గిరుక్కుమని వెనక్కి తిరిగి వెళ్ళిపోయి, "పోషించ శక్తి హీనమయినప్పుడు పెళ్ళి చేసుకుని భార్యా బిడ్డల్ని హింస పెట్టడంలో తెలివిగల పని అనుకోవడం ఎంత బుద్ధి లోపం!... ఎంత అజ్ఞానం! చాతకానప్పుడు అలాగే మొలగాలి. గొప్పలకు పోవడం చేతగాని కార్యం!" అని అరుస్తు వినపడేలాగునే అంది.

"ఏదీ [illegible]?"

"పాలడబ్బా ఏదని? ఏమిటి? తేలేదుగా!" గట్టిగానే అంది.

"బాగా కనుక్కున్నావు తేలేదు"
"ఎందుకు కన్నారు?" తొందరపడే అన్నట్టుంది.
"నేను కాదుగా!" వికారంగా నవ్వుతూ అన్నాడు.
"గొప్ప చదువులుంటే ఈమాదిరి ప్రవర్తన ఉండదు. కేవలం నా ఖర్మ!"
"అది నా లోపంకాదు. నీ లోపమే!"

"ఇంతకీ అమ్మాయి గతిఏమిటి? దాన్ని ఇద్దరమూ కలిసి చంపేద్దామా? చెప్పండి"

"ఎందుకూ?"

"మళ్ళీ మొదలా! పాల..."

పెద్ద నవ్వు నవ్వుతూ, "రాజ్యం! తల్లివి-కన్నతల్లివి నీవు బతికి వుండగా పాల విషయంలో నీ బిడ్డకు నేనా బాధ్యత? పిచ్చిదానా! కన్నకూతురికి పాలు ఇచ్చుకో. పాలిచ్చి ప్రాణం పోసుకో. నన్ను వేధించకు. పాలిచ్చుకో! పాలిచ్చుకో బతికించు. తల్లివి నీవు వున్నావు......... హా! ఇవ్వు......" అని ముందుకు వచ్చాడు.

భర్తకు మెదడు మారిపోలేదుగదా! పీక పీకెయ్యాడు గదా అనుకుంటూ వణుకుతోంది ఆ స్త్రీ!!

పంచవర్ష ప్రణాళిక

శ్రీమతి యం. ఆదిలక్ష్మి

ప్రకృతికి సూర్య బింబము విధాన
భరతమాతకు హృదయమ్ము పల్లెటూరు
యజ్ఞవిధి ధర్మమైన యనాదినుండి
సర్వ సౌభాగ్య కాంతి పుంజమును జిమ్మె॥

మహికా మేఘము లొరయుట
సహజమ్మైన, నేడో శాపవశానన్
గ్రహణమ్ము పట్టినట్టుగ
బహుభంగులజనపదమ్ము పతితమ్మయ్యెన్.॥

శ్వేతజాతివార లేతెంచ క్రీనీడ
సహజ జీవశక్తి సన్నగిల్లి
పూర్వ వైభవమ్ము పోకమారి మాపల్లె
కునికిపాట్లు పడుచు సాగుచుండె॥

అదియొక పల్లె; పల్లెయనుటం
        తకు మాత్రమె పల్లెశోభతో
నెదకును కంటికింపయిన వేవియు
        నచ్చట గానరావు; కూ
డౌదవక గుడ్డయున్ గనక
        నొక్కట నెత్తియుఁగాలు మండగాఁ
జదికిల బడ్డదీన యది,
        స్వర్ణముఖీనది తీరమందునన్.

ప్రక్కనది యున్నకతమున పంటకేమి
లోటుగల్లదటన్న, నామాటెలోటు
వాన లేకున్న నిసుకయు, వానయున్న
వరదయున్ మునుగు నిరుపేద పల్లెయద్ది.

వెల్లువలు ప్రక్కప్రవహించు వేళనేని
ఆకసము జూచి కృషిని జేయంగవలసె
వరదలైనీరు కడలికి పరువులెత్త
పైరు లెండుటజూచి యేడ్వంగవలసె.

ఇరుకు మురికి సందు లిక్కడ నక్కడ
పూరిగుడిసెలోకట బురదనేల
చెంత చిన్న చిన్న చీకటి మిద్దెలు
చదువు సంధ్యలేని జాన పదులు.

దీపములు లేని యిళ్లను
ఘంటమ్ములు లేని గుళ్ళు దేవసిద్ధికిఁగేల్
నాశి తపించ యుగాలుగ
కాపాడ వచ్చి గోడు కాపెడునంటున్

దాస్య దారిద్ర్య ఘోరరాత్రమున మునిగి
స్వర్ణముఖి యొడ్డునన్ గున్కు జనపదమ్ము
ఉలిక్కిపడి లేచె, స్వేచ్ఛా నవోదయంపు
విజయ దుందుభి నాదమ్ము వెల్లివిరియ

స్వాతంత్ర్యోదయ మాయెన్
ప్రాతస్సుమ జాలమట్లు భారత జనసం
ఘాతమ్ము మోదమందెను
చేతమ్ములు విరిసి, సర్వసిద్ధులు కురిసెన్.

ఉదయము జూచి, లేచి, మనయూరటు
        ముందుకు కేలుసాచి, యా
మెనుటి జవాహరిచ్చు నయిదేండ్ల
        ప్రణాళిక నూతకఱ్ఱగా
ముదమున బట్టికాలిడెను ముందుకు
        ముందుకు, దేశమెల్లన

పంచవర్ష ప్రణాళిక

భ్యుదయ పథాన జనుచుండ
నఖండ జవప్రచండమై

రాజకీయంపు పాలసంద్రమును జిల్కి-
ఆర్థికాభ్యుదయంపు దివ్యామృతమ్ము
పంచవర్ష ప్రణాళికా పాత్రబట్టి
ప్రభుత తనదారి పొడవున పంచసాగె

స్వర్ణముఖీనదికి జలాశ్రయమును నిర్మించి
మబ్బులకు దాస్యము మాన్పినారు
శ్రద్ధమై చిత్తరంజను ఫ్యాక్టరీ బెట్టి
ప్రగతికి మార్గము పట్టినారు
మహితమౌసింద్రి కర్మాగారమున్ దెచ్చి
పండ లేదను గోడు బాపినారు
తుంగభద్రా డ్యాముతో పల్లెనింటింట
నెలనిండు దీపాలు నిల్పినారు.

చాలజాతి వికాస విస్తరణ విధము
లమలు జరుపుట నందన మయ్యెనూరు
పొలములున్నవి సస్యసంఫుల్లములుగ
పురులనున్నది ధాన్యమ్ము పుష్కలముగ

ఉచిత నిర్బంధ విద్యోపార్జనకు బాల
బాలికలకు పాఠశాలకలిగె
పగలెల్ల పొలములో పనిపాట్లు చేసెడు
వారలకును రాత్రిబడులు కలిగె
అలవయోజనుల విద్యా ప్రణాళిక చేత
పెద్దలకును తెలివి వెలుగు గలిగె
పత్రికా పరిచయ భాగ్య మాబాల గో
పాలంబునకు నొక్కపగిది గలిగె

ముఖ్యముగ దేశమున మూలమూలలందు
జరిగినవి, జరగుచున్నవి, జరుగనున్న
వార్తలును సర్వ విజ్ఞాన పథకములను
నొకట నందించు నా రేడియోను వెలసె

పాతాళమున నీరు పైకుబికించు పం
పుల చేత పాటి భూములును పండె
ఏరుపారను పని యెడారి నేలయు పచ్చ
పచ్చని పచ్చిక బయలు నయ్యె
మెరక పట్టులలోను కఱకు రానేలలో
ననువైన సస్యము లలరుకొనియె
పంటపొలము నీటిపదను చేతను గర్భ
వతి నీరు బట్టిన పగిది దోచె

సస్యభరింతంబు నగుచు సుశ్యామలమయి
పులకరించెను శ్రీతోడ భూమియచట
ఆనకట్టను నదిఁగట్ట నదియె నిలిచె
కామధేనువుగాగ నా గ్రామమునకు

ఐదేండ్ల తీవ్రకృషితో
వైదొలగినవెల్ల యీతిబాధలు సౌభా
గ్యోదయ మయ్యెను పల్లెకు
ప్రాదుర్భవమయ్యె మానవము నిర్మలమై.

ఇదితొలిమజిలీ భారత
హృదయము వికసించె నిచట; రెండవదశన
భ్యుదితమగు పూర్ణ ఫలితము;
అది మొదలానందరసమె యువని వెలారున్.

(ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రమువారి
సౌజన్యముతో)

వీరనారి

ఉన్నవ లక్ష్మీబాయమ్మ

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ.

లక్ష్మక్క : రామ ! రామ ! శ్రీరామా రామా రామా రఘు రామా
తెలుగు తల్లికి నుదుట బెట్టిన కుంకుమ తిలకంబనగా ॥రా॥
అలరుచున్నది గుంటూరు మండల మాంధ్రదేశమందూ ..
అమరావతి ధాన్యకటకంబనే ఆంధ్రరాజధాని ..
వేమనబుట్టిన కొండవీడు పురి వినుకొండయును ..
పౌరుషముగల పల్నాటిసీమయు భట్టిప్రోలద్దంకి ..
చరిత్రకెక్కిన చందవోలు బలె సాగర తీరాలు ..
మోటుపల్లి క్రొత్త పట్నము కనుముచ్చటైన వాడ్రేవూ ..
సాటిలని యానాగార్జునకొండ చక్కని శిల్పాలు ..
చోళరాజుల శాసనంబుల శోభగాంచినట్టి ..
భావపుర దేవాలయంపు భాసురకుడ్యాలు ..
అదిగాగల చిహ్నములెన్నో అలరారుచు నుండా ..
ఆంధ్రులప్రతిభా చాటేచోటోయ్ ఆహా గుంటూరు ..

చిట్టెక్క : ఇదేమిటే లక్ష్మక్క తోవ తప్పినట్లున్నావ్ ..

పొట్టెక్క : ఆహా ! తప్పింది. సందేహ మెందుకు ? ఎవరో వీరనారి కధచె ..
ప్తానని గుంటూరు గొప్ప చెప్పుతున్నదాయె. ..

ల : నేనేమి దారి తప్పలేదు. మన కథానాయకి లక్ష్మీబాయమ్మది గుంటూరు మండలము కనుక ఆజిల్లా ప్రశస్తి కొంచెం ప్రస్తావిస్తున్నాను.

పొ : ఏమిటేమిటీ ! ఝాన్సీ లక్ష్మీబాయిది గుంటూరు మండలమా ?

ల : మనం చెప్పబోయే కధ ఝాన్సీలక్ష్మీబాయిదిగాదు . ఉన్నవ లక్ష్మీబాయమ్మది.

పొ : సరి. సరి. మంచికధే ఎత్తుకున్నావు ? ఝాన్సీలక్ష్మీబాయంటే తెల్లవాళ్ళపై కత్తిగట్టి పోరాడిన వీరనారీమణి గనుక ఆమెకధ చెప్పినా విన్నా అందంగా వుంటుంది. ఈ లక్ష్మీబాయమ్మ కధచెప్తే ఏంబావుంటుందే ?

చి : దూరపు కొండలు నునుపు. పొరుగింటి పుల్లకూరరుచి—ఝాన్సీలక్ష్మీబాయమ్మైనా తెల్లవారితో పోరాడింది మన లక్ష్మీబాయమ్మగారు మాత్రం పోరాడ లేదూ ?

పొ : ఏమిటీ ఈ మెగూడ తెల్లవాళ్ళతో పోరాడిన వీరాంగనేనా ?

ల : ఆహా !

మానసీయుడు మహాత్మాగాంధీ తందాన తందాన తందన
దేశ దాస్యమే రూపుమాపగ

ఉన్నవ లక్ష్మిబాయమ్మ

శాంతి సమరమే సాగించగా ..
లక్ష్మిబాయమ్మ చేరినాదిగ ..
ప్రభుత్వ ఆజ్ఞ ధిక్కరించెగా ..
సత్యాగ్రహము చేసినాదిగ ..
జైలు యాత్రలె చేసినాదిగ ..
తెల్ల దొరలనే హడల గొట్టెగ. తందానో తానె తందనాన.

పొ : ఓహో ! అయితే ఉన్నవలక్ష్మిబాయమ్మ గూడ ఝాన్సీలక్ష్మీబాయివలె వీరవనితన్నమాట. అయితే అక్కా ఆ కథే చెప్పు విందాం.

ల : వినవే ఉన్నవ లక్ష్మిబాయమ్మ ఉజ్వలమౌ గాథా
సాటిలేని గుంటూరుపురమునకు సరసను గలదంటే ॥వినవే॥
సత్తెన పల్లను పేరుగల్గిన సారమైన తాలూకా ..
ఆ తాలూకా గ్రామంబులలో అమరి యున్న దండీ ..
అమీనా బాదనే పల్లెటూరు అందముగ నందు ..
నడింపల్లి శీతారామయ్యనే నామముగలగేస్తు ..
భోగిమితో కరణీకము చేయుచు బోలుచుండె నండీ ..
సిరి సంపదల ప్రతిభయును చెప్పలేము బాబూ ..
సాటి సంఘంగొప్పతనానికి సరిరారు ఎవరు ..
లక్ష్మిదేవమ్మను ఇల్లాలు మాలక్ష్మిలాగు వెలయ ..
దక్షుడైన కరణముగారు మహాదర్పముతో నుండే ..
పూజ్య చరితులా దంపతులకు పుట్టి రండి పేడ్క ..
పుత్రులిద్దరు పుత్రిక లిద్దరు పూర్వ పుణ్యమునను ॥వినవే॥
వీరిలో కడపటి సంతానమే లక్ష్మిబాయమ్మ. ఈమె 1882లో జన్మించింది.
వినవే భాంత వీరకుమారీ వీరనారిగాథా
ఉత్త మాంగన లక్ష్మిబాయమ్మ ఉద్భవించనానె ॥వినవే॥
రిత్తపోయిన స్త్రీలజీవము రెమ్మ వేసినాది ..
బీడువారిన స్త్రీలబ్రతుకుకు గోదు పుడిగి నాడి ..
వాడిపోయిన యశోవల్లికి వన్నెహెచ్చినాది ..
అలమి యుండిన అంధకారము అంతరించినాది ..
వెలుగు రేఖలు స్త్రీలమోముపై వెల్లి విరిసినాయి ..

పొ : ఏమిటే ఈ గొడవ ! అర్థంలేని పాటపాడుతున్నావ్

చి : అర్థంలేక పోవటమేమిటి ? ఆనాడు మన ఆంధ్రస్త్రీలస్థితి చాలశోచనీయంగా వుండంటచేత లక్ష్మిబాయమ్మ ఉద్భవించగానే స్త్రీలకు శుభోదయ మైనట్లుగా భావించబడిందన్నమాట.

పొ : అయితే అడుగ మరిచాను. సత్తెనపల్లి తాలూకా అంటే కొండ వీటిసీమ కాదూ

చి : ఆహా ! అవును. కొండవీటి సీమచాల చరిత్ర ప్రసిద్ధమై ప్రదేశం శౌర్యసాహసాలకు, ధైర్య స్థైర్యాలకూ పేరుగాంచిన వీరగడ్డ' కనుకనే వీరవనితయైన లక్ష్మిబాయమ్మగారు కూడ అక్కడ పుట్టి "అచట పుట్టిన చిగురు కొమ్మైనచేవ" అన్నమాటను సార్థకం చేసింది.

పొ : అవునే ! అక్కడ పుట్టిన గోంగూర చూడు ఎంతరుచిగా వుంటుందో

ఉన్నవ లక్ష్మీబాయమ్మ

చి : ఏమేవ్ ! గోంగూరంటే మహా ఎద్దేవగా మాట్లాడుతున్నావ్ గుంటూరు గోంగూరంటే ఎంతప్రసిద్ధమనుకున్నావ్. సప్తద్వీపాల్లో పంచఖండాల్లో అదిపోని తావే లేదు.

పొ : అంటే ?

చి : తెలుగువాడు ఎక్కడికి వెళ్ళితే అక్కడికి వెళ్ళి తీరుతుందీ అని అర్థం.

ల : అందుకనే మహాకవులు దానిమీద చాటువులు కూడ వ్రాశారు.

పొ : ఏదీ తల్లీ ! ఒక్కటి సెలవియ్యి !

ల : కచ్చాపచ్చిగ వేపి
పచ్చిమిరప పండ్లు పోసి పసగల మెంతిన్
హెచ్చుగ త్రొక్కిన గోంగూర
పచ్చడిరుచి తెల్పవశమే బ్రహ్మకునైనన్.

చి : షేష్ ఇంకోటి.

ల : అచ్చపు గుంటూరి సీమను
అచ్చుగ జనియించినట్టి యాగోంగూరన్
నిచ్చలు తినియెడు వారికి
హెచ్చగు జవసత్వంబులు పెచ్చగు సుమ్మీ !

పొ : ఆఁ గోంగూరలో అంత సత్తావున్నదిగా.

చి : అవునే ! గోంగూరంటే ఏమిటనుకున్నావ్. ఐరన్ టానిక్. దాన్ని తిన్నవాళ్ళు ఉక్కుతునకలే.

ల : అరవ బిడ్డకైన నాచారికైనను
సీమ దొరకునైన శివునికైన
గోగు పచ్చడి రుచి కొంచెంబు చూపిన
విడువరోయి దాని విడువరింక.

పొ : అబ్బ ! ఏమి కవిత్వమేయిది. ఒక్కటే చదవమంటే అదేపని చంపేస్తున్నావ్.

ల : అయితే అప్రస్తుత ప్రసంగాలు లేవాక.

చి : దానిమాటలకేమి అక్కా ! కథకానీ !

ల : లక్ష్మీబాయమ్మకు పదేళ్ళువచ్చాయి. వీధిబడిలో చదువుకుంటున్నది.

వీధిబడిని చాల చదువు తుండంగ — తందాన తందాన తందన
పదవ యేడురాగ బాలకైతేను — ..
పెళ్ళి యీడొచ్చెనని పెద్ద లెంచారు — ..
పెండ్లి కొడుకునె వెదకసాగినారు — ..
పెద్దలు చేస్తున్న పెండ్లిబేరాలు — ..
బుద్ధిలో వూహించి బొమముడివైచి — ..
ఇన్ని సంబంధాలు ఏల వెతికేరు — ..
ఉన్నవ బావగారుండంగ నాకు — తందానో తానె తందనాన అన్నది.

ఉన్నవ లక్ష్మీబాయమ్మ

పొ : ఉన్నవ బావెవరేవ్.

ల : రామా రామా శ్రీ రామా రామా రామా రఘు రామా
అమీనాబాదు గ్రామంబునకు అంటి యున్నదండీ ॥రా॥
వేములూరు పాడనె పల్లె యొకటి వెలయగానునందు ..
శ్రీ రాములుగారను పేరుగల్గిన శిష్టచరిత్రుండు ..
పార మార్థిక చింతాసక్తుడు పావనుండు ఘనుడు ..
ఉన్నవాన్వయ సంభూతుండు ఊర్జితుండతండు ..
కన్నకొడుకు లక్ష్మీనారాయణను చిన్నవాని మదిని ..
కన్నె వరించి పలికిందమ్మ కన్న తల్లితోను ..
ఉన్నవబావను తప్ప వేతొకని ఒల్లను నేనంచు ॥రా॥

పొ : అయితే లక్ష్మీబాయమ్మగారి పెళ్ళి స్వయంవరమేనన్నమాట

చి : లక్ష్మీబాయమ్మగారి వివాహ వృత్తాంతం వింటే స్వతంత్రభావాలు ఆమెకు పసినాడే వున్నవని తెలుస్తుంది, పువ్వు పుట్టగానె పరిమళిస్తుందంటారు, ఇదే.

ల : కోరిన భర్తను పెండ్లియాడి మరి కూరిమి మీరంగ ॥రామా రామా॥
వీరనారియగు లక్ష్మీబాయమ్మ విజయమందినాది ॥రామా రామా॥

పొ : ఒసే లక్ష్మక్కా ! ఏరికోరి పెండ్లి చేసికున్నది సరే ఆయనేమయిన ప్రయోజకుడేనా ?

చి : అప్రయోజకుణ్ణి పెండ్లి చేసికోవాటానికి లక్ష్మీబాయమ్మ వెట్టిదా ? లక్ష్మీనారాయణ పంతులుగారు సీమకువెళ్ళి న్యాయశాస్త్రంచదివి బారిష్టరు పట్టము బడసిన విద్యాధికుడు. స్త్రీ పునర్వివాహాది సంఘ సంస్కారణకార్యములు నెరపిన సంస్కర్త. మాలపల్లివంటి గొప్ప గ్రంధములు వ్రాసిన సాహితీపరుడు. గాంధీగారి నిరాకరణోద్యమంలో పాల్గొని శాసనధిక్కారంచేసి శ్రీకృష్ణ జన్మస్థానమలంకరించిన దేశభక్తుడు ఆమహాదారుని సహాయం వల్లనే లక్ష్మీబాయమ్మ ఏబది సంవత్సరాలు ఏకదీక్షతో ఆంధ్రస్త్రీల అభ్యుయాదనికి కృషి చేయగలిగింది.

ల : పతి యేదారిని నడచిన

సతతము తానటు నడుచుచు
సాహసమతియై అతువిత సేవలు సలిపిన
సతి లక్ష్మీబాయమ్మకు చాలరు ఎవరున్.

పొ : ఏమిటీ ! " పతియే దాని నడచిన " అంటున్నావ. ఆయన అందరు నడచిన దానిన నడవలేదా యేమిటీ ?

చి : అబ్బబ్బ ! నీసందేహాలతో చంపి వేస్తున్నావే పొట్టెక్కా ! ఆయన సంఘసంస్కారి యని చెప్పాంగాదూ. ఆరోజుల్లో రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగంపంతులుగారనే అయన బాలవితంతువులకు పునర్వివాహాలు చేస్తూవుండేవారు. వారిలాగానే లక్ష్మీనారాయణ పంతులుగారు కూడ గుంటూరులో స్త్రీపునర్వివాహాలు చేయడం సాగించారు. అందులకు పూర్వాచార పరాయణులు కోపించి ఆయనను వెలివెట్టారు.

పో : దీనికి లక్ష్మీబాయమ్మగారు అంగీకరించారూ ?

చి : అప్పుడు లక్ష్మీబాయమ్మగారు భర్తవద్ద లేదు. పురిటి నిమిత్తం పుట్టింటికి వెళ్ళివున్నది.

పో : ఆ తరువాత వచ్చిందన్నమాట.

చి : ఎట్లావస్తుందీ ! కులంలో వెలిబడిపోతుందని పుట్టింటి వారు ఆమెను పంపలేదు.

ల : అయితే లక్ష్మీబాయమ్మగారు పతివ్రతా శిరోమణి కనుక నాభర్తవద్దకు నన్ను పంపండీ! అని తల్లి తండ్రులవద్ద పోరు పెట్టింది.

మన హిందు మతము మనకేమి చెప్పె — తందానో తానె తందనాన
మగువకు పతియేగతి యన లేదా — ..
నాపతి వద్దకు వెళ్ళి పోదూ — ..
పతివెలియైతే సతికేల కులము — ..
పతి కడ నుండుటె సతి నీతి కాద — ..
నాపతి కడకు నన్ను పంపండీ — ..

అని ఈవిధంగా లక్ష్మిబాయమ్మ భర్తృ సన్నిధికి వెళ్ళడానికి పట్టుపట్టింది.

అన్నమైతేను ముట్టాదండీ — దేవి లక్ష్మిబాయి
నీరమునైతే త్రాగాదండీ — ..
తలనైతేను దువ్వాదండీ — ..
పువ్వులనైతే ముడవా దండీ — ..
మాటలైతేను ఆడా దండీ — ..
నిద్రయైతే పోవాదండీ — ..

లక్ష్మీబాయమ్మ ఈవిధంగా భర్తవద్దకు వెళ్ళడానికి రేయింబవళ్ళు అల్లాడుతుంటే తల్లి తండ్రులకు ఆమెను ఆపడమూ కష్టమై పోయింది. సంఘ బహిష్కృతుడైన అల్లుడి వద్దకు పంపడమూ ఇష్టంలేకపోయింది. అప్పుడు ఏమీ తోచక గుంటూరులో లక్ష్మినారాయణగారి అక్కగారుంటే అక్కడ ఆమెను పిల్లవాడిని విడిచి చక్కావచ్చారు. పిల్లవాడిని చూడవలెనని వంక పెట్టుకుని లక్ష్మినారాయణగారు అక్కగారింటికి వచ్చి పిల్లవాడిని చంక బెట్టుకుని చల్లగా ఇంటికి వెళ్ళి పోయారు పాలుతాగే బిడ్డనువదిలి లక్ష్మిబాయమ్మ మాత్రం ఎంతసేపుంటుంది. సాయంత్రమువరకూ చూచి చూచి తాను భర్త యింటికి చేరింది.

పో : మొత్తానికి భార్యా భర్తలిద్దరూ దిట్టమైన వాళ్ళేనే ! అయితే వీరికి బిడ్డలెందరే.

చి : కన్నకొడుకొక్కడే. కాని పెంపుడు బిడ్డలకు లెక్కేలేదు. ఈమె వివిధకులాలకు చెందిన ఎనిమిది మంది అనాధ బాలికలను తెచ్చి శారదని చారుశీలని, కాత్యాయనాని, కల్యాణని చక్కని పేర్లు పెట్టి పెంచి పెద్దవారిని చేసి పెండ్లిండ్లు చేసి అత్తవారిండ్లకు పంపింది. అంతేకాదు. ఆమె పెట్టిన శారదానికేతనంలో చదువుకున్న విద్యార్థినులూ, ఆమె పునర్వివాహాలు చేసిన వితంతువులూ అందరూ ఆమెకు కుమార్తెలే.

పో : ఆహా ఎంత మంచి యిల్లాలే !

ల : స్త్రీల ఆర్తిని నివారించడమూ, స్త్రీల అభ్యుదయానికి కృషిచేయడమూ, స్త్రీల ఆత్మగౌర

ఉన్నవ లక్ష్మిబాయమ్మ

వాన్ని కాపాడడమూ లక్ష్మీబాయమ్మగారిలోవున్న విశిష్టగుణాలు. ఈమహోన్నత ఆశయాలతో

భళానోయి భాయి తమ్ముడూ సై
భాయి భళానోయి దాదానా ! సై
వెలదుల దుఃఖాలే బాపగ సై
వితంతు వివాహాల్చేసెను సై
స్త్రీలకు చదువులు నేర్పగ సై
శారాదా పీఠమె పెట్టెను సై
దేశీయ విద్యలు నేర్పెను సై
దేశీయ కళలనే నేర్పెను సై
అనాథ పిల్లల పెంచెను సై
ఆర్తుల కష్టాలె తీర్చెను సై
ఖద్దరు చీరెను కట్టెను సై
కాంగ్రెసు జెండాను పట్టెను సై
ఊరు పల్లెలు తిరిగెను సై
ఉవిదల ప్రభోధించెను సై
శాసన ధిక్కృతి చేసెను సై
ముమ్మారు జైలుకు వెళ్ళెను సై
దేశసేవకు గురుతుగ సై
గృహలక్ష్మి కంకణమందెను సై
యేబది సంవత్సరంబులు సై
యేకైక దీక్షతోడను సై
ఆంధ్రమహిళల వున్నతికి సై
అఖండ కృషినిచేసెను సై
వీరనారి యనిపించెను సై
విజయ పరంపరలందెను సై
జయము జయము లక్ష్మీబాయికి
　　జయము దిగ్విజయము
జయము జయము తెలుగు తల్లికి
　　జయము దిగ్విజయము.

(ఏ. ఐ. ఆర్. అనుమతితో.)



సంక్షేమం



భవాని అక్క

భవానీఅక్కకి ఎనిమిదో ఏట పెళ్ళయింది. అప్పుడు ఆమె భర్తకి పదకొండు సంవత్సరాలు. మరుసటి సంవత్సరమే అతను మశూచి వ్యాధితో చనిపోయాడు. అప్పటినుంచీ ఆమె తన బంధువుల ఇంటివద్ద, ముఖ్యంగా ధార్వార్‌లో వున్న తన అన్నగారి ఇంటివద్ద వుంటూండేది. అక్కడ ఆమె తరచు ఇంటిపని చేస్తూ, వాళ్ళకి సహాయపడేది. తన అన్నగారి ఇంటిదగ్గర పురుళ్ళువచ్చినా, రోగాలువచ్చినా, పెళ్ళిళ్ళువచ్చినా, మరేఅశుభకార్యాలు వచ్చినా ఎంతో సేవ చేసేది. ఆ చుట్టుపట్ల వాళ్ళకికూడా ఆమె ఆ విధంగానే సహాయం చేసేది. తన బంధువులకీ, కావలసిన వాళ్ళకీ నర్సుగా, మంత్రసానిగా, వంటమనిషిగా, వస్త్రాలను శుభ్రపరచే స్త్రీగా, ఒకటేమిటి అన్ని విషయాలలోను ఆదుకొనేది. ఈ పనులన్నింటినీ ఆమె ఎవరో చేయమన్నారని కాకుండా, తనంతటతాను ఒకళ్ళకి సహాయం చేయాలనే కాంక్షతో చేసేది. ఒకరికి సేవచేయడమంటే ఆమెకంత సరదా! కొత్త పెళ్ళి కూతుళ్ళకి జడల్లో పూలు పెట్టడంలో భవాని అక్కయ్య ప్రత్యేకంగా ఆనందం పొందేది!

సాధారణంగా భర్తలను కోల్పోయిన స్త్రీలు సంఘసేవకి పూనుకొంటూంటారు. కొత్తగా ఎంతో మంది తమ భర్తలు చనిపోయిన తరువాత అనేక సంక్షేమసంస్థలని నడుపుతున్నారు కూడా. వీటిలో పాలుసరఫరా తఖీని చేయడం, అనాథ శరణాలయాలని నడపడం వీరు ముఖ్యంగా చేస్తున్నారు. ఇదికాకుండా భవానివలె హిందూ వితంతువులు చేయవలసిన సంఘసంక్షేమ కార్యకలాపాలు వున్నాయి. ఎనభైసంవత్సరాల వృద్ధాప్యంలో వున్నా భవాని విసుగూ, విరామం లేకుండా అహోరాత్రాలు అనేకమంది రోగులకి సేవచేస్తూండడం, నిజంగా తక్కిన సంఘసేవికలకి మార్గదర్శకం కదూ ?

ఒక సంస్థ సరిగా పనిచేయనప్పుడే ఇలాంటి సహాయకార్యకలాపాల అవసరంవుంటూంటుందని కొందరు అంటారు. ఆవిధంగానే వివాహసంస్థ సరియైన పద్ధతులలో నడవనప్పుడు, ఆ విధంగా వితంతువులైన వారికి సహాయం చేయవలసిన బాధ్యత సంఘానికి ఎంతైనావుంది. కాని ఇక్కడ గమనించదగిన విషయం ఏమిటంటే భారత దేశంలో హిందూ వితంతువులే ఒక మహా సంస్థగా రూపొందారు. వీరు చేసే సంఘసేవ ఇంతింతనరానిది! ఉదాహరణకి భవాని తాను చేసే సహాయానికి ఎవ్వరిదగ్గర నుంచీ ఒక్కపైసాఐనా కోరదు. కాకిచేత కబురుపంపినా ఏ సమయంలోనైనా ఆమె సహాయం చేయడానికి సిద్ధమే! కాని ఇంతవరకూ ఆమె ఉదార స్వభావాన్ని ఒక్కరైనా గుర్తించినట్లు కనపడదు! ఈ వృద్ధాప్యంలో ఆమె ఒకరివద్ద నుంచి తృణమో పణమో కోరకపోయినా, ఆమెవద్దనుంచి సహాయం పొందిన అనేక కుటుంబాలు ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోవాలి. "భారత దేశంలో భవానిలాంటి వాళ్ళు వేనవేలున్నారు — తాము చేసిన సేవకి ప్రతిఫలం వాంఛించకుండానే, నేటికీ వీరంతా సేవచేస్తూనే వున్నారు ఇలాంటి వాళ్ళని గుర్తించి, వృద్ధాప్యంలో వాళ్ళని ఆదుకోవడం మన కనీస ధర్మం కాదా?"

డి. పాల్. చౌదరి.

ప్రజా సంక్షేమ పథకము



కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ కృషి విధానం

మా కృషి విధానాన్ని గురించి అనేక ప్రశ్నలు వస్తూ ఉంటాయి. ఎన్నో ప్రశంసలను అందుకుంటూ ఉంటాం. ఎన్నో విమర్శలను ఎదుర్కొంటూ ఉంటాం. మా ప్రయత్నాలేమిటో, మే మెలా ప్రయత్నిస్తున్నామో సరిగా తెలుసుకోనివారే మమ్మల్ని విమర్శిస్తూంటారు. మా కృషియందలి, అవకాశాలూ, పరిమితులూ చాలామంది అర్థం చేసికోలేదు.

ఈ దేశంలో కొంత సంక్షేమకార్యక్రమం సరాసరి ప్రభుత్వ యాజమాన్యముననే జరుగుతూ ఉంది- ముఖ్యంగా కార్మిక సంక్షేమం, విద్యామంత్రిత్వశాఖ, యువజన శ్రేయోభివృద్ధికి బాధ్యత వహిస్తూ ఉంది. షెడ్యూలు తరగతుల, కొండజాతుల సమన్వయ సముద్ధరణలు కేంద్రంలో ఆ శాఖకు సంబంధించిన కమీషనర్ నిర్వహిస్తున్నారు. కాందిశీకుల పునరావాసాన్ని ప్రత్యేక మంత్రిత్వశాఖ నడుపుతూ ఉంది.

దేశంలో ఐచ్ఛిక సంఘసేవాకృషియొక్క సహాయాభివృద్ధులకే కేంద్రసాంఘిక సంక్షేమ సంస్థ నెలకొల్పబడ్డది. ఈ సంస్థ స్త్రీలకు, శిశువులకు, శక్తిహీనులకు, బాలనేరస్థులకు, కుటుంబకల్యాణానికి కావించే సేవాకార్య కలాపములకే ప్రాధాన్యం ఇస్తుంది.

ఐచ్ఛిక సేవాసమాజాలకు గ్రాంట్లు

దరఖాస్తు పద్ధతి

శ్రీ బి. ఎస్. ధార్. (పరీక్షాధికారి)


కేంద్ర సాంఘికసంక్షేమ సంస్థ ముఖ్యోద్దేశ మేమనగా బోర్డువారు నియమించిన నిబంధనలకు లోబడినవై, ధన సహాయం చేయవలసిన అవసరం కలిగినవై అర్హత కలిగిఉన్న స్వచ్ఛందసేవాసమాజాలకూ, సంస్థలకూ ఆర్థిక సహాయం చెయ్యడమే. బోర్డు నెలకొన్న తరువాత ఇంత వరకూ దేశంలోని 1700 సంక్షేమ సంఘాలకు రు 55,01,585 లకు పైగా గ్రాంటులు యిచ్చింది. అందులో అన్నిరాష్ట్రాలకంటె ఎక్కువ మొత్తం అనగా రు 9,13,205 లు బొంబాయి రాష్ట్రానికి. అన్నింటికంటె తక్కువ మొత్తం రు 8000 లు అండమాను నికోబార్ దీవులకు లభించింది.

దరఖాస్తులు పెట్టుకునే విధానం : మొదట్లో ఐచ్ఛిక సంఘాలు ధనసహాయం కోసం కేంద్ర సంస్థకే సరాసరి దరఖాస్తులు పంపేవి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సంస్థలు వివిధరాష్ట్రాలలో ఏర్పాటుకావడంతో ఈ దరఖాస్తులు పెట్టుకునే పద్ధతి మారిపోయింది. ఇప్పుడు ఆయా సంఘాలు ఆయా రాష్ట్ర సలహా సంస్థలకే నిర్ణీతమైన ఒక ప్రోఫార్మామీద దరఖాస్తు పంపిస్తూ దాని నకళ్ళు రెండు కేంద్ర సంస్థకు రికార్డు నిమిత్తం పంపాలి.

దరఖాస్తులు సంవత్సరంలో ఎప్పుడైనా తీసుకోబడతాయి. దీనికి ఒక కాల నిర్ణయంలేదు. దేశంలో ఎక్కువ సంఘాలకి ఆర్థిక సహాయం చేసే అవకాశం కల్పించడానికే ఈ ఏర్పాటు చేయబడింది. సేవా సమాజాలకు గ్రాంటులు ఎప్పుడైనా లభిస్తాయని రాష్ట్ర సంస్థలు ప్రచారం చెయ్యడానికి తగిన చర్యలు కేంద్ర సంస్థ తీసుకుంది. సేవాసంఘాలనుండి వచ్చిన దరఖాస్తులనుగురించి ఆయాప్రాంతీయ భాషలలో వెలువడే పత్రికలలో ప్రకటన చేయడానికి కూడా ఏర్పాట్లు జరిగాయి.

దరఖాస్తుల పరిశీలన : గ్రాంటులను నిర్ధారణచేసే విషయంలో సిఫారసులు చేసే పని రాష్ట్ర సంస్థలు నిర్వహిస్తాయి. ఇంతవరకు ఈ విషయంలో రాష్ట్ర సంస్థలు చేస్తున్న సహాయము చాలా ఉపయోగకరము అనే విషయం గమనించతగ్గది. దరఖాస్తులు పెట్టుకున్న సంఘాలను స్వయంగా దర్శించి రావలసిందని రాష్ట్ర సంస్థలకు కేంద్ర సంస్థ వివరంగా ఆదేశాలు పంపుతుంది. రాష్ట్ర సంస్థలు ఎంతవరకు సహాయం చేయవచ్చునో తెలుసుకుంటాయి. రాష్ట్రాలలో పరీక్షాధికారులను నియమించడంతో ఆయా సంఘాలను తనిఖీచేయడంకూడా గట్టిగా జరుగుతుంది.

రాష్ట్ర సలహా సంస్థల సిఫారసులను, సంఘాల యొక్క అవసరాలనూ పరిశీలించి ఏ సంఘానికి ఎంత ధనసహాయం చెయ్యాలో కేంద్ర సంస్థ నిర్ణయిస్తుంది. మొదట్లో ఆయా సేవా సంఘాలు చేసే కృషిని అభివృద్ధిచేసి విస్తృతం చేసేందుకే ధనసహాయం చెయ్యడం అభిప్రాయమైనప్పటికీ, రాను రాను, కొత్త సంఘాలు నెలకొల్పి ఇంతవరకు ఎవరూ తలపెట్టని ప్రత్యేక సేవా కార్యక్రమం ఉపక్రమించ దలచుకున్నవాటిమీద కూడా శ్రద్ధతీసుకోబడుతుందన్న విషయం తెల్లమౌతూ ఉంది.



భారతదేశం మొత్తంమీద 1953_54 లో 991 స్వచ్ఛంద సంక్షేమసంస్థలకు గ్రాంటులు మంజూరు చేయబడ్డాయి. అందు 606 సంస్థలకు గ్రాంటులు [illegible] ఇవ్వబడింది. 27 సంస్థలు మాత్రం [illegible] గ్రాంటు [illegible]

1954_55 లో మొత్తం 375 సంస్థలకు గ్రాంటులు మంజూరు అయాయి. 348 సంస్థలకు మాత్రం [illegible] ఇవ్వబడింది. నియమం ప్రకారం నిర్వర్తించని కారణంగా 27 సంస్థల గ్రాంటులు రద్దయాయి.

గ్రాంటుల రద్దుకు కారణాలు

శ్రీ ఎమ్. ఎల్. చోప్రా (అభివృద్ధిశాఖ)

కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ మంజూరు చేసిన గ్రాంటులు పూర్తిగాగాని, సగముగాని తీసుకుంటే ఆకారణం కోల్పోయిన సేవా సమాజాల వ్యాఖ్యానికులకు సంబంధించినదీ వ్యాసం.

కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘము ది 12 ఆగస్టు 1953 న స్థాపించబడ్డ తరవాత మొదటిసారిగా అందలి సభ్యులు భారత దేశంలోని వివిధ స్వచ్ఛంద సేవా సంఘాలు గ్రాంటుల నిమిత్తం పంపిన విజ్ఞప్తులను పరిశీలించుకుటగాను నవంబరు నెలలో సమావేశమయ్యారు. 1953 వ సంవత్సరం నవంబరు నుంచి 1954 సెప్టెంబరులోగా 1953-54 సంవత్సరానికి కేంద్ర సంస్థ 620 సేవా సమాజాలకు రు 20,22,000 లు మంజూరు చేసింది. గ్రాంటులు మంజూరు చేసినట్టు 1953-54 సంవత్సరాంతంలో ఆయాసమాజాలకు ఆలస్యంగా తెలియపర్చడం వల్ల గ్రాంటు సొమ్ములు ఉపయోగించే కాలం 1954 డిసెంబరు వరకు పొడిగించబడింది. కేంద్రసంస్థ ఆమోదించిన సమాజాలు ఒప్పుకున్న కార్యాలనిమిత్తం వారి వంతు విరాళాలు, సంస్థ గ్రాంటులతో కలిపి నిర్ణీతకాలంలో వ్యయపర్చడానికి చాలినంత వ్యవధి కల్పింపబడింది. చాలా సమాజాలు అనేక కారణాలవల్ల కేంద్ర సంఘం గ్రాంటులను వినియోగపరచలేకపోవడంవల్ల, వారి విజ్ఞప్తులను పురస్కరించుకొని కేంద్ర సంస్థ మార్చి 1955 వరకు కాలపరిమితిని తిరిగి పొడిగించింది.



1954_55 సంవత్సరానికి కేంద్ర సంస్థ 387 సమాజాలకు రు 11,16,050 లు మంజూరు చేసింది. దీనితో మొత్తం 1,007 సమాజాలకు రు 31,38,050 లు 1953 నుంచి 1955 వరకు మంజూరయాయి.

కేంద్ర సంస్థ నియమించిన కొన్ని నిబంధనలకు ఈ సమాజాలు లోబడే పద్ధతిని ఈ గ్రాంటులు మంజూరు అయాయి. ఇందు ముఖ్యమైన షరతులేవనగా

1. గ్రాంటులు రెండు సమవాయిదాలలో ఇవ్వబడును.

2. స్వచ్ఛంద సేవాసమాజాలు తాము నిర్వహింప వలసిన కార్యములకు సంబంధించిన విరాళాల యొక్కయూ, కేంద్రం మంజూరు చేసిన గ్రాంటుల యొక్కయు. ఖర్చుల అంచనాలను దాఖలు చేసికొన్నమీదట మొదటి వాయిదా సొమ్ము జారీచేయబడును.

3. కేంద్ర సంస్థ విధించిన నియమావళి ప్రకారం ఈ సమాజాలు తమ తమ విరాళాల సొమ్మున్నూ, సంస్థ జారీచేసిన సొమ్మున్నూ కలిపి సరిగా ఖర్చుపెట్టి, సక్రమమైన లెక్కలు నిర్ణీతకాలంలోగా, నిర్ణయింపబడిన కార్యములకు వినియోగపడ్డట్టు యోగ్యతగల ఆడిటర్ల సర్టిఫికెట్లు పంపినమీదట రెండో వాయిదా సొమ్ము జారీ చేయబడును.

4. ఈ నియమం సర్టిఫికెట్టు పొందిన అకౌంటు లభించని సమాజాల విషయంలో కొంత సడలించబడింది. అలాంటి సమాజాలు తమ జమాఖర్చుల జాబితాలను రాష్ట్ర సంక్షేమ సంస్థలకు పంపుకోవాలి. కేంద్ర సంస్థ ఏర్పాటుచేసిన నిబంధనల ననుసరించి రాష్ట్ర సంఘము జమాఖర్చులను పరిశీలించి సర్టిఫికెట్టు ఇస్తుంది.

ముందుగా ఇంత తంతు జరగవలసి ఉన్నప్పటికీ, మంజూరు అయిన గ్రాంటులు మొత్తం 1007 సమాజాలలోను 62 సమాజాలు మాత్రమే గ్రాంటులను వినియోగించుకోలేకపోయాయి. ఇవి నూటికి ఆరు మాత్రమే అని గమనించవలెను. రద్దయిపోయిన మొత్తం సొమ్ము రు 1,55,000 లు అంటే నూరు వంతుల్లో అయిదు వంతులు మాత్రం. ఇందుకు కారణం ఈ క్రింది వానిలో ఏదో ఒకటి అయివుంటుంది.

1. గ్రాంటు ఉత్తరువులు జారీ చేసిన తరవాత ఆయా సమాజాలనుండి జవాబులు రాకపోవడం.

2. గ్రాంటులోని నిబంధనలు సమాజాలు అంగీకారం కాకపోవడం.

3. నిర్ణయించిన కాల పరిమితిలోగా గ్రాంటులను పూర్తిగా వ్యయపరచలేకపోవడం.

4. మంజూరు అయిన గ్రాంటు మొత్తాల వినియోగానికి తగిన కృషికి అవకాశాలు లేకపోవడం.

5. ఆయా సంస్థలు మునిసిపాలిటీ లేక ప్రభుత్వశాఖల అధికారం క్రింద ఉండి నడపబడడం.

6. కొన్ని కొన్ని సంఘాలపైన, రాష్ట్రసంస్థలో, రాష్ట్రప్రభుత్వమో, పరీక్షాధికారులో వ్యతిరేక అభిప్రాయాలు వెలిబుచ్చుతూ రిపోర్టుచెయ్యడం.

7. ఇతర కారణాలవల్ల ఆగిపోవడం లేక సక్రమంగా నడపలేకపోవడంవల్ల మూసివేయడం.

ఇవిగాక దాదాపు 140 సమాజాలు అనగా మొత్తంలో నూటికి 14 సమాజాలు మంజూరుచేసిన సొమ్ములో మొదటివాయిదా మాత్రం వినియోగించుకుని తక్కినది అనగా నూరు పాళ్ళలో యాభై పాళ్ళ సొమ్ము ఆర్థిక సంవత్సరం అంతమయేలోగా వినియోగించుకోలేకపోవడంవల్ల రద్దయిపోయింది. అందుకు ఈ క్రిందివి కారణాలు.

ఎ. గ్రాంటు షరతులను సక్రమరీతంగా సంఘాలు గ్రాంటులో కొంత భాగం గృహనిర్మాణానికి ఉపయోగించలేకపోవడం.

బి. ఆర్థిక సంవత్సరం పూర్తి అయేసరికి కూడా మొదటి వాయిదా సొమ్ము మాత్రమే ఖర్చుపెట్టడం.

సి. ఆడిటరు యొక్కగాని, రాష్ట్రప్రభుత్వం యొక్కగాని సర్టిఫికెట్టుతో సక్రమమైన జమాఖర్చుల జాబితాలు పంపకపోవడం.

డి. కొన్ని సంఘాల కార్యకర్తలు సంస్థ గ్రాంటులను ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో, పనులను రోజులను ముఖ్యంగా తమ వాటా వివరాల విషయంలో, అంచనాలు పంపించి మొదటి వాయిదా సొమ్ము తీసుకున్నారు. రెండోవాయిదా సొమ్ము జారీచేయడానికి జమాఖర్చులు పంపమన్న ఉత్తర్వులకు సమాధానంగా తమ వాటా సొమ్ము సమకూర్చలేకపోయామని జవాబులు రావడం వల్ల తక్కిన వాయిదా సొమ్ము రద్దయిపోవడం.

కేంద్ర సంస్థ పరీక్షాధికారులు స్వయంగా వెళ్ళి పరిస్థితులను చూచి కొన్ని విషయాలను గూర్చి వివరాలు తెలిపేవరకూ రెండో వాయిదా సొమ్ము అపుచేయవలసిందని సిఫారసు చేసినప్పుడు వారి జవాబులు వచ్చేలోగా నిర్ణీత కాలం జరిగిపోవడంవల్ల తక్కిన సొమ్ము రద్దయిపోవడం జరిగింది.

ఈ విషయాలన్నీ గ్రాంటుల కోసం ముమ్ముందు దరఖాస్తులు పంపేవారికి చాలా ఉపయోగకరంగా ఉండగలవని ఆశిస్తున్నాం.





రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సంఘాలు

శ్రీ బిల్‌కిస్ ఘుఫ్రాన్ (పరిశోధనోద్యోగి)

కేంద్ర మంత్రివర్గం నిశ్చయం ప్రకారం 1953 సంవత్సరం ఆగస్టు నెలలో కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ నిర్మాణం జరిగింది. కేంద్ర మంత్రిత్వ విద్యాశాఖ యాజమాన్యాన కేంద్రసాంఘిక సంక్షేమ సంఘం స్వతంత్రమైన ప్రత్యేక సంస్థగా పనిచేస్తూ ఉంది. దేశంలోని స్వచ్ఛంద సేవాసమాజాలను సరియైన మార్గంలో పెడుతూ ఆర్థిక సహాయం చెయ్యడం, వివిధ మంత్రిత్వ శాఖలు నిర్వహించే సంక్షేమ కృషిని సమన్వయం చెయ్యడం, ఇంతవరకూ జరుగుతూఉన్న సంక్షేమకృషిలో క్రొత్త కార్యకలాపాలు వృద్ధిచేయడం, ఆవసరమైనచోట్ల ప్రారంభించడం మొదలైన పనులు ఈ కేంద్ర సంస్థ నిర్వహిస్తుంది. ఇందు నిమిత్తం భారత ప్రభుత్వం మొదటి పంచవర్ష ప్రణాళికలో ఈ సంస్థకు నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేసింది.

వికేంద్రీకరణము : కేంద్ర సంస్థ స్థాపనతో దేశంలో సంక్షేమ కృషియొక్క స్వరూపస్వభావాలూ, పరిమితీ, తక్షణం తెలుసుకోవాలనే అభిప్రాయం సభ్యులకు కలిగింది. మూడు ఆడ్‌హాక్ సంఘాలు నియమింపబడ్డాయి. వారు దేశం యావత్తూ పర్యటించి 500 సేవా సంస్థలను దర్శించారు. వాటికి మంజూరుచేసే ఆర్థిక సహాయం నిర్ణయించడంలో వారి సలహాలు చాలాఉపయోగించాయి. యావత్తు దేశంలోని ప్రజలకూ, రోజు రోజూ ఉత్పన్నమయే సమస్యలను పరిష్కరించడానికీ, కట్టుదిట్టంగా పనిచెయ్యడానికీ కేంద్ర సంస్థకు అవకాశం లేదని తేలింది. దేశం నాలుగు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సంఘాలు

మూలల్నీ ఉన్న అనేక సంస్థలను పరీక్షించడానికి తగిన యంత్రాంగాన్ని సమర్థతతో నడిపించడం కూడా అసాధ్యం అని తేలింది. ఆయా ప్రాంతాల సేవా కార్యాలలో నిపుణులైన సభ్యులతో ప్రతీ రాష్ట్రానికీ సలహా సంఘం ఒకటి నిర్మించడం అవసరమయింది. అందువల్ల 1954 సంవత్సరం మార్చిలో జరిగిన సమావేశంలో కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ తమకు ఆయా రాష్ట్రాలలో తల పెట్టిన సేవా కార్యక్రమాల నిర్వహణకు సలహాలిచ్చి, సార్థకమైన కృషి చేయుటకుగాను రాష్ట్ర సంక్షేమ సంస్థలను నెలకొల్పడానికి తీర్మానించింది.

రాష్ట్రసంస్థల ప్రణాళిక : ఇండియన్ యూనియన్ లోని 28 రాష్ట్రాలలో రాష్ట్రసాంఘికసంక్షేమ సలహా సంఘాలను నిర్మించుకొన్నాయి. సాధారణంగా పార్టు ఎ రాష్ట్రంలో తొమ్మండుగురు, బి రాష్ట్రంలో ఏడుగురు. సి రాష్ట్రంలో ఐదుగురు సభ్యులుంటారు. అందులో సగం మందిని కేంద్ర సంస్థ, తక్కిన సగంమందినీ రాష్ట్ర సంఘము నామినేటు చేస్తాయి. కేంద్ర సంస్థ సలహాపైన రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర సంస్థల అధ్యక్షులను నియమిస్తాయి.

అందరికీ ప్రాతినిధ్యం ఉండేలాగు ఈ సంస్థలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం సేవా కార్యక్రమాలు నిర్వహించే ఆలిండియా విమెన్సు కాన్ఫరెన్సు, కస్తూర్బాగాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్టు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ విమెన్సు ఇన్ ఇండియా, ఆలిండియా విమెన్సు సోషల్ సర్వీస్ కమిటీ, రామకృష్ణామిషనుల వంటి సేవా సంస్థలలోని సభ్యులనుండి రాష్ట్ర సంస్థలకు సభ్యులను ఎన్నుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన సంక్షేమ కార్యక్రమాలతో సమన్వయము చేయడానికీ, వారి సంపూర్ణ సహకారం లభ్యం కావడానికీ, లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యులు కొందరినీ, కొందరు ప్రభుత్వోద్యోగులనీకూడా రాష్ట్ర సలహా సంఘంలో సభ్యులుగా చేర్చారు. సేవా కృషియందత్యంత ప్రఖ్యాతికాంచిన మహిళలే అధ్యక్షురాండ్రుగా ఏర్పాటు అయారు.

రాష్ట్ర సంస్థల విధులు : ఈ సంస్థలు కేంద్ర సంస్థకు సలహా సంఘాలుగా పనిచేస్తాయి. ఇవి నాలుగు విధాలైన పనులునిర్వర్తిస్తాయి.

1. స్వచ్ఛంద సేవా సమాజాల దరఖాస్తులపై సిఫారసులు చేయడం ఒకటి, స్వచ్ఛంద సేవా సంస్థలూ, సమాజాలూ తమ దరఖాస్తులను రాష్ట్ర సంస్థలద్వారా పంపుకోవాలి. రాష్ట్ర సంస్థలు, ఆయా సంఘాలను దర్శించి, స్వయంగా పరీక్షించి, చేయదలచుకున్న కృషినీ, వ్యక్తుల శక్తి సామర్థ్యాలనీ, అవకాశాలనీ గమనించి సిఫారసులు చేస్తాయి. వారి వారి అభ్యర్థనలు సరియైనవని గ్రహించిన మీదట తమ సిఫారసులను కేంద్ర సంస్థకు పంపిస్తే కేంద్ర సంస్థ వాని ననుసరించి వారి వారికి తగిన గ్రాంటులను మంజూరు చేస్తుంది. రాష్ట్రసంస్థలసభ్యులు స్వయంగా పరీక్షించి సిఫారసులు చేయడంవల్ల, అర్హతలేని సమాజాలకు గ్రాంటులుదక్కడం తగ్గిపోతుంది.

గ్రాంటు మంజూరు కావడంతో రాష్ట్ర సంస్థ బాధ్యత తీరిపోలేదు. ఏపని నిమిత్తం గ్రాంటు మంజూరు అయినదో, ఆపని నిమిత్తం ఫలవంతంగా సొమ్ము వ్యయపరచడానికి తగిన పర్యవేక్షణ జరపాలి. గ్రాంటు వ్యవధి అయిపోయిన తరవాత జమాఖర్చులన్నిటినీ తణిఖీచేసి అన్నిబాపతులలోనూ సక్రమమైన వ్యయం జరిగిందని సర్టిఫికెట్టుతో కేంద్ర సంస్థ తణిఖీ నిమిత్తం పంపాలి.

2. సంక్షేమ విస్తరణ ప్రణాళికలు : మొదటి పంచవర్ష ప్రణాళికలో భారతదేశం అంతటాను 352 సంక్షేమ విస్తరణ ప్రణాళికలు అమలు జరిపే ఒక పథకాన్ని కేంద్ర సంస్థ ప్రారంభించింది. ప్రతీప్రణాళికా, 5 లేక 7 బహుప్రయోజన కేంద్రాలతో 20,000 మంది ప్రజలకు, 20 గ్రామాలలో విస్తృతం అవుతుంది. ప్రతి కేంద్రం క్రిందా 3 లేక 5 గ్రామాలలో స్త్రీ, శిశువుల సంక్షేమ సేవ జరుగుతుంది. ఈ పథకం రాష్ట్ర సంస్థలు నిర్వహిస్తున్నాయి. ప్రణాళికా ప్రదేశం ఎన్నుకొని, సేవాసంస్థల ప్రతినిధులతో ప్రణాళికా నిర్వహణ సంఘాన్ని ఏర్పాటు చేసేబాధ్యత రాష్ట్ర సంస్థదే. వారి సహాయంతో కేంద్రస్థానం నిర్ణయిస్తారు. ప్రణాళికల నిర్వహణ నిర్వాహక సంఘ యాజమాన్యాన్ని జీతగాళ్ళు జరిపినప్పటికీ రాష్ట్ర సంస్థలే వాని పరీక్షా, పరిపాలనా, జరుపుతూంటాయి. ఈ ప్రణాళికల ఆర్థిక వ్యవహారాలన్నీ రాష్ట్ర సంస్థలు తమ అదుపు ఆజ్ఞలలోఉంచుకుని ధనంయొక్క సక్రమవినియోగానికి కేంద్ర సంస్థకు జవాబుదారీ వహిస్తున్నాయి.

రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సంఘాలు

3. కుటుంబ సంక్షేమ పథకం : పట్టణాలలోని మధ్య తరగతి స్త్రీలకు పని కల్పించి తద్వారా కుటుంబరాబడిని హెచ్చుచేయడానికై ముందుగాగృహపరిశ్రమలను ప్రారంభించడానికి కేంద్ర సంస్థ నిశ్చయించింది. ఇందుకుగాను ఢిల్లీలో ఒక అగ్గిపెట్టెల కర్మాగారం నిర్మింపబడింది. అందులో 200మంది స్త్రీలకు పని కల్పింపబడింది. కొన్ని రాష్ట్ర సంఘాలు, కేంద్ర సంస్థ సలహామీద ఆయా రాష్ట్రాలకు తగిన ప్రణాళికల స్థాపనకు పరిశీలన జరుపుతున్నాయి. ఈపరిశీలనాఫలితంగా కొన్నిపథకాలను తయారుచేసి కేంద్రసంఘం అనుమతికిపంపుతారు. కేంద్ర సంస్థ ఆమోదిస్తే రాష్ట్రసంఘాలు ఆయా పథకాలను ఆచరణలో పెడతాయి. స్థానిక ప్రముఖులతో ఏర్పాటయిన ప్రత్యేక సంఘాలు రాష్ట్ర సంఘానికి సహాయం చేస్తాయి.

4. సమన్వయము : ఐచ్ఛిక సంక్షేమ సమాజాల కృషిని సమన్వయపరచడం రాష్ట్రసంఘాల విధి. అనేక కార్యక్రమాలు, చేసినవారేచేయడం, కొన్ని ముఖ్యమూ అవసరమూ అయిన పనులు పూర్తిగా విస్మరించడం సంఘసేవకులయొక్క, సాంఘిక విజ్ఞాన వేత్తలయొక్క అనుభవంవల్ల తెలియవస్తూ ఉంది. ప్రత్యేక సేవల విజ్ఞాన లోపమున్నూ, ఐచ్ఛిక సేవకులలో పరస్పరసహకారమూ, పరిచయమూలేకపోవడమే దీనికికారణం. రాష్ట్రసంఘాలు సంఘసేవకులలో పరస్పరసంబంధము వృద్ధిచేయడమేకాక, క్రొత్త ప్రణాళికల నిర్వహణకు సలహాలిస్తూ, ఇదివరలో లేని కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ, అన్నివిధాలైన సంక్షేమకార్యాలూ జరిపేసమాజాలను వలఅల్లినట్లు దేశం అంతటా వ్యాపింపజేస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టి నిర్వహిస్తున్న కార్యకలాపాలతో రాష్ట్ర సంక్షేమ సంస్థ ఆయా కార్యకలాపాలను సమన్వయపరచవలసి ఉన్నది. అందుకొరకే రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు తప్పనిసరిగా రాష్ట్ర సంస్థలలో సభ్యులుగా ఉంటున్నారు.

జిల్లాలలో జిల్లా అధికారులకు ప్రణాళికా నిర్వహణ సంఘాలలో సభ్యత్వం కలగజేసి తద్వారా, అధికారులలోనూ, అనధికారులలోనూ సహకారం పెంపొందింపజేయబడుతూ ఉంది.

పైన ఉదహరించిన ముఖ్యవిధులుగాక సాధారణంగా రాష్ట్ర సంఘాలు కేంద్ర సంస్థ తలపెట్టిన కార్యాల స్వరూప స్వభావాలూ, పరిమితులూ, సాధ్యాసాధ్యాలూ వీని విషయమై సలహాలిస్తూ ఉండవలసియున్నది.

రాష్ట్ర సంఘాలపరిపాలనా నిర్మాణం : రాష్ట్రసంఘాలకు, వేతనాలు తీసుకుంటున్న ఉద్యోగులతో ప్రధాన కార్యాలయాలు నిర్మింపబడ్డాయి ఇందలిసిబ్బందిని రెండు రకాలుగా విభజింపవచ్చును.

1. సెక్రటేరియట్ స్టాఫ్ : ఈ సిబ్బంది మామూలుగా క్రమంగా జరిగేవ్యవహారాలన్నీ చూస్తారు. గ్రాంటుల దరఖాస్తులలో వచ్చే రోజువారీ సమస్యలు పరిష్కరిస్తారు. సేవాసమాజాలకూ, రాష్ట్ర ప్రభుత్వాలకూ, కేంద్రసంస్థకూ రాష్ట్ర సంస్థకూ మధ్య రాయబారులుగా పనిచేస్తారు.

2. ప్రత్యేకసిబ్బంది : రాష్ట్ర సంఘాలకు సాంకేతిక సేవలు అందజేయాలనే ఉద్దేశంతో ఇన్‌స్పెక్టరులూ, వెల్‌ఫేర్ ఆఫీసర్లూ పార్ట్ ఎ. బి. రాష్ట్రాలలో ఏర్పాటు చేయబడ్డారు. ఈ ఉద్యోగాలకి ఇన్‌స్పెక్టర్లకు, జమా ఖర్చులవిషయంలోనూ, వెల్‌ఫేర్ ఆఫీసర్లకు తాముచేసే కృషిలోనూ అనుభవము ముఖ్యంగాఅవసరమైన అర్హత. ఇన్‌స్పెక్టర్లు జమాఖర్చులు పరీక్షిస్తూ ఉంటే, వెల్‌ఫేర్ ఆఫీసర్లు ఆయా కేంద్రాలలోనూ, సమాజాలలోనూ జరిగే కార్యకలాపాలు సమర్థతతోనూ, సక్రమంగానూ జరిపించడంలో ప్రోత్సాహం కలగజేస్తూ ఉంటారు.

రాష్ట్రసంఘ సభ్యులు తమతమ రాష్ట్రాలలోని పట్టణాలలోనూ, పల్లెలలోనూ ఉన్నసంస్థలను స్వయంగా సందర్శించి, వాని సన్నిహిత సమాచారాన్ని సేకరించవలసి ఉన్నది.

రాష్ట్ర సంఘాలు- రాష్ట్ర ప్రభుత్వాలు : పైన ఉదహరించిన సమాచారాన్నిబట్టి రాష్ట్ర సంఘాల నిర్మాణాభివృద్ధులతో రాష్ట్ర ప్రభుత్వాలకు సన్నిహితసంబంధమున్నదని తెల్లమౌతూ ఉంది. కేంద్ర సంస్థయొక్క, రాష్ట్ర ప్రభుత్వముయొక్క ఆజ్ఞననుసరించి రాష్ట్రసంఘాలుస్థాపింపబడ్డాయి. ఈసంఘాలలో రాష్ట్రప్రభుత్వం తనప్రతినిధులనుఏర్పాటుచేసింది. పరిపాలనలో రాష్ట్ర ప్రభుత్వాలకు భాగం ఉన్నట్టే, వాని ఆర్థికబాధ్యతలోకూడ భాగమున్నది. కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ రాష్ట్రసంఘాల నిమిత్తం సగం ఖర్చులు భరిస్తే తక్కిన సగమూ రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. సంక్షేమ విస్తరణప్రణాళికల నిమిత్తం కేంద్ర సంస్థ సగం ఖర్చులు భరిస్తే రాష్ట్ర ప్రభుత్వం నాలుగోవంతు భరిస్తుంది. సిబ్బంది నిమిత్తం రు 15000 లు, ప్రణాళికల నిమిత్తం రు 12,500 లకు తక్కువకాకుండా ఖర్చు అవుతాయి. రాష్ట్ర ప్రభుత్వాలను తమ విరాళాల కోసం కేంద్ర సంస్థ అభ్యర్థించినప్పటికీ, రాష్ట్ర సంఘాలే వాని వాటా విరాళాలను వసూలుచేసి సక్రమంగా వినియోగిస్తున్నాయి. దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ తమ విరాళాలు ఇవ్వడానికి ఒప్పుకోవడం సంతోషింప తగ్గ విషయం.

★

సంక్షేమ విస్తరణ ప్రణాళికలు

శ్రీ ఒ. పి. మిశ్రా. (పరిశోధనోద్యోగి)

సంక్షేమ విస్తరణ ప్రణాళికల నిర్వహణం పల్లె ప్రాంతాలలోని స్త్రీ శిశువుల సంక్షేమాభివృద్ధికై ఉద్దేశింపబడిన సేవా పథకం. అధికారేతర సంస్థల యాజమాన్యమున ఐచ్ఛికంగా జరిపేకృషికి. పంచవర్ష ప్రణాళికననుసరించి ప్రభుత్వాధిపత్యమున నడుపబడే కమ్యూనిటీ ప్రాజెక్టులూ జాతీయవిస్తరణ సేవాకార్యక్రమాలూ వంటి కార్యకలాపాలకి ప్రోత్సాహం కలుగచేసి అభివృద్ధిచేయడం లేని చోట్ల స్థాపించడం దీనిపని. దేశంలో నలుమూలలా వల అల్లినట్లు ఈ ప్రణాళికలను విస్తరింపచేయడమే ఈ సంస్థ ఆశయం. శిశు విహారాలూ— అనగా క్రీడలూ, పాఠశాలా ప్రవేశానికి ముందు ఇచ్చే విద్యాశాలలూ— మాతా శిశు సంరక్షణ గృహాలూ. మహిళలకు సాంఘిక విద్య, కళలు, చేతిపనులూ, నేర్పే కేంద్రాలూ, సాధారణ విజ్ఞానమూ, వికాసమూ, విశ్రాంతి కలగజేసే కార్యకలాపాలూ ఈ ప్రణాళికల యొక్క ముఖ్యమైన సేవా విధులు.

ఒక సంక్షేమ విస్తరణ ప్రణాళిక క్రింద సాధారణంగా 20,000 మంది ప్రజలుగల 15 లేక 20 గ్రామాలు ఉంటాయి. ఇక్కడ అయిదు లేక ఆరు కేంద్రాలు పని చేస్తాయి. స్త్రీలకు, శిశువులకు, వికలాంగులకూ సంబంధించిన బహుముఖ సంక్షేమ కార్యక్రమం నిర్వహింపబడుతూ ఉంటుంది.

సామాజిక ప్రణాళికా కృషితో కార్యనిర్వాహక సభ్యులకు నిరంతర సంబంధం ఉండడానికిగాను కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ ప్రణాళికా నిర్వహణ సంఘానికి ఒక జీపుకారు ఏర్పాటు చేసింది. దీనివల్ల చురుకుగా పని సాగడమేకాక, కేంద్రాలలో నియోగింపబడిన సిబ్బంది యొక్క తణిఖీ కూడా బాగా జరుగుతూంది.

ఈ పథకంయొక్క ప్రధానలక్షణం ఏమిటంటే, ఇందులో అనధికారవర్గాలూ, ఐచ్ఛిక సేవా సంస్థలూ కృషి చేయడం. దీని రక్షణకే కేంద్ర సంస్థ ఈ ఆశయానికి కట్టుబడి, ఈ ప్రణాళికలను నిర్వహించే సంఘాలలో పూర్తిగా అధికారేతరులనే నియమించింది. ఆయా ప్రణాళికా ప్రాంతాలలోని స్వచ్ఛంద సేవకుల ప్రతినిధుల చేతనే ఈ కృషి సాగిస్తూ ఉంది.

సంక్షేమ విస్తరణ ప్రణాళికా కృషి 1954 సంగరం॥ ఆగస్టు 15 వ తేదీ నుండి కార్యాచరణలోనికి వచ్చింది. ఈ పది నెలల స్వల్పకాలంలోనూ దేశం అంతటా 200 జిల్లాలలో 200 ప్రణాళికలు ప్రారంభింపబడ్డాయి.

పని చురుకుగా సాగడానికి వికేంద్రీకరణ సూత్రాలననుసరించి సేవా తత్పరలైన అనధికారస్త్రీలతో ఆయా ప్రాంతాలలోని అనుభవజ్ఞులయొక్క. విజ్ఞులయొక్క సహకారం కలగజేసి, కేంద్ర సంస్థ 28 రాష్ట్రాలలోనూ, రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహాసంఘాలను నెలకొల్పింది. రాష్ట్ర సలహా సంఘాల విధులు కేంద్ర సంస్థ విధులంత విస్తృతమైనవిన్నీ. వాని బాధ్యతలలో మాత్రమే కొంచం తేడా ఉంది. కేంద్ర సంస్థకు సలహా సంఘాలుగా ఉంటూ దాని పనినే నిర్వహిస్తాయి. కేంద్ర సంస్థకూ, రాష్ట్ర ప్రభుత్వానికీ, స్వచ్ఛందసేవా సమాజాలకూ మధ్య ఆయా రాష్ట్రాలలో రాయబారులుగా పనిచేస్తాయి.

సంక్షేమ ప్రణాళికలను నిర్వహించే బాధ్యతకూడా రాష్ట్ర సలహా సంఘాలకు ఉంది. పార్టు ఎ. రాష్ట్రాలలో 17, బి. రాష్ట్రాలలో 10, సి. రాష్ట్రాలలో 5 ప్రణాళికలు కేటాయింపబడ్డాయి.

ప్రణాళికా నిర్వహణం ప్రారంభించడానికి ముందు కొన్ని లాంఛనాలు జరగవలసి ఉన్నాయి. ఈ కృషిని నిర్వహించడానికి కొన్ని స్వచ్ఛంద సేవా సమాజాలని ప్రోత్సాహించాలి. ప్రణాళికా నిర్వహణ సంఘం ఒకటి స్థాపించాలి. అందులో సామాన్యంగా ఇతర స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు తొమ్మండుగురు సభ్యులుగా ఉంటారు. అప్పటికే కృషిచేసే సంస్థ లేవీలేకపోతే సేవా తత్పరలైన మహిళలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకుంటారు. ఆయా కేంద్రాలలో పనిచేసే సిబ్బందిని తణిఖీ చెయ్యడానికీ, తమకి కూడా ఈ కార్యంలో బాధ్యత ఉందని గుర్తించడానికీ ఆయా గ్రామాలలోని ప్రజల ప్రతినిధులను కూడా కార్యవర్గ సభ్యులుగా చేర్చుతారు.

అధికారుల సహాయం కూడా ఉండడానికి ఆయా జిల్లా అధికారులు కూడా తప్పకుండా కార్యవర్గంలో చేర్చుకోబడుతూ ఉన్నారు.

ప్రణాళికా నిర్వహణ సంఘం మొట్ట మొదట ప్రాథమికంగా ప్రణాళికను ఎక్కడ ఆచరణలో పెట్టాలో ఆప్రదేశం పరిశీలించాలి. ప్రదేశాన్ని ఎన్నుకోవడంలో గమనించవలసినది ఆ ప్రాంతంలో స్వచ్ఛంద సేవకులు ఉత్సాహంగా పనిచేస్తారన్న విషయం ఒకటి. అక్కడి ప్రజలు తమసహకారాన్ని ఇస్తారన్నవిషయం రెండోదిన్నీ అని గమనించాలి. ప్రవేశపెట్టబోయే సేవ ప్రజల అవసరాలను బట్టి నిశ్చయించాలి. కమ్యూనిటీ ప్రాజెక్టువారుగాని, జాతీయ విస్తరణ సేవా కార్యంవారుగాని ఇదివరకు చేస్తున్న ప్రణాళికలు కాకుండా ఉండాలి. ఈ ప్రణాళికలు వారికి కేటాయించిన ప్రదేశంలో ఉండకుండా ఉండాలి, అప్పుడు కమ్యూనిటీ ప్రాజెక్టు చేసేపనినే ఈ ప్రణాళిక కూడా చెయ్యనవసరం ఉండదు. జాతీయ విస్తరణ సేవలు గ్రామములలో వ్యవసాయాభివృద్ధికి ఎక్కువగా తోడ్పడుతున్నాయి. సంక్షేమ విస్తరణ ప్రణాళికలు సాంఘికంగా అభివృద్ధిని చేకూరుస్తాయి. అందుచేత జాతీయ విస్తరణ సేవా ప్రదేశాలలో ప్రణాళికలు అమలు జరపగూడదని అంత పట్టింపులేదు. తరవాత ప్రణాళికానిర్వహణ సంఘం, చెయ్యవలసిన కార్యం, అయ్యే ఖర్చు, నియమించవలసిన సిబ్బంది విషయమై అంచనాలు తయారుచేసి రాష్ట్రప్రణాళికా నిర్వహణకు ముందుగా సలహాసంఘంద్వారా, కేంద్ర సంస్థ పరిశీలించి అనుమతి ఇవ్వడానికై పంపించాలి.



ప్రణాళికా కేంద్ర పరిసర ప్రాంతంలోని సాంఘికార్థిక పరిస్థితుల దృష్ట్యా ఈ క్రింది కార్యకలాపాలు నిర్వహింపబడుతూ ఉన్నాయి.

బాల విహారాలు: ఇందు రెండు రకాలు పనులు ఉన్నాయి. ఒకటి క్రీచీ, రెండు ప్రప్రథమ శిక్షణ. పగలంతా పనులలోకి వెళ్లే స్త్రీల శిశువులకి ఈ శిక్షణ గృహాల్లో స్నానం చేయించి, బట్టలు మార్చి, ఆడుకోడానికి ఆటబొమ్మలు ఇచ్చి అవసరమైతే పాలు పోస్తారు. రెండోది మూడేళ్ళు దాటిన బిడ్డలకి బొమ్మలద్వారా ప్రాథమిక విద్యకు ముందుచెప్పే విద్య నేర్పుతారు. ఈ కృషిని చాలా ప్రణాళికా కేంద్రాలు నిర్వహిస్తున్నాయి.

మాతా శిశు ఆరోగ్యసేవ: దక్షిణదేశంలోని అన్ని రాష్ట్రాలూ, మాతా శిశు రక్షణాలయాలు నెలకొల్పి కాన్పులకు అగ్రస్థానం ఇచ్చాయి. ఆంధ్రా, మద్రాసు, తిరువా

న్కూరు కొచ్చిన్, మైసూరు, పాండిచ్చేరీ రాష్ట్రాలు తమ ప్రణాళికా కేంద్రాలలో బాలింతల సేవయే ప్రధాన సేవగా ప్రారంభించాయి. ఆయా కేంద్రాలలో నియోగింపబడ్డ గ్రామసేవికలు గ్రామీణ ప్రజలకు సాధారణంగావచ్చే రోగాలకి వైద్యం చేస్తున్నారు. పురుళ్ళు పోయడానికి సుశిక్షితలైన మంత్రసానులు ఏర్పాటయారు. రెడ్‌క్రాస కేంద్రాలచేగాని, ప్రభుత్వంచేతగాని ఇతరసంస్థలచేతగాని నడపబడే ఆసుపత్రులు లేనిచోట్లనే ఈ ప్రణాళికా కేంద్రాల స్థాపన చేయబడింది.

ప్రణాళికా నిర్వహణ సంఘం వారానికో పక్షానికో పై ప్రాంతాలలోని సమర్థులైన వారిచేత పరిశుభ్రత, ప్రజారోగ్యం, గ్రామపారిశుద్ధ్యం మొదలైన అనేక విషయాలమీద ఉపన్యాసా లిప్పించాలని కేంద్ర సంస్థ సిఫారసు చేసింది. గ్రామపారిశుద్ధ్య ఉద్యమాన్ని ప్రవేశపెట్టి తద్వారా గ్రామీణుల గృహాలూ, పరిసరాలూ అప్పుడప్పుడు శుభ్రపరచడంవల్ల వారిలో ఆరోగ్యవంతమూ, ఆనందదాయకమూ అయిన జీవితం అలవాటుచేసే వికాసాన్ని కలుగజేస్తున్నారు. ఆచరణ పూర్వకంగా చేసే ఈ పనుల ద్వారా గ్రామస్థులు స్వయంసహాయకత అలవరచుకుంటున్నారు.

ప్రణాళికాప్రదేశంలోనిప్రజలు ఇందుకుఖర్చయేధనంలో నాలుగోవంతు విరాళాలద్వారా ప్రోగుచేయుచున్నారు. ఈ పథకంయొక్క ముఖ్యోద్దేశం ఇది వస్తురూపంలోగాని ధనరూపంలోగాని ఉండవచ్చునని. అస్సాం రాష్ట్రంలో గ్రామస్థులు, భూములు, గృహాలూ ఈ సంక్షేమ కేంద్రాలకు దత్తం చేశారు. బొంబాయి రాష్ట్రంలో వసూలుచేసిన సొమ్ము ప్రణాళికా నిర్వహణ సంఘం తరఫున బ్యాంకులో భద్రపరిచారు. వింధ్య ప్రదేశంవంటి రాష్ట్రాలలో గ్రామస్తులు ఉచితంగా పనిచేశారు. దక్షిణ రాష్ట్రాలైన ఆంధ్రా, మద్రాసు, మైసూరు, తిరువాన్కూరుకొచ్చిను, హైదరాబాదు రాష్ట్రాలలో స్థానికసంస్థలూ, జిల్లాబోర్డులూ విరాళాలిచ్చాయి. గుర్తించతగ్గ విషయమేమిటంటే ప్రజలు సంపూర్ణంగా పాల్గొనడం. భూములూ, గృహాలూ అద్దెతీసుకోకుండా కట్టడాలూ, ధాన్యమూ, పాలూ ఇంకా ఇతరవస్తువులూ, ఇచ్ఛికంగా ప్రణాళికా నిర్వహణ సంఘాలకు లభిస్తున్నాయంటే గ్రామస్తులు ఎంత ఉత్సాహంతో ఎట్లా సహకరిస్తున్నదీ విశదమౌతూంది.

నిర్వాహక సంఘాలు, నిర్ణీతకాలంలో తమ కృషి యొక్క పురోగమనాన్ని గురించి నివేదికలు పంపిస్తూ ఉండాలి. వస్తురూపంగానూ, ధనరూపంగానూ ఎంత లభించిందో తెలుసుకోడానికే ఈ రిపోర్టులు ఉపకరిస్తాయి. వివిధ కేంద్రాలలోని గర్భిణీ స్త్రీలకూ, ఆహారం చాలని శిశువులకూ ఉపయోగించేనిమిత్తం, యునైటెడ్ నేషన్సు ఆహారసంస్థా, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థా ధాన్యపు బస్తాలు, పాలపొడి అపారంగా సప్లయిచేస్తున్నాయి. పుదుచ్చేరీలో ఒక క్రొత్తపద్ధతి మొదలుపెట్టేరు. రాష్ట్ర సంఘమూ, నిర్వాహకసంఘమూ కలిసి బట్టలను సేకరించే ఉద్యమాన్ని నడిపారు. ఒక్క నెలరోజుల లోపలో వేలకొలది బట్టలూ, పదివేల రూపాయలూ వసూలు అయ్యాయి. యునైటెడ్ నేషన్సు, ఇండియన్ రెడ్‌క్రాసూ విరివిగా పాల పొడుం పంపించాయి. సంక్షేమ కేంద్రాలలో పాలు పంచడానికీ, బీదల ఇళ్ళల్లో వివాహ సమయాల్లో బట్టలు బహూకరించడానికీ, సంక్షేమ కేంద్రాలలో పురుళ్ళు పోసుకున్న మాతా శిశువులకి బట్టలు ఇవ్వడానికీ ఒక పథకాన్ని తయారు చేశారు. ఈ యేర్పాట్లు కేంద్రాలయెడ జనామోదాన్ని పెంపొందిస్తున్నాయి.

సహకారము—సమన్వయము : ప్రణాళికా నిర్వహణ సంఘాలు అనధికారసంఘాలైనప్పటికీ ఒకరిద్దరు అధికారులుకూడా ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఇందు సాధారణంగా జిల్లా ప్లానింగు ఉద్యోగీ, కమ్యూనిటీ ప్రాజెక్టు నిర్వాహకుడూ, జాతీయ విస్తరణ సేవా కార్యకర్తా, డిప్యూటీ కమీషనరో లేక జిల్లా వైద్యాధికారో సభ్యులై వుంటారు. వీరు తమ సంహాయిస్తూ, కార్యక్రమ విధానాన్ని నిర్ణయిస్తూ, కమ్యూనిటీ ప్రాజెక్టు, జాతీయ విస్తరణ సేవాసంస్థలు చేసే పనే మళ్ళీ చేయకుండా చూస్తూ తమ సహాయసంపత్తిని చేకూరుస్తూ ఉంటారు. వారి అనుబంధంవల్ల సమాజానికి శాస్త్రరీత్యా సక్రమ సహాయం కలుగుతూంది. వారి సభ్యత్వంవల్ల డిస్ట్రిక్టు బోర్డులనుండి ఇతర స్థానికసంస్థలనుండి ఆర్థిక సహాయం దొరుకుతూంది. గ్రామస్థుల ప్రతినిధులు సాధారణంగా పంచాయితీల సభ్యులై ఉండడంవల్ల జనులలో గొప్ప మానవసేవా తత్పరత అధికం అవుతూ ఉంది. కొన్ని పంచాయితీలలో, కేంద్రాల స్థాపనకూ, గ్రామసేవికల వసతులకూ అద్దె తీసుకోకుండా గృహాలు లభిస్తున్నాయి.


సంక్షేమ విస్తరణ ప్రణాళికలు

రాష్ట్ర ప్రభుత్వాలు -- సంక్షేమ విస్తరణ ప్రణాళికా పథకము : ఖర్చులలో సగంభాగం రాష్ట్రసలహాసంఘాల నిమిత్తమూ, నాలుగోవంతు ప్రణాళికా పథకం నిమిత్తమున్నూ దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ తమ తమ రాష్ట్రాలలో భరిస్తాయి. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికల నిర్వహణకు పూర్తిగా సగం ఖర్చు భరిస్తాయి. అందువల్ల నిర్వహణ సంఘాలు విరాళాలవల్ల బాగుచేసిన తమ సమన్వయ వింశంతో విరివిగానూ పకడ్బందీగానూ సేవచేయుటానికి అవకాశం కలిగింది.

చిక్కులు : ఈ పథక నిర్వహణ మొదలు పెట్టిన తరవాత కొన్ని చిక్కులను ఎదుర్కోవలసి వచ్చింది. భారతదేశం రకరకాలైన సాంఘిక, ఆర్థిక, భౌగోళిక, సాంస్కృతిక ప్రాంతాలతో కూడిన విశాలమైనదేశం. అందుచేత ఆయా ప్రాంతాల పరిస్థితులనుబట్టి పథకంలో మార్పులు చెయ్యవలసివచ్చింది. చాలా వెనకబడిపోయి అందుబాటులో లేకండా, మానవుల ప్రాథమికావసరాలు కూడా లభ్యంకాకుండా ఏ సేవా సంస్థలూ పని చెయ్యని ప్రదేశాలు ఎన్నింటినో మనం చూడవచ్చు. ఇటు చూస్తే తమ అవసరాలను గుర్తించే ప్రజలూ, ప్రజాక్షేమంకోసం ఏళ్ళతరబడి అల్లుకుపోయిన సేవా సంస్థలూ ఉన్న ప్రదేశాలూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులవల్ల ఈ పథకాన్ని ప్రవేశపెట్టడంలో అనేక ఇబ్బందులు తారసిల్లాయి.

మొట్టమొదట కొన్ని కేంద్రాలు ఒకేఒక కార్యక్రమంతో మొదలుపెట్టాయి. ఆ కార్య స్వభావం అక్కడి సమాజావసరాలనుబట్టి మార్పు చెందింది. ఒక గ్రామ సేవిక ఇంకొక సహాయకుడూ కలిసి బాలవిహారాలూ, కళలూ, చేతిపనుల క్లాసులూ, సాంఘికవిద్యా కార్యకలాపాలు జరపగలరని తలంచాం. కాని అది ఆచరణలో అసాధ్యం అయింది. దీనిని పురస్కరించుకొని, 1954 సంవత్సరం నవంబరు నెలలో ఢిల్లీలో జరిగిన రాష్ట్ర సలహాసంఘాల అధ్యక్షుల సమావేశంలో బహుముఖ సేవా నిర్వహణకై ఇద్దరు కాక ముగ్గురు (సాంఘిక విద్య, చేతిపనులు మొదలైనవి చూడటకు ఒక గ్రామసేవిక, మాతాశిశు సంరక్షణకు ఒక మంత్రసాని, సాధారణ కృషికి ఒక సహాయకుడూ) ఉండాలని నిశ్చయం జరిగింది. పుదుచ్చేరీ, ఢిల్లీ ఇంకా కొన్ని ఇతరరాష్ట్రాలూ ఈ పద్ధతిని అవలంబించాయి.

కొన్ని వెనకబడి ఉన్న రాష్ట్రాలలో, అనగా తరతరాలనుంచి ఘోషా పద్ధతి పాతుకుపోయిన రాష్ట్రాలలో ఈ ప్రణాళికా ప్రయోజనాలను అందుకుందుకు తమ గృహాలలోనుంచి స్త్రీలను బయటికి లాగడం కష్టమౌతూ ఉంది. ఇంకొక చిక్కేమిటంటే స్త్రీ సంఘ సేవికల కొరత. స్థానిక సమాజాల సుముఖతవల్ల ఈ చిక్కు కొంతవరకు అధిగమించాం.




ప్రారంభించిన కొద్ది మాసాలలోనే, మాతా శిశు సంరక్షణతప్ప ఇతర కార్యకలాపాలు కేంద్రాలు ఉన్న గ్రామానికే ప్రత్యేకింపబడినట్లు తోచింది. కేంద్రస్థానానికి చుట్టుపట్ల గ్రామాలు పర్యటించి, అందలి స్త్రీలు, సాంఘిక విద్య ఇతర చేతిపనులు నేర్చుకోడానికీ,పిల్లలను బాలవిహారాలకి పంపమని చెప్పడానికీ తగినంత కృషి జరగలేదు. అందుకోసం ఇంకొక జీతగాడు ఏర్పాటయాడు. జీపుకారు ఉపయోగిస్తూ పరిసరగ్రామములలో తరుచు ఉపన్యాసాలు సమావేశాలూ ఏర్పాటుచేస్తూ ఈ కృషిని అతడు విస్తృతం చేస్తాడని ఆశిస్తున్నాం.

అన్నింటికంటె గట్టి చిక్కయిన ఆటంకం ఒకటి ఆయా కేంద్రాలలో పనిచేయడానికి తగినంతమంది గ్రామసేవికలు లేకపోవడమే. చాలా రాష్ట్రాలు ఈ చిక్కు విడదియ్యమని కేంద్ర సంస్థను పదేపదే కోరుతూవచ్చాయి. అందుకు కేంద్ర సంస్థ గ్రామసేవికల శిక్షణఏర్పాట్లను కస్తూర్బాగాంధీ జాతీయ స్మారకనిధి వారికి ఒప్పచెప్పింది. సంవత్సరానికి సుమారు వెయ్యిమంది గ్రామసేవికలు తయారవుతారని అంచనా వేశాం. ఇలాగే మంత్రసానుల్నీ ఆయాలనీ తయారుచేయడానికి భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వశాఖ సలహాతో ఇంకొక పథకాన్ని నిశ్చయం చేశాం.

సంక్షేమ విస్తరణ ప్రణాళికలు

ప్రాంతీయసేవకుల సమావేశం: ఆంధ్రా, మైసూరు, హైద్రాబాదు, తిరువాన్కూరు కొచ్చిను, కూర్గ రాష్ట్రములలోని జిల్లా కార్య కర్తల సమావేశం ఒకటి మద్రాసులో ఈ ఏడు జనవరి నెలలో ఏర్పాటుచేసి, అందు వారి సమస్యలూ, అవరోధాలు చర్చించి వాని నివారణకు చేయ్యవలసిన ఉపాయాలు ఆలోచించి నివేదించడానికి కేంద్ర సంస్థ సంపూర్ణమైన అవకాశం కల్పించింది. అలాంటిదే జూన్ నెలలో బొంబాయి, సౌరాష్ట్ర, కచ్ రాష్ట్రాల కార్యకర్తల సమావేశం ఒకటి ఉద్భవచ్చే చిక్కులను అధిగమించడానికి మార్గాలు చర్చించేందుకు బొంబాయిలో జరిగినది.




ప్రణాళికా ప్రదేశముల తణిఖీ: కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ అధ్యక్షురాలున్నూ, ఇతర సభ్యులున్నూ నిర్ణీత సమయాలలో వివిధ రాష్ట్రాలలో పర్యటించి, రాష్ట్ర సలహా సంఘాలను, నిర్వహణ సంఘాలను ఒక మార్గాన్ని నడిపించి, ప్రోత్సాహం కలగజేస్తూంటారు. ఈపర్యటనలు రాష్ట్ర సంఘ సభ్యుల సంశయాలూ, చిక్కులూ తీర్చుకోడానికి అవకాశం ఇస్తాయి. రాష్ట్రాలలో రాష్ట్ర సలహాసంఘ సభ్యులు వివిధ కేంద్రాలను సందర్శించి, ప్రణాళికా నిర్వహణ సంఘాలకు వారు నిర్వహించే ప్రణాళికలు ఇతోధికంగా పటిష్ఠం చేయడానికి తమ సలహాలను ఇస్తూంటారు.

ఎంతపని జరిగిందీ తెలుసుకొనేందుకు కేంద్ర సంస్థ పరిశోధనోద్యోగులు కూడా ప్రణాళికా కేంద్రాలను సందర్శించి నిర్వాహకులతోనూ, సమావేశ, కర్తలతోనూ స్వచ్ఛంద సేవకులతోనూ చర్చలు జరుపుతూ ఉంటారు.

గ్రాంటుల వ్యయ వినియోగం చూడడానికి చాలా రాష్ట్రాలలో ఇన్స్పెక్టర్లనూ, సంక్షేమ విస్తరణ ప్రణాళికలను చూడడానికి వెల్ఫేర్ ఆఫీసర్లను నియమించుకోడానికి అనుమతి ఇవ్వబడింది. వీరందరి నియామకంతోనూ రాష్ట్ర సంఘాలు పటిష్ఠంగా పనిచేయడానికి కావలసినంత బలం చేకూరింది.

సమీక్ష: అపూర్వం అయిన ఈ సంక్షేమ సేవా కృషి విషయంలో సంక్షేమ విస్తరణ ప్రణాళికలయొక్క యావత్తు పథకమున్ను కేంద్ర సంస్థయొక్క సాహస కృత్యమనుట అందరూ మనసులో ఉంచుకోవాలి. మేము పూర్తిగా అయోమయంనుంచి ప్రారంభించాము. అనుభవం చెప్పిన పాఠాలవల్ల ప్రణాళికలకు ఆచరణయోగ్యమైన ఒక ఆకారం సమకూరింది.

“ఈ ప్రణాళికా నిర్వహణకు విశ్వాసమే బలమై, విజ్ఞానమే వెలుగై, అనుభవమే గురువుగా పనిచేయుగాక” అని కేంద్ర సంస్థ అధ్యక్షురాలు ప్రారంభోత్సవ సమయాన ఉద్ఘాటించిన ఉపదేశవాక్యములు ఇంత స్వల్ప కాలములో సాధించిన కార్యములకు నిదర్శనము.



భారత సమిష్టి కుటుంబములో వృద్ధుల పోషణ



"వృద్ధాప్యం కారణంగా పనినుండి విరమించిన పురుషుడు ఏదో ఒక ప్రయోజనకరమైన పనిలో నిమగ్నుడై వుండటం కష్టం; అందుచేతనే ఈ వయస్సులో స్త్రీకంటె పురుషుడే ప్రశాంత జీవనాన్ని గడపలేక పోతున్నాడు."

"ఇరావతీ కార్వే"

సమిష్టి కుటుంబం అంటే భారతదేశంలో పట్టణ ప్రాంతాల, పల్లె ప్రాంతాల మనం సాధారణంగా చూస్తుండే మామూలు కుటుంబం అని నా అభిప్రాయం. ఈ కుటుంబంలో భార్య, భర్త, తల్లిదండ్రులు, వీరు కాక సోదరుడుకాని సోదరికాని వుంటారు. ఆ సోదరుని పిల్లలుకూడా వుంటారు: వీరందరినీ సాధారణంగా మనం చూస్తూనే వున్నాం; [illegible] ముసలితాతయ్య, అవ్వ, తల్లి దండ్రులు, పిల్లలూను, కొడుకులు ఇంటినుండి దూరంగావుండడం [illegible] తాత, అవ్వ వీరి పోషణను కొంత [illegible] కాని [illegible] మిగిలే [illegible] వీరి పోషణకు సరిపోదు. అందు చేతసమిష్టి కుటుంబాన్ని గురించి మాట్లాడేటప్పుడు సాధారణంగా సంపాదించే పురుషుడు, స్త్రీ; వీరి మీద ఆధారపడే వృద్ధులైన తల్లి దండ్రులు; ఎదిగే పిల్లలూ చంటిపిల్లలూ, అని చెప్పుకోవాలి. ముదుసలుల విషయంలో శ్రద్ధ తీసికొనేటప్పుడు వాళ్ళ వయస్సెంతో, వారి శరీరదార్ఢ్యం ఏలా వుందో; ఎలాంటి తత్వపు మనుష్యులో ముందుగా తెలుసుకోవాలి. కొందరు ముదుసలులు ఇంటిదగ్గర ఏదో ఒకపని చేస్తూనే వుంటారు. వీరిలో స్త్రీలు వంట వండడం, పిల్లల్ని సముదాయించడం, బియ్యం బాగు చేయడం— ఇలాంటి పనులు చేస్తూంటారు. కాని పురుషుల విషయం వేరు. మంచి యౌవనంలో వున్నప్పుడు ఆఫీసులలో పని చేయడం; పొలాలలో గాని, కర్మాగారాలలోగాని పని చేయడం, వీటికి అలవాటు పడి వుంటారు; ఈ రకపు పనికి శరీరబలమే కాకుండా ఒక ప్రత్యేక నైపుణ్యత కావాలి "కాని వృద్ధాప్యం కారణంగా పనినుండి విరమించిన పురుషుడు ఏదో ఒక ప్రయోజనకరమైన పనిలో నిమగ్నుడై వుండటం కష్టం; అందుచేతనే ఈ వయస్సులో స్త్రీకంటె పురుషుడే ప్రశాంత జీవనాన్ని గడపలేక పోతూన్నాడు".

మామూలుగా మనంతినే ఆహారంకాక, ఒకే

వృద్ధుల పోషణ

ప్రత్యేకమైన ఆహారం వృద్ధాప్యం కారణంగా స్త్రీ పురుషులకి కావలసివుంటుంది. శరీరంలో ఓపిక తగ్గిన కొలది వీరికి రోగులకిచ్చే ఆహారాన్ని ఇవ్వవలసివుంటుంది. పైన ఉదాహరించినటువంటి కుటుంబాలలో, పగలల్లా పురుషుడు పనిపాటులలో నిమగ్నుడై ఇంటికి దూరంగావుంటాడు. అతనిభార్య పిల్లల్ని సముదాయించడంలోనూ, ఇంటి పనులను చూసుకొనడంలోనూ నిమగ్నమై వుంటుంది. అందుచేత వృద్ధుల విషయంలో శ్రద్ధతీసికొనడానికి తీరిక బాగా [illegible] వుండదు. —[illegible] వృద్ధుల సహాయానికి ఒకరిని నియమించాలనుకొన్నా [illegible] తగిన ఆర్థిక స్తోమత లేక ఇంట్లో [illegible] పిల్లలే [illegible] వీరిని సహాయం చేస్తుంటారు. కాని వీరికి స్వాతంత్ర్యం వదలి, [illegible] పనులు [illegible]

వీరికికావలసిన శారీరకావసరాలే కాకుండా ఈసమస్యని మనం మరొకదృష్టి కోణంలోకూడా అవగాహన చేసుకోవాలి. భారతదేశంలో వారసత్వానికి అలవాటు పడ్డ కుటుంబాలతో కుటుంబాన్ని పోషించే పురుషుడు తనభార్య పిల్లలు తానుచెప్పినట్టు నడచుకోవాలనే భావంలో వుంటాడు. భార్యకూడా పిల్లలు తానుచెప్పినట్లు నడచుకోవాలనే భావంలోవుంటుంది. కొడుకులు పెద్దవాళ్ళయి కోడళ్ళు వచ్చినా, పూర్వంలాగే తమ చెప్పుచేతలలో వీరువుండాలనే భావాలు పెద్దవాళ్ళకిపోవు. సాంఘికకట్టుబాటులుకూడా ఈ విధానానికి తోడ్పడతాయి. ఈ పెద్దవాళ్ళ సంపాదనతగ్గి, ఇంకాతమ అధికారం కొడుకులమీద చలాయించడం మానుకోలేకపోతే యువకులకి వీళ్ళు బరువే అవుతారు. ఈరకపు ముసలివాళ్ళు ఎప్పుడూ ఏదో సణుగుతూ, దెప్పుతూ, మాటిమాటికి దెబ్బలాడటమే కాకుండా, ఇరుగుపొరుగు ఇండ్లకువెళ్ళి కొడుకుమీద కోడలుమీద చాడీలుచెప్పడం ప్రారంభిస్తారు. ఈపరిస్థితులలో ఎంతోబాధ పడుతున్న సంసారాలు నేను చూశాను. ఎప్పుడూ దెప్పిపోస్తూ, అదికావాలి ఇదికావాలి అని అడుగుతూ, ప్రతిదానికి తప్పులు పట్టుకుంటూవుండే ఈ ముసలివాళ్ళమీద కొడుకులకి కొన్నాళ్ళకి గౌరవం తగ్గుతుంది. క్రమేపి ఈపరిస్థితి దెబ్బలాటలోకిదిగుతుంది. ఈయుద్ధంలో చిన్న పిల్లలు ఎప్పుడూ తమతల్లితండ్రుల పక్షమే; ముసలివాళ్ళని పట్టుకొని వెక్కిరించడం, వేళాకోళం చేయడం మొదలు పెడతారీపిల్లలు. దీనివలన వీరిలో క్రమశిక్షణ నశిస్తుంది. ఇంకఆయిల్లు నరకం కాక మరేమౌతుంది?

ముసలులు ఆర్థికంగా ఒకరిమీద ఆధారపడివుండట మన్నది ఈ పరిస్థితులలో గమనించతగ్గ విషయం. ఒకప్పుడు తమ సంతానాన్ని పోషించిన ఈ [illegible] వృద్ధాప్యంలో తమకి కావలసిన [illegible] కోసం [illegible] [illegible] [illegible] సంపాదించినదంతా ఖర్చు చేసిన వృద్ధులకు కూడా ఎక్కువే. అందుచేత ఈ వృద్ధాప్యంలో వీళ్ళకి కావలసిన ప్రతిచిన్న వస్తువూ, ఎంతో కష్టంమీద లభిస్తుంది. ఆ గుప్పెడు మెతుకులూ, గుక్కెడుమంచినీళ్ళూ దెప్పుళ్ళతో వల్లింపులతో, తమకేదోవీళ్ళు పెద్దబరువుగా భావించి పడేస్తుంటారు.

మరి మనం ఈ వృద్ధుల సమస్య ఏవిధంగా పరిష్కరించడం అని అంటే దానికి సమాధానంమనకు ఏవిధమైన కుటుంబం, సంఘం కావలసివుంటుంది? అనేప్రశ్న మీద ఆధారపడివుంటుంది.కిమన మూడు తరాలుగా కలసిమెలసి వుంటూ, కలసికట్టుగా సంతోషంగా వుండే కుటుంబం కావాలీఅంటే ముసలితనంలో పెన్షనువుండటం, ముసలులు కొడుకులమీద కోడళ్ళమీదా అధికారం చలాయించకుండావుండేటట్లువారుతగినసంస్కారం అలవరచుకొనేట్లు బోధించడం ఇవి ముఖ్యమైన విషయములు: యువకులూ, పిల్లలూ వృద్ధులయెడవినయవిధేయతలతో ప్రవర్తించాలని చెప్పేముందు వృద్ధులుకూడాతమబూజుపట్టిన పట్టుదలలను సడలించుకొని, సర్దుకొని జీవితాన్నిసాగిస్తేనే అలాంటి, కుటుంబాలు తరతరాలుగా సుఖ సంపదలతో తులతూగడమేకాక సాంఘికంగానూ, ఆముష్మికం దృష్ట్యానూ ఎంతో ఘనవిజయాన్ని సాధింప గలుగుతాయి.

బాలానందం

దైవ ప్రేమ

శ్రీ పి. యస్. రామమోహనరావు

ప్రశాంతమౌ నిశారాత్రి—
పర్ణశాల ఒకదానిలో,
కళ్లుమూసి ధ్యానమగ్నుడై
ఉన్నాడొక యోగివరుడు.

అంతలోనె పర్ణశాల
వెలుగులతో నిండిపోయె!
కళ్ళుతెరచి చూడ దివ్య
పురుషుడొకడు కానవచ్చె.

బంగరు గ్రంథమున ఏదో
వ్రాసే దేవతని చూసి,
"తమరు వ్రాయునది ఏమని"
తిన్నగ ప్రశ్నించె యోగి

"దేవుని ప్రేమించువారి
పేరు"లని దేవతయన
"నాపేరును గలదేమో
చూడం"డని అడిగెనతడు.

"లే"దని దేవత పలికిన
ఖిన్నుడైన యోగి, కొంత
వడికి మరల సంతసమున
దేవత నిట్లర్థించెను;

"దేవుని ప్రేమించే అ
దృష్టము లేకున్న, నన్ను
సాటి నరులు ప్రేమించే
వారిలో నొకనిగ వ్రాయుడి?"

'అట్లే' యని దివ్య పురుషు
డంతర్హితుడై పోయెను;
మరుసటి దినమున మరలా
యోగికి ప్రత్యక్షమాయె,

ఈమారాతడు చూపిన,
దేవునిచే ప్రేమింపబడే
పేరులలో, ప్రథమంగా
వ్రాయబడెను యోగి పేరు!

తీరిన కోరికలు

★

శ్రీ చిక్కాల భూపతిరావు

రామా పురంలో సుబ్బయ్యఅనే బ్రాహ్మణు డుండే వాడు. అతనికి మసిబొగ్గు లాంటిభార్య వుండేది. 'నాభార్య ఎఱ్ఱగావుంటే ఎంత బాగుండేది' అని విచారించేవాడు. ఒక రోజున ఆ విప్రుని ఇంటికి ఒక సన్యాసి అతిధిగా వచ్చాడు. వారిద్దరు అతనిని భక్తితో పూజించారు. వీరిభక్తికి సంతసించి ఆ సన్యాసి తనవద్దనున్న మూడుకొబ్బరి కాయల్ని బ్రాహ్మణుడి చేతికిచ్చి 'నీవు ఏదైనా ఒకకోరిక తల్చుకుని ఒక కొబ్బరికాయను పగులగొట్టావంటే నువ్వు తల్చుకున్న కోరిక సిద్ధిస్తుంది. అలాంటి మూడుకోరికలను ఈ మూడుకొబ్బరికాయలు తీరుస్తాయి. వీటిని జాగ్రత్తగా వుంచుకో' అనిచెప్పి సన్యాసి తీర్థయాత్రలకని కాశీకి వెళ్ళి పోయాడు. బ్రాహ్మణుడు కాయల్ని పుచ్చుకొని లోపలికివెళ్ళి 'నాభార్య ఎఱ్ఱగామారాలి' అని తన మనస్సులో తల్చుకొని ఒక కాయను పగులగొట్టాడు. వెంటనే బ్రాహ్మణుని భార్యశరీరం నిమ్మపండు లాంటి రంగుగా మారింది. బ్రాహ్మణుడికి పట్టరాని సంతోషం కలిగింది. ఈసంగతి వూళ్లోవాళ్లకి తెలిసింది. వాళ్లందరూ బ్రాహ్మణుని భార్యనుచూచి ఆశ్చర్యపోయారు. బ్రాహ్మణుడు తన భార్య అందానికి మురిసి పోయేవాడు.

ఇలా ఉండగా ఒక రోజు బ్రాహ్మణుడు ఏదోముఖ్య మైనపనిమీద పొరుగూరు వెళ్ళాల్సివచ్చి వెళ్లాడు. ఆ మరు నటిదినం ఆ వూరి రాజకుమారుడు బ్రాహ్మణుడువుంటున్న వీధివైపు గుఱ్ఱంమీద పోతున్నాడు. అదేసమయంలో ఆ బ్రాహ్మణుడి భార్య వీధిగుమ్మంలో నిల్చుని బిక్షవాడికి అన్నంవేస్తూవుంది. ఆ రాజకుమారుడంటేనే ఆ వూరి ఆడవారికి అమితభయంగా వుండేది. అంచేత ఆ వీధిలోనివారెవ్వరూ బయటికిరారు. బ్రాహ్మణుడి భార్య యువరాజు రావటం చూడలేదు. కాని యువరాజు ఆమెను బలవంతంగా లాగి గుఱ్ఱంమీద ఎక్కించుకొని అంతః పురానికి తీసుకపోయాడు. ఒక చక్కని మూడంతస్థుల మేడమీద ఆమెను వంటరిగా ఉంచాడు.

పాపం ! బ్రాహ్మణుడి భార్య మూడు రోజులవరకు, అన్నం, నీళ్లు మాని మేడ లోఏడుస్తున్నది. 'అయ్యో ! భగవంతుడా, ఆ పాడుసన్యాసి మాకెందుకు కొబ్బరికాయలు ఇవ్వాలి ? నేనెందుకు అందకత్తె కావాలి ? ఈ కర్మ నాకెందుకు? పట్టాలి' అనిసన్యాసిని నానామాటలు తిట్టి పోసింది.

ఇలా ఉండగా పొరుగూరు వెళ్లిన బ్రాహ్మణుడు ఇంటికి తిరిగి వచ్చాడు. రావడంతోనే తన భార్యను రాజ కుమా రుడు చెరపట్టి తీసుకొని వెళ్ళాడన్న సంగతిని పక్కింటి పుల్లమ్మద్వారా తెలుసుకొని, గబాలునలోనికి పోయి ఓ కొబ్బరికాయను కొట్టాడు. వెంటనే రాజుగారి మేడలో ఉన్నబ్రాహ్మణుడి భార్య ఎలుగు బంటిగా మారిపోయింది. అసలే ఆకలితో మాడిపోతుండడంచేత ఎలుగు బంటికి కోపంఎక్కువయింది. మేడలోని బీరువాలు, గాజుదీపాలు, సీసాలు అన్నిటిని ఒక్కసారిగా ముక్కలు ముక్కలు చేసింది. గుర్ గుర్ మని గర్జించడం మొదలు పెట్టింది. ఇక ఆ రాత్రి బ్రాహ్మణుడి భార్యను చూడటానికి రాజ కుమారుడు బాగా అలంకరించుకొని పెళ్లికొడుకు లాగా తయారయ్యాడు. ఎవ్వరికీ తెలియకుండా మేడ తలుపు తీసి లోపలికి వెళ్ళాడు. మేడలోని ఎలుగుబంటు రాజ కుమారుణ్ణి చూడగానే అమాంతంగా మీదపడి గోళ్లతో రాజకుమారుని వొళ్ళంతా చీల్చింది. ఆతను కుయ్యో, మొర్రో అని మొత్తుకున్నాడు. కాని రాజభటులు కూడా మేడలోకి రాకూడదని రాజకుమారుడు ఇంతకు ముందు ఆజ్ఞాపించినందువల్ల వాళ్ళుకూడా రాలేదు. ఎలుగు బంటు మాత్రం రాజకుమారుణ్ణి చీల్చి రక్తం బాగా త్రాగి, గుర్ గుర్ అంటూ గదిలో తిరుగుతున్నది.

మామూలు ప్రకారం మేడను కాపలా కాయడానికి రాజభటులు వచ్చారు. వారికి గుర్ గుర్ అనేశబ్దం విని పించింది. వెంటనే వారు గదిదగ్గరకు వెళ్ళిచూశారు. ఇదేమి టీవింత ! లోపల ఎలుగుబంటు వుందే ! అని వెర్రి కేకలు పెట్టి లోపలికి వెళ్లారు. అక్కడ రాజకుమారుడు కూడా స్పృహతప్పి పడివుండటంచూసి భయపడ్డారు. ఎలుగుబంటు రాజభటుల మీదికి ఉరికింది. కాని రాజ భటులు తప్పించుకొని ఒక్కపరుగులో అంతఃపురానికి చేరుకున్నారు. ఎలుగుబంటు మాత్రం వీధులవెంబడి కేకలు పెడుతూ పరుగెత్త సాగింది దారిన పిల్లల్ని, పెద్దవాళ్ళనికూడా గోళ్ళతో రక్కుతూ పెద్దగందరగోళం చేస్తూ బ్రాహ్మణుడి ఇంటదగ్గరకు వచ్చింది.

ఎలుగుబంటును చూసి బ్రాహ్మణుడికి విచారంవేసింది. 'అయ్యో నాభార్యకు ఎంతఅవస్థ పట్టింది. అందంగా వుండటం వల్లనేకదా దీనికీగతి. నల్లగావుంటే ఎంత హాయిగావుండేది. నాకుకూడా సుఖంగా వుండేదికదా' అని మూడో కొబ్బరిగాయను బయటకుతెచ్చి "నా భార్య పూర్వంలాగే మారిపోవాలి" అని చెప్పి పగులగొట్టగా ఎలుగుబంటు మామూలు మనిషిఅయింది. తనకోరికలు తీరినవని ఆనందించాడు. బాలలూ ! మీరుమాత్రం అలా అవకండేం ! మీభార్యలను కూడా ఏరాజకుమారుడో ఎత్తుకు పోగలడుసుమా !

★ దైవవిధి ★

శ్రీ కంభంపాటి కృష్ణకుమార్

పూర్వము ద్రావిడదేశమున వేదమౌళి యను బ్రాహ్మణుడు ఉండెను. అతడు ఆదేశమున పెద్దపేరుగల భవిష్యద్వాది అని పేరుబడసెను. ఆయనకు పిరలి యను కుమారుడు కలడు. ఆయన ఒకదినమురాత్రి వాకిట నిలచియుండగా ఒకనక్షత్రము మాలవాడవైపున రాలిపోయెను. అతను ఆశ్చర్యపడి చూచి ఆందోళనతో మరునాటి ఉదయమునలేచి మాలవాడలో ఎవరైన నీళ్లాడిరా అనితెలిసికొనగా నాటిరాత్రి ఆచుక్క రాలినసమయముననే యొక మాలపడుచు ఆడుబిడ్డను కనెనని తెలియవచ్చెను. అతను భవిష్యద్వాది కనుక భవిష్యత్తున తనకు రాబోవు ఆపదను గ్రహించి వేదమౌళి మాలవానింటికి వచ్చెను. ఆపిల్లతండ్రిని పిలచి "నీబిడ్డనిచ్చెదవా లేక బ్రాహ్మణ కులమును నాశనము చేయుదువా" అని అడిగెను. అందులకు పాపమా మాలవాడు విచారించి, బ్రాహ్మణ కులమును చెరుప నిష్టములేక, తనకూతురును భార్యనిద్రించుచుండగా తెచ్చి బ్రాహ్మణునకు అప్పగించెను. అప్పుడా వేదమౌళి శిశువును [illegible] యొకపెట్టెయందు భద్రపరచి కావేరియందు విడచెను. ఆపెట్టె కావేరిలో బహుదూరము జరిగి యొక ఘట్టమును చేరెను. ఆఘట్టమునందు నారాయణభట్టు అను బ్రాహ్మణుడు స్నానముచేయుచున్న సమయమున ఆపెట్టె వచ్చి తనకు తగిలెను. అదిచూచి ఆబ్రాహ్మణుడు సంతోషముతో దానిని తెరచెను. అందు ఆడుబిడ్డను చూచి, తనకు సంతానము లేకపోవుట చేత ఆబిడ్డను అల్లారు ముద్దుగా పెంచుచూ, కావేరి యనిపేరు పెట్టి విద్యాబుద్ధులు గఱపుచుండెను.

ఇచట వేదమౌళి కొన్నిదినములకు విధివశమున గతించెను. అందువలన పిరలి విద్యాభ్యాసమునకై విదేశమున కేగవలసి వచ్చెను అట్లాతడు తిరుగుచూ కావేరి యున్న బ్రాహ్మణుని యింటికి వచ్చెను. నారాయణభట్టు పిరలికి తనకూతురు నివ్వదలచి యాతని దనయింట నుంచుకొని సమస్త విద్యలు నేర్పుచుండెను. అటుపిమ్మట పిరలికిని, కావేరికిని వివాహము అయినది. ఇట్లుకొన్ని దినములు గడచినపిదప కావేరి తన భర్తతో తానుదొరికిన విధమును తెలియపర్చెను. అంతనా పిరలి ఈపిల్ల తన తండ్రి కావేరిలోవదలిన మాలపిల్లయని తెలిసికొని మిగుల చింతించి భార్యకును, మామగారికిని తెలియకుండా నొక నాటి రాత్రి లేచి పలాయితు డయ్యెను. మరుచటిదినమున తనభర్తను కానక మిగులవృద్ధుడగు తనతండ్రి ఆజ్ఞను పొంది పెనిమిటిని వెదక నేగెను.

అట్లామె వెదకుచూ పోయి ఒకచోట తనభర్తను గనెను. అప్పుడామె ఇంటికి రమ్మని ఎంత వేడుకొన్నను భర్త విననందున విసిగి యాతని వెన్నంటసాగెను. ఇట్లా దంపతులు కొన్నిదినములు అరిగిన పిదప నొకచోట భార్య నిద్రించుచుండగా నామెనువదలి పిరలి తప్పించుకొని పోయెను. తదనంతరమామె లేచి తన భర్తను కానక తిరిగియాతని వెదకుచూ తిరుగుచుండెను. అట్లామె అడవులయందు తిరుగుచూ పోవుచుండగాదారిలో దొంగలుపట్టుకొని బలవంత పెట్టసాగిరి. ఆ సమయమున ఒకధనవంతుడు వారినిచూచి, ఆమెను రక్షించి ఆమెవృత్తాంతము తెలిసికొని యామెను తనపుత్రికగా భావించి తనగ్రామమునకు తోడ్కొని పోయెను. ఆమెను తెచ్చిన స్వల్పకాలముననే యాతడు గతించెను. ఆయన తన మరణ సమయమందు తనకుగల ధనమును తన కొడుకులతో సమముగా కావేరికిని పంచియిచ్చెను. ఆధనముతో ఆమె ఒక సత్రమును గట్టించి సాధులకు అన్నదానము చేయుచుండెను. ఈప్రకారము కొన్నిదినములు గడచిన పిదప పిరలి బిచ్చగానివలె చిరిగిపోయిన బట్టలతో ఆసత్రమునకు వచ్చెను.


అంతనామె తనయలవాటు ప్రకారము అతిథిని సత్కరించి యాతని కన్నపానాదులు నిచ్చెను. భోజనానంతరము ఆతడామెను అడిగి తెలుసుకొని ఆమెతన పత్నియని గుర్తించెను. కాని మరల తనను వెంబడించునను భయముచేత నాసంగతి నామెకు ఎఱుక పరచకుండెను. ఆమెకు ఇంతధనము ఎటులవచ్చెనని ఆశ్చర్యముపొంది. ఆమెపై దురభిప్రాయముగా తలంచి మరునాడు తిరిగిపోవుచుండగా నామెయాతని సాగనంపుటకై వచ్చి యుపచార వచనములతో నాతనికి నమస్కరించెను.

ఆమెవినయ భాషణముల వలన పిరలి హృదయము కరిగి తనభార్యకు తన్నెరింగించు కొనెను. అంతనామె తనకు ధనముదొరికిన విధము తెలిపి ఆతనిని వేడుకొనెను. పిరలి తిరిగి కావేరిని భార్యగా స్వకరించెను. అంతనుండి భార్యాభర్తలిరువురును యనురాగముతో కలసిమెలసి యుండిరి. ఇట్లు పిరలి తనభార్య మాలపిల్లయని, ఆమెను అగ్ని సాక్షిగా వివాహము ఆడినప్పటికిని విడచుటకు ఎన్ని ప్రయత్నములు గావించినను తుదకు దైవవిధి తప్పినదికాదు. మరియు సత్ప్రవర్తన కులమును బట్టి యుండదు. ★

తెలుగు సామెతలు

శ్రీమతి గు. వెంకటాయమ్మ

1. కాకిని తీసుకవచ్చి పంజరములో పెడితే మాత్రం చిలుక వలె పలుకునా
2. కాకి పుట్టే నలుపే, పెరిగే నలుపే
3. కాచిని చెట్టుకే రాళ్ళదెబ్బలు.
4. కాదు కాదు అంటే. నాది నాదిఅన్నాడట
5. కుంటిమేక నిచ్చావు అంటే, కాలువిరుగ కొట్టావన్నాడట
6. ఆలస్యంచేసిన అమృతం కూడవిషమే
7. కారణం లేకుండా, కార్యం పుట్టదు
8. కాలము పోవును మాటనిలుచును.
6. చేతితో చూసి తలతో చెయ్యాలి
10. విందుకు మరునాడు మందు
11. కాకిపిల్ల కాకికి ముద్దు
12. కార్తెముందు ఉరిమినా, కార్యము ముందర తొందర పడినా చెడ పోతుంది
13. కూనయని పెంచితే, గండుయై కఱవ వచ్చిందిట
14. కుక్కని ముద్దుపెట్టు కుంటే, మూతియంతా తెగనాకిందట
15. తన్ను పొడిచిన గంగిగోవునైన, తిరిగి పొడిచిన పాపంలేదు
16. గుమ్మడికాయ దొంగ అంటే బుజాలు తడిమి చూచుకున్నాడట
17. కవ్వముఆడినా, కదురాడినా కరువు వుండదు
18. గ్రుడ్డికన్నా, మెల్ల మేలు.
19. కోడి గ్రుడ్డును పగులకొట్టుటకు గుండ్రాయి కావలెయునా ?
20. గంగలో మునిగినా కాకి హంస అవుతుందా ?
21. గాడిద పుండుకి బూడిద మందు.
22. చిత్తము శివుడుమీద, భక్తిచెప్పుల మీద.
23. చస్తే చచ్చాడుకాని, మంచము ఖాళీ అయిందన్నాడట
24. చద్ది కూడుతినమ్మ మొగుడాకలి ఎరుగదంట
25. చెవిటి పెద్దమ్మా చేంతాడు తేవే అంటే, చెవల పోగులు నాజ్మనా ఎరుగ నందట.



వర్షంలో ఎంతాకర్షణ

శ్రీమతి [illegible]

ఈ వర్షఋతువులలో పనికి బయటికి వెళ్ళటము చేసే బాధగా ఉంటుంది. రోడ్లు బురదగా ఉంటాయి, ప్రక్కన ఉన్నవన్ని పైనచిందుతూంటాయి. పైనవర్షం మీద పడుతూంటుంది. ఈ సమయములో ఎలాంటి బట్టలు వేసుకున్నా, ఎంతబాగా తయారయినా తిరిగి ఇంటికి చేరేటప్పటికి అసహ్యంగా, వికృత రూపాలను పొందుతాము. అందుకనే చాలమంది వానలో బయటికిరారు. అలాఅని ఇంట్లోనే కూర్చుంటే ఎలా? అయినా అలా వర్షంలో వెళ్ళడంలో అవ్యక్తమైన ఆనందముంది. కొంచముశ్రద్ధ తీసికొంటే వికృత రూపాలు ధరించకుండా హాయిగా వానలోని సరదాను పొందవచ్చును.

ఈ కాలంలో అసలు తెల్లబట్టలు వేసుకోకూడదు. అలాగే తేలిక రంగులనుకూడా ఉపయోగించక పోవటం మంచిది వేసవి 'డ్రస్' బీరువాలో పెట్టేసి వర్షాకాలంలో వేరే 'డ్రస్' వేయటం నేర్చుకోవాలి. ముఖ్యంగా ఈ వానా కాలంలో చూపించాల్సిన నేర్పంతా బట్టలలోనే ఉంది. **Brown colour** గాని కెంపురంగుగాని, **Ash colour** గాని వేసుకోవటం మంచిది. బాగా మబ్బు పట్టి చల్లగాలి వేస్తున్నప్పుడు నూలు బట్టలు వేసుకుంటే బాగుంటుంది. ముఖ్యంగా గులాబిరంగు ఆకుపచ్చరంగు **Purple**. వైలెట్ రంగులు వేసుకొంటే ఆకర్షవంతంగా ఉంటుంది. వానవచ్చేటప్పుడు నూలుబట్టలు వేసుకొంటే మంచిది. ఈ వానాకాలంలోని బట్టలు మరీముతకగా కాకుండా, మరీ పల్చగా కాకుండా ఉండాలి, ఒక్కొక్కసారి ఒకప్రక్క తడుస్తూంటే మరోప్రక్క ఆరిపోయేట్లుండాలి.

ఇక ముఖ అలంకరణ చూదాము. ఈ కాలంలో మామూలుగా చేసే అలంకరణ పనికిరాదు. ఏదైనా కాస్త ఎక్కువగాచేస్తే వానకుతడిసి చెరిగి, కొంతపోయి కొంత పోక ముఖమంతా అసహ్యముగా అయి ఒక బఫూన్ మాదిరి తయారవుతాము. అందుకని ఎంత సింపుల్‌గా తయారవగలిగితే అంతమంచిది. ముఖం కడుగుకొనే ముందు కాటుక కొంచెము మందంగా కంటికి రాసుకొని ముఖం రుద్దుకుంటే బాగుంటుంది. ఇలాచేస్తే వాన జల్లులో తడిసినప్పుడు, తుడిచినప్పుడు ఆ కాటుక మరి చెరగదు. బాగా ముఖం తుడుచుకొని స్నో కొద్దిగ రాసి, పౌడరుచాలా పల్చగ అద్దీఅద్దనట్లు రాయాలి. బొట్టు తిలకంతో చిన్నదిగా పెట్టుకొంటే ఏంనష్టముండదు. ఇంతకంటే ముఖ అలంకరణ విషయంలో పెద శ్రద్ధ చూపటం అనవసరం. **Eyebrow pencil** తో దిద్దటం **Beauty spot** పెట్టడము. చెంపలకి **Rosy** వెయ్యటం అంత మంచిదికాదు. అసలు అవి చేయనే చేయకూడదనాలి.

వర్షంలో వింతాకర్షణ

ఇక పోతే జుట్టు సామాన్యంగా కొంచెము వదులుగా వేసుకొంటేచాలు. అయితే నూనె తక్కువగారాయటం ఎంతైనా మంచిది. తర్వాత జడచివర రిబ్బన్స్, జడ గంటలు పెట్టటము చేయకూడదు. అవి తడిసి చీదరగా ఉంటాయి.

అయితే బయటికి వెళ్ళేటప్పుడు చాలాఇదిగాఉండాల్సి వస్తుంది కనుక ఇంట్లో తగినంత జాగ్రత తీసుకోవాలి. పూర్వం చెప్పిన విధాలననుసరిస్తూ శరీరం జాగ్రతగా కాపాడుకోవాలి, మొటిమలు లేకుండా జాగ్రతపడాలి, చాలామంది వానగాఉందని చలిబుగా ఉందని స్నానం చేయరు. అలా ఎప్పుడూ స్నానానికి బద్ధకించ కూడదు, రోజు బోలెడు నీళ్ళతో హాయిగా స్నానంచేయాలి. చన్నీళ్ళతోచేస్తే హాయిగా ఉంటుంది. చన్నీళ్ళుపడకపోతే వేన్నీళ్ళతో స్నానం చేయాలి. మంచిసోపుతో బాగారుద్ది పోసుకొని, వెంటనే తడిలేకుండా తుడుచుకొని, గాలి ఒంటికి తగలకుండా దుస్తులు ధరించాలి, ఎప్పుడుకూడా అరుబయలులో స్నానం మంచిదికాదు. ఇంకో సంగతి; వాననీటిలో కనుక స్నానంచేస్తే శరీరానికి చాలామంచిది. శరీరాన్ని మెత్తగ సుకుమారంగా అందంగా ఉంచుతుంది వాననీరు. వాననీటినిబాగా మంచి స్థలంలో (చూరులక్రింద కాకుండా) పాత్రలలో పట్టుకొని గంటారెండు గంటలు అయిన తర్వాత ఉపయోగించాలి.

మీరుగమనించారు? ఈ వానాకాలంలో ఎవరికాళ్ళు చూసినా వరిసి ఉంటుంది. దీనికికారణం నీళ్ళలోఎక్కువ తిరగటం అని మామూలుగా అనుకొంటారు. ఇదీఒక కారణం అనుకోండి. అసలు ఇదిఒక విచిత్రమైన జబ్బు అన్నమాట. అంటేకాళ్ళంతా గుంటలు గుంటలుగా అయి బాధగా ఉంటుంది. సామాన్యంగా ఈ పాసిపోవటం వాసలైను అయింట్‌మెంట్సుతో పోతుంది. పాసిన చోటు బాగ వేన్నీళ్ళతో కడిగి శుభ్రమైన తువ్వాలుతో తుడిచి కాస్తగాలి తగలనిచ్చి దానిమీద అయింటు మెంట్సో లేకపోతే అమృతమో వాసలైనో రుద్దితే కొంత తగ్గుతుంది. ఇది మామూలుగా పాస్తే అన్నమాట. బాగా కాళ్ళంతా పుండ్లయినప్పుడు డాక్టరుకి చూపించుకోవాలి. ఇప్పుడిప్పుడే పాయటానికి, పగుళ్ళకి ఇంజక్షన్సు కూడా ఇస్తున్నారు. ఈ పగుళ్ళు రాకుండాముందు జాగ్రత్త పడటం అవసరం. నీళ్ళపని కాగానే ఎప్పటి కప్పుడు కుంకుడి నీళ్ళతోకడిగి తర్వాత వేన్నీళ్ళుబాగా కాళ్ళమీద పోసి శుభ్రంగా తడిలేకుండా తుడుచుకోవాలి. ఓపిక ఉంటే బోరిక్ పౌడరుగాని, మామూలు టాల్కమ్‌పౌడర్ గాని వేసికోవటం ఉత్తమము. పోతే చెప్పులు ఎప్పుడు కాలిన ఉండాలి. అంటే బాత్ యామ్ స్లిప్పర్స్ వేసుకొంటే నడవటానికి హాయిగా ఉంటుంది. కాలికి నీళ్ళు తగలకుండా ఉంటాయి. బయటి కెళ్ళేటప్పుడు కూడా సాధ్యమైనంత వరకు నీళ్ళలో కాలుపెట్టకుండా చూసుకోవాలి. రోజు పసుపు కాలికిరాస్తే పగుళ్ళు తగ్గుతాయి.

తర్వాత ఈ వానా కాలంలో కొన్నిమంచి సెంట్సు వాడటం మంచిది. రోడ్లమీద వచ్చేవాన వాసన రాకుండా ఈ సెంట్సుని మెల్లుగా ఉపయోగిస్తే బాగుంటుంది. ఇట్లా ఏదో అవస్థ పడితే వర్షంలోకూడా ఆకర్షణీయంగా ఉండవచ్చు.



కచేరీ చావడి

సరోజా స్వయంవరం

"శ్రీ లింగిచెట్టి చిరంజీవి"

అక్టోబరు పరీక్షల్లో ఇంజనీరుగా రమ్మన్నాయ్ "సరోజా." యింటర్ పరీక్షకు ఉద్వాసన పెట్టి ఆవేళ సాయంత్రం సినిమా పత్రిక చదువుతూ సోఫాలో మమత కళ్లు మూసింది! షుమారు నలుబదిమంది విద్యార్థులు, ఒక్కొక్కరే వస్తున్నారు.

"ఎవరు నువ్వు?"

"ఆ... నన్నే మరచావు? ఆరవఫారంలో లైబ్రేరీ పుస్తకము ఎరువిచ్చిన వాణ్ణి నీ స్మరణాలోబడి ఆ ఏడు ఆగి సజీవుడై వుంటే మరో క్లాసులో కలుసుకోవాలని నిరంతరము దేవుని ధ్యానించిన రాజుని గదూ"

"సఫిషంట్లీ హెర్డ్, ప్లీజ్ షటప్"

"నువ్వెవరవు?"

"ఇంతలోనే నీవు పోల్చలేనంత మారిపోయానూ. నీమీద ప్రేమ, బెంగ, ఇలా క్రుంగించాయంటాన్! నీ ఎగ్జామినేషన్ హాల్లోకి ఎంతోయిదిగా కాఫీపంపింది నేనేగా! నిన్ను చూసి మనసులో వరిస్తూ మనక్లాసులో ఆఖరి బెంచిలోనిద్రించేవాణ్ణి ది మాడరన్ కుంభకర్ణ అని మన క్లాస్ టీచర్ టైటిల్ యిచ్చింది నాకేగా నీ మనోనాథాన్ని కదూ!"

నిద్దురలో కళ్ళుమూస్తూ ప్లీజ్ గెటౌట్"

వీడెవడమ్మా ?

"నే... న్నే... న్నేను... హెడ్ మాష్టరుగారబ్బాయిని. నిన్ను నాహృదయాంగి, రత్నాంగిగా యిది చేసాను. ఏం? నీకు ఇంగ్లీషులో అన్ని మార్కులు ఎలావచ్చేయి? నీ సరుకు నీకు తెలియదు? సన్ ఆఫ్ హెడ్మాస్టర్ గారుతే అంటారు? నేనెవరు ఆలోచించావా? కర్మజీవిని!"

"ఎన్నిసార్లు చెప్పినా బుద్ధిలేదూ, నడుస్తావా? లేక ఝూంకారం వింటావా?"

ఏయ్!...నువ్వు?"

"సర్వకాల సర్వావస్థలయందు నా మదంబునందుండెడి సరోజా! ఎల్లప్పుడునీనామమే జపమాలగా చేసి ఆరాధించానే? గుర్తులేదా జాగ్రఫీ క్లాసులో వడుకునే రామమూర్తిని! గుర్తులేదా?"

"సంతోషించాము... ఏగ్ ప్యాన్!"

"ఈ దౌర్భాగ్యుడెవరు?"

"నిన్ను ప్రేమించిన వాళ్ళంతా యింతేనా? ముచ్చటగా నీవు జార్జెటుచీర కట్టుకొని క్లాసుకొచ్చిన నాడు నీ సీటుకు సిరా అలికిన అల్లరి కాణ్ణిని! హీరో ఆత్మారావుని!"

"నీవు చెడను చేయి నలరు! పారిపో!!"

"తమరు......!"

"ఆ...ఆ... ఔట్ ఆఫ్ కాస్ రోజులు జ్ఞాపకంలే!"

"పరీక్షలయినా మీ కోర్సు పూర్తికాలేదు"

కొంటె వెధవలు గోడలనిండా రాయనే రాశారు. సరోజాకోసం ఎక్స్ట్రా క్లాసులు పెడ్తున్నావని... నీవు వూ అని ఆజ్ఞ ఇస్తే ఎక్స్ట్రా క్లాసులు అమితంగా పెంచాలి!"

ఇంతలో ప్రక్కనేవున్న గ్రామఫోనులో "బృందావనమది అందరిదీ" అన్న పాట వినిపిస్తూవుంది. కన్ను తెరచింది. ఇంజనీరుగారు అఫీసు నుంచివస్తూ ఆమెకు ఇన్విటేషన్ కార్డులు కట్ట అందించాడు.

వరుడు : నిత్యానందనిరాకర్,
ఎం. ఏ. యల్. యల్. బి.
లాజిక్ లెక్చరర్.

వానప్రస్థ సన్యాసాశ్రమములు

కొన్నేళ్ళ సంసారిక జీవితము తరువాత సన్యాసిసుఖీ సంసారిదుఃఖీ యని తెలుసుకొనుట సహజము. కాని మార్కొనిజనీవీవు అయనసతి వివాహపు నాడే ఈవిషయము తెలుసుకొనుట ముదావహము. పూర్వము సాధారణ ప్రజలేకాక రాజులు మహారాజులుకూడా కొన్నాళ్ళు రాజ్య పరిపాలన తరువాత తప్పనిసరిగా వానప్రస్థ సన్యాసాశ్రమములు ప్రవేశించేవారు. ఇది చక్కని విధానము. ప్రస్తుతము మన గృహాల్లో. కుటుంబాల్లో కలిగే అనేక సంఘర్షణలు, మనఃక్లేశములు నిజముగా వృద్ధయువ్వన ఆశయముల పొందిక కుదరకే.

ప్రాన్సు దేశములో మార్కొనిజనీవీవురు పెద్ద ఎస్టేటు కలదు. ఆయన ఆయనభార్య వివాహమునాడు తమకు పుట్టబోవు బిడ్డలు సుఖముగా జీవితములో స్థిరపడిన తరువాత సంసారిక జీవనమునకు తిలోదకాలు వదలుకొనెదమని వాగ్దానము చేసుకొన్నారట. ఇప్పటికి వారికి వివాహమై ముప్పదైదేండ్లు. వారి కడగొట్టు బిడ్డడుకు వయస్సు ఇరువదిమూడు సంవత్సరములు అతనికి మొన్ననే వివాహము చేసి వారి సంసార జీవిత కడపటి ధర్మము నిర్వహించిరి.

వారి పెద్ద ఎస్టేటును. రాజభవనమువంటి పెద్ద భవనమును వదలి వారు వారి మత ధర్మము ప్రకారము పోపు అనుమతితో రెండు క్రిస్టియను మఠాశ్రమములు చేరిరి.

ఈ సంఘటన ప్రకరణతో వానప్రస్థ సన్యాసాశ్రమములు ప్రవేసించ సందేహిస్తున్న వృద్ధులకు కొంత ధైర్యోత్సాహము కలుగ గలదని ఆశించవచ్చునేమో!

తే. ల. ర.

ఘోషయాత్ర

శ్రీమతి ఎస్. కె. రాజేశ్వర్ రాణి

అంకితం "ధర్మానికి !"

ఎవరూ రాయనిగాథ :
నా జన్మలో మరువని భాధ
అడుగంటింది పాకం
ఆఖర్నమని అంది శోకం

ధరించారు రంగంలో పాత్ర
ముగించారు జీవితయాత్ర
కళ్ళు తుడిచేందుకు 'రాశాడో పత్రం
వారిజీవితమే విచిత్రం

వేశాడు సమస్యల చిక్కు
లేడనుకున్నాడు తనకు దిక్కు
పడ్డాడు అమిత వేదన
చేశాడు శరీర నివేదన

చూడవలసింది చూసారు కంట
సహాయించి తిరిగాడు వంట.
మదిలోనె వుంచారు మర్మం
అనుకొన్నాడది తనఖర్మం

అందరినీ మరిచాడు వేగం
పరుగు పరుగెత్తాడు దూరం
పసిపాప నూడిరే పరుగు
వద్దామనుకున్నాడు తిరుగు

"కైలాస మిక్కడికీ ఒక్క అంగ
చూసివస్తాను ఆకాశ గంగ.
చంద్రలోక మిక్కడి కెంతదూరం
మనుజులు భూమి కెంత భారం?

సూర్యుడెన్ని డిగ్రీల వేడి
ఎత్తివస్తాను దేవతల మీదదాడి
ఎందుకు మాల్లోకంలో తీరనిదుఃఖం
పెట్టావెందుకు ప్రియా ప్రియులకు
భగ్నం

తీరని కోరికల వేదన
దావాగ్నులలో కాల పోతున్న వారి ప్రార్థన
జీవితమంటే కొందరికి కారం
చావంటే మరికొందరి ఫలహారం

సంతాన, దరిద్ర భారంతో మగ్గి
ఆత్మగౌరవం చంపుక తలవొగ్గి
పాడు బ్రతుకులలో దూరి
పట్టపగలే పడుపు వృత్తిలో జారి

అబద్ధాలు, అన్యాయాలు అన్నంగా
హత్య చేసిన నెత్తురే నున్నంగా
కొట్టి అమాయకుల తిట్టి
వారి నోట కొడుతున్నది మట్టి

అట్టివారికి హాయికొలిపే మేడ
అభాగ్యులది మునిగిపోయే ఓడ
ప్రపంచం మునిగి పోతోంది అధర్మంలో
నడిపింపరాదా నాటకాన్ని ధర్మంలో

ఇన్ని ప్రశ్నలు చిత్రంగా వేసి
మాకారకు కొంత చెత్త గీసి
పోయావ చేరావ అక్కడ
కార్చారు కన్నీరు ఇక్కడ

అనుకోని కల
విప్పలేని వల
ఆనాడు జరిగింది కోలాహాలం
ఈనాడు చిలికింది హాలాహాలం

వెళ్ళావా దిలాసాగ ఘోషయాత్ర
మళ్ళవా ఇహ ఎప్పుడూ భూలోకయాత్ర
ఆలోకమంతా తిరిగివస్తావా?
వింతలన్నీ నాకు తీరి చెపుతావా?

★

అలవాటు లేని ఔపోసన

శ్రీ వీరుబొట్ల శ్రీరామశర్మ

అక్కడే వుంది అసలుసంగతి. అసలునాకు కోపం రానే రాదు; వస్తే నేను మనిషినికాను. అంటే ఏ పశువునో అనిమాత్రంకాదు. అలా కోపమొచ్చినప్పుడు — నాలో మనిషి వుండవలసిన దయాదాక్షిణ్యాలు ఏ కోశానా కనుపించవు.

ఎన్నాళ్ళు ఎన్నాళ్ళని ఊరుకున్నాను. ఊరుకున్నంత మాత్రాన నన్నుత్త వెధవాయిక్రింద జమకట్టిపారేయటమే! రోజూ ఉదయం పదిగంటల దగ్గరనుంచీ సాయంత్రం ఆఫీసులోఉన్న ఆ బి. సి నాటి జపాను గడియారం ఐదు గంటలు కొట్టేవరకూ—అంటే రోజుకి ఏడుగంటల చొప్పున—ముప్ఫై రోజులూ—అంటే రెండువందల పది గంటలు కష్టపడి కష్టపడి నేనుసంపాదించిన జీతం యీవిడగారి స్నోసెంటులకూ, ఫేసుపౌడర్లకూ, హెయిర్ ఆయిల్సుకూ, సిల్కుచీరలకూ కట్టబెట్టమని నామొఖాన యినపగంటం పుచ్చుకొని ఏవేళ రాసేడోకాని ఆ బ్రహ్మ దేవుడు—అక్షరాలా అంతా జరిగి తీరుతోంది.

అందుకే సరోజమీద నాకుకోపం వచ్చింది. లేకపోతే యింత కష్టపడుతున్ననాకు 'ఫస్టు ఫిల్టరు కాఫీ త్రాగే' యోగంలేదూ! ఈవిడకేదో కాస్త ఒళ్ళు వెచ్చగావుండేటప్పటికల్లా (మాఅత్తారి ఆవకాయ పుణ్యమా అంటూ) ఆడాక్టరు 'మీలోసరియైన ఉత్సాహంరావాలంటే రోజూ ఉదయమె మీరు 'ఫస్టుఫిల్టరు కాఫీ'త్రాగాలని' చెప్పి యేడిశాడట. పోని ఏదో తెలియక చేశాడనుకుందాం! ఇంతకీ నాకామాత్రం విలువలేదూ నాయింట్లో? "డాక్టరిట్లా అన్నాడండి" అని కులుకుతూ చెప్తుందా—సిగ్గులేకుండా—అందులో నాతో!

అక్కడికీ తొందరపడటం మంచిది కాదని పెద్దవాళ్ళు ఎప్పుడో అన్నారన్న విషయం జ్ఞాపకంవచ్చి, నిర్ణయానికి వచ్చేముందు అమాంతంగా సరోజని పిలిచి "ఇంతకీ 'ఫస్టు ఫిల్టరు' కాఫీరాత లేదన్నమాటేగా నామొహానికి" అన్నాను కోపంగా కళ్ళెర్రచేసి (నోట్లో వున్నకిళ్ళీమీద బలాన్నంతా ప్రయోగిస్తూ)

"ఎందుకండీ అంత కోప్పడతారు. డాక్టరన్నాడని ఊరికే అన్నానుగాని" అన్నది సరోజ.

"అన్నాడట అన్నాడు—నేనిలా ఊరుకుంటున్నాననేగా యీ మాటలంటున్నావ్. నాలుగురోజులు నేనూళ్ళో లేకపోతే తెలిసివస్తుంది అమ్మగారితంతు" అని పళ్ళు పట పట కొరుకుతూ—సరోజ పిలుస్తున్నా వినిపించుకోకుండా రైల్వేస్టేషనుకు [illegible]తీశాను.

• • •

బందరులో బి.యస్. సి. వెలగబెడ్తున్న మామేనల్లుడు సుధాకర్ జ్ఞాపకంవచ్చాడునాకు. ఇప్పుడువాడికి పరీక్ష రోజులుకాబోలు. ఎలా చదువుతున్నాడో యేమో వెధవ! వాడిని చూచినట్టూ అవుతుంది అని 'బుకింగ్ ఆఫీసుకు' వెళ్ళి బందరుకు ఒక 'టిక్కెట్టు' కొనేశాను.

బందరు చేరేటప్పటికి పది గంటలయింది. మావాడు కాలేజీకి వెళ్ళివుంటాడేమో సరే! అంతగా అయితే ఇంకా ఎక్కడికైనా పోవచ్చు పెట్టె, బెడ్డింగు యిత్యాదయః ఏమీలేవుగా. 'కేకినీ మహలు' దగ్గరికి రెండణాలకు రిక్షా కట్టించుకుని వెళ్ళాను.

మావాడి రూము తీసేవున్నది. లోపలకు వెళ్ళిచూద్దును కదా-వాడింకా ముసుగుతన్ని నిద్రపోతూన్నాడు.

"ఒరేయ్! సుధాయ్!" అని నిద్ర లేపేసరికి కళ్ళు నులుముకుంటూ "నువ్వా! ఎప్పుడొచ్చావ్ మామయ్యా" అంటూ లేచాడు.

"ఇప్పుడే వచ్చాను కానీ నువ్వుకాలేజీకి వెళ్ళలేదేంరా?"

"ఏంలేదులే. నువ్వలా కుర్చీలో కూర్చో మామయ్యా"

"ఏంకథ? కొంపతీసీ తలనొప్పి, జ్వరం వగైరా వగైరా లేమీ లేవు కదా"

"అటువంటి వేమీలేవు దేవుడి దయవల్ల"

"అయితే కాలేజీ మానెయ్యటానికి గల కారణం?"

"రాత్రి ఒక చిన్న సంఘటన జరిగిందిలే చెప్తాను" అంటూ బయటకు చూసి ఎవరూలేరనే నిర్ధారణకు వచ్చి చెప్పటం ప్రారంభించాడు సుధాకర్ :-

"మాకిప్పుడు సెలక్షన్ ఎగ్జామినేషన్స్ అని తెలిసే వుంటుందినీకు ఈసారి బాగా స్ట్రిక్టుగా వుండాలను

కుంటున్నారు మా ప్రిన్సిపాల్ గారు. వారానికో "స్లీప్ లెస్ట్" చొప్పున దంచుతున్నారు లెక్చర్లు. అందుకని మా హిందూ కాలేజీ వాళ్ళంతా రాత్రింబగళ్ళు నూరిపారేస్తున్నారు. నాకు యింతవరకూ ఓమాదిరి మంచి మార్కులే వస్తున్నాయి కనుక నేనంత నిద్రాహారాలు మాని చదవవలసిరాలేదు. కాని మావాళ్ళందర్నీ చూసేసరికి నాకూ ఒక రాత్రల్లా కూర్చొని చదవాలనిపించింది. అందులో ఫస్టు పేపరు ఫిజిక్సు. ఈసారి ఫస్టు మార్కులు రావాలని రాత్రల్లా కూర్చుని చదువుదామనుకొన్నాను. కాని రాత్రిపదిగంటలయ్యేసరికల్లా—దానిదుంపతెగ నిద్రముంచుకొచ్చేసింది. ఏనాడూలేనిది నిన్న కాళ్ళీడ్చుకుంటూ స్వతంత్ర హోటలుదాకాపోయి కాసిని టీనీళ్ళు గొంతులోపోసుకుని వచ్చికూర్చున్నాను. కొంతవరకైనా ఉషారుగావున్నది. కాని దాని దుంపతెగ చలికాలం తలుపులన్నీవేసి చదవటం ప్రారంభించాను. చలి మూలాన చక్కగా వెచ్చగా ముసుగు తన్ని పడుకోవాలనిపిస్తోంది. 'ఈచలి పోవటానికి ఏమిటీ ఉపాయం?' అని తలబ్రద్దలుకొట్టుకున్నాను. దరిపోయే మార్గం చెప్పలేని ఫిజిక్సు పుస్తకాలమీద నాకు 'బోలెడు' కోపంవచ్చేసింది. ఇంతలో హఠాత్తుగా జ్ఞాపకంవచ్చింది. మొన్న మా మూర్తి "యీ చలికాలంలో సిగరెట్టుముట్టించి కూర్చుంటే బలేఉషారుగా వుటుందోయ్ చలివెయ్యదు ఛస్తేనిద్రరాదు" అన్నాడు. కాని అప్పటికే ఒంటిగంట అయింది. అలా బయలుదేరి కొట్లో గుజ్జుపెట్టి నిద్రపోతూన్న అంజయ్యని లేపి ఒక 'సిజర్సుప్యాకెట్' యివ్వమన్నాను. వాడు తనలోతాను సణుగుకుంటూ పైకి వినిపించకుండా తిట్టుకుంటూ 'ప్యాకెట్' అందిచ్చాడు. రూముకువచ్చి ముట్టిద్దామనుకుంటే 'అగ్గిపెట్టె' లేదు. అలవాటులేని ఔపోసనకాదూ! సిగరెట్టు ముట్టించటానికి 'అగ్గిపెట్టె' అనేది ఒకటి కావాలనికూడా నాకప్పుడు జ్ఞాపకంలేదు. మళ్ళీ అంజయ్య కొట్టుకు వెళ్ళానా యీసారి తిట్లతోబాటు తన్నులుకూడా తగలగలవు. అందుకుతోడు జేబుతడుముకుంటే ఎఱ్ఱని ఏగానీకూడాలేదు. ఇంతలో ఒక 'ఐడియా' తట్టింది టైముచూస్తే ఒంటిగంట అయింది 'సెకండ్ షో సినిమా' వదిలివుంటారు బహుశా, ఆరోడ్డుమీద నుంచుని, మనవాడెవడైనా దర్శనమిస్తే అగ్గి పెట్టె అడిగి తీసుకోవచ్చునుగదా అనుకున్నాను.

అమావాస్య. బందరు మునిసిపాలిటీ ధర్మమా అంటూ మాచిలకలపూడి రోడ్డు మీది లాంతరు స్తంభాలు నిద్రపోతున్నాయి అంతాచీకటి.... దానికి తగ్గట్టు యీమురుగాలి...కాని అటువంటి సమయంలోనే రామానాయుడు పేటసెంటరు దగ్గరకు బయలుదేరాను...క్రొత్తగా ఆరాధించబోయే అగ్నిహోత్రుడిమీది ఆప్యాయత కొద్దీ.

స్టూడెంట్ లైఫ్ లో నాలుగేళ్ళు ఆరితేరిన వాడిని నేనూహించానంటే అది తప్పవటమా! దూరాలో మేనరికం రెండవ ఆట అయిపోయింది ఎవరెవరో వస్తున్నారు. అదృష్టవంతుడ్ని చెడగొట్టె వాళ్ళెవరని ధూమకేతువు పూరిస్తే అన్నాడా! ఎవడో ఒకమనిషి 'సిగరెట్టు' కాల్చుకుంటూ అటేవస్తున్నాడు, దగ్గరదాకా వచ్చిన తర్వాత 'ఒక్కసారి అగ్గిపెట్టెయిస్తారా సార్' అన్నాను. ఆమనిషి కాసేపాగి చొక్కాజేబులోనుంచి అగ్గిపెట్టె తీసియిచ్చాడు. అగ్గిపుల్ల వెలిగించాను...అంతే! నోట్లోవున్న సిగరెట్టు క్రిందపడి పోయింది కాళ్ళల్లో వణుకుపుట్టింది. అగ్గిపెట్టె అయినా మొహానవేసి పరుగెత్తుకుని రూముకువచ్చి ముసుగుతన్ని నిద్రపోయాను "నాకు అగ్గిపెట్టె అందిచ్చినది ఎవరోకాదు—మా ఫిజిక్సు లెక్చరర్. విద్యార్థి దశలో ఎవరూ సిగరెట్లు కాల్చకూడదని పదిసార్లయినా ఉపన్యసించాడాయన. రేపే క్లాసుకువెళ్ళానంటే "Dont you know manners please" అని తగులుకుంటే సమాధానం ఏమని చెప్పటం? ఒక్క రెండురోజులాగుతే వేడికొంత తగ్గవచ్చు" అంటూ కథముగించాడు సుధాకర్.

"ఏడిచావ్ లే! యిటువంటి వెధవ్వేషాలు ఎప్పుడూ వెయ్యకు. మర్యాద నేర్చుకో. ఇప్పుడు కాకపోతే మరొకప్పుడైనా చిక్కుల్లో పడగలవ్" అని వాణ్ణి నాలుగు చివాట్లు పెట్టాను. వాడేమీ మాట్లాడలేదు టైముచూశాను. పన్నెండయింది. కడుపులో నక నకలాడుతోంది.

"ఒరేయ్ సుధాయ్! నేనో చిన్న పనిమీద వచ్చాను. అదిపూర్తి చేసుకుని వస్తాను" అంటూ బజారులోకి బయలుదేరాను.

కళ్ళు తిరిగి పడి పోతానేమోననిపిస్తోంది. నిన్న సాయంత్రం సరోజ చేతిభోజనం. ప్రొద్దున్నే కాఫీ అన్నా త్రాగలేదు అలా మోడరన్ కేఫ్ లోకి దారి తీశాను. అర్ధరూపాయి చెల్లించి, ఒకభోజనం టికెట్టు తీసుకుని లోపలకువెళ్ళి విస్తరిముందు కూర్చున్నాను. కాకరకాయ కూరతెచ్చి వేశాడు, కాలకూట విషమైన తినగలను గాని

కాకరకాయ కూరను మాత్రం భరించలేను నేను. ఇంకా ఏమైనా ఉన్నాయా అంటే ఇంతసాంబారు తెచ్చిపోశాడు. ఎలాగో నాలుగు మెతుకులు కొరికాను. ఈ అర్ధాకలి భోజనం చేస్తూంటే కళ్ళవెంట నీళ్ళుతిరిగాయి. ఎలాగో బయటపడి ప్రక్కనవున్న కిళ్ళీకొట్టులో ఒక కిళ్ళీ కట్టించుకుని బజారులోకి బయలుదేరాను.

నాలుగడుగులు వెళానోలేదో దవడ మండిపోవటం ప్రారంభించింది. నాకర్మకాలి సున్నం మహాజాస్తిగా వేశాడు. సరోజ జ్ఞాపకం వచ్చింది ఇంతవరకూ సరోజను విడిచివుండలేదునేను గబగబానడిచి పట్టాభి మార్కెట్టులో ఒకగుంటూరు చీరెకొని స్టేషనుకు వెళ్ళి రైలెక్కేశాను సరోజలో మునిమాణిక్యంగారికాంతాన్ని ఊహించుకుంటూ.



కోకిలమ్మ

శ్రీ కే. తిరుపతయ్య

తే. గీ. చూతవృక్షమ్ము పైనుండి సుందరముగఁ
గూతలను నెట్టుచుండిన కోకిలమ్మ
చెలియ నెచటైనగన్నచో చెప్పవమ్మ
మదిని నీమేలు నెన్నడు మరువనమ్మ.

తే. గీ. ప్రియను గానక నిప్పుడు వేదనమున
కుములుచున్నది నామది కోకిలమ్మ
సఖియ నాచెంత నున్నట్టి సమయమందు
నాలపించిన గీతమ్ము నాలపించు.

తే. గీ. నాకునీవలె రెక్కలీ లోకమందు
గలిగి యుండిన నెగురుచు కలికిచెంత
వాలి యుందును గానియా భాగ్యరేఖ
ఫాలభాగమ్ము నందున వ్రాయలేదు.

తే. గీ. పగలు రేతిరి యనక నీ పాటవినుచు
బొగలు చుండిన మదిలోని దిగులునెల్ల
బాపికొందును కోకిలా! పాడవమ్మ
చూతపల్లవముల గోసి పోతునీకు

తే. గీ. ఎగిరిపోకమ్మ నాగాధనెరిగినావు
ఎగిరిపోయిన నామది దిగులు మిగులు
తరిగిపోవునుహృదయమ్ము దయను
గొనుము
ప్రేమికుల నూరడించెడి పికమునీవు.

తే. గీ. మరణమునుదెంచు నందాక మనసులోని
మమతలన్నియు కోకిలా! మాసిపోవు
ధరణినాకింక నీపాటె శరణమమ్మ
ఆలపించుము ప్రణయ గీతాలనిపుడు.

సం — 2

చెల్లికి లేఖలు

చెల్లీ !

స్కూల్లో చేరుతున్నానని వ్రాశావ్. ఇంతకాలంనుంచి యేదో ఇంట్లో ప్రైవేటు మాష్టర్ని పెట్టుకుని చదివి ఇప్పుడు స్కూల్లో చేరుతున్నావ్. వున్నవాళ్ళయింటి అమ్మాయివి కావటం వలన అన్నివిషయాలు తెలుసుకొనే అవకాశం ఇంతవరకు నీకులేదు. అందువలన నీకు ప్రతిచిన్న విషయమూ క్రొత్తగాయుండి త్వరగ బాధ కలిగిస్తాయి. బాధ కలిగించే విషయాలలో ముఖ్యమైనది ఈర్ష్య. ఈర్ష్య ప్రతి ఒక్కరిలోనూ వుంటుంది. ఈర్ష్య రకరకాలుగా వుంటుంది. ఈర్ష్యంటె పెద్దవాళ్ళలో వుంటుంది కాని చదువుకునే వారిలోకూడానా అక్కా ! అని అంటావా ? చూడమ్మా ! నీసహ పాఠకుల త్రిమూర్తుల్లా ముగ్గురో మంచం కాళ్ళలా (అరె ఎన్నో మర్చిపోయానే !) నల్గురో పంచపాండవుల్లా ఐదుగురో లేక సప్తర్షిమండలంలా ఏడుగురో, షష్ఠిపూర్తయి అరవైమందో వుండొచ్చు. ఎంతమందున్నా సామాన్యంగా ఏ ఇద్దరి మనస్తత్వాలు ఒకటిగా వుండవు. అక్కకు చదువు ఇష్టంలేక చదవనంటే నీవేమో వివాహం చేస్తానన్న నాన్నతో నేను వివాహం చేసుకోనని చదువుకుంటానని చదువుతున్నావు. ఒక తల్లి గర్భాన జన్మించిన మీ ఇరువురికే ఇంతతేడా వుంటే అనేక కుటుంబాలనుంచి వచ్చే విద్యార్థినులందరి మనస్తత్వాలు ఒకటిగా ఎలా వుంటాయమ్మా ? పెద్దక్క అన్నట్లు విద్యార్థిను లందరూ తలా ఒక కుటుంబానికి ప్రతినిధులు. మీ అభిప్రాయాలన్నీ వేరుగావున్నా సరే అందరికీ వున్న ఒకే ఒక ఏకాభిప్రాయం— పరీక్షలలో కృతార్థులం కావాలని. అన్నిటికన్నా మీఅభిప్రాయాలలో ముఖ్యమైనదీ అదే. ఆవిషయం మీఅందరికీ కూడాతెలుసు. కాని అప్పుడప్పుడు మర్చిపోతుంటారు.

తరగతిలోని ఒక విద్యార్థిని బాగా అలంకరించుకొన్నదే అనుకుందా, అందువలన మిగిలిన వారికి కలిగే నష్టంలేదు. అయినా అలంకరణ సభ్యతగా నున్నంత వరకు ఎవరిష్టం వారిదే. సభ్యతగా లేనప్పుడు ఎదుట చెప్పేయ్యాలి కాని ఆవిధంగా చేయరు. ఇష్టం వచ్చినట్లు పేర్లు పెట్టేస్తారు. కాని ఎదుట బాగా మాట్లాడుతారు. ఈర్ష్యతోకృతజ్ఞతఅనేదేమర్చిపోతారు. తనకురానిపాఠాన్ని విడమరచి చెప్పటానికి ఎంతోవిలువైన కాలాన్ని వృథా చేసుకున్నమ్మాయినైనా సరే చిన్న మాటపట్టింపు వచ్చిందంటే ఎన్నో అంటారు. పోట్లాడుకుని మాట్లాడుకోని వారికన్నా వారిద్దరతోనూ మాట్లాడేవారికి ఈపోట్లాటల వలన నష్టం ఎక్కువ. ఎందుకంటావా ? ఇద్దరూ ఎవరి గొడవ వారుచెప్పుతున్నా బావుండిపోని. అలాగాదు. ఒకరిని గురించొకరు మాట్లాడుతారు. ఉ అంటే ఉపరాధం అ అంటే అపరాధమూను.

ప్రతి విద్యార్థినికి తరగతిలో మొదటి ఆమెగా రావాలనుండటం మంచిదే. ఆ పట్టుదల లేకపోతే చదువులో పటుత్వం కూడా పోతుంది. ఆపట్టుదల నాకు మార్కులు తక్కువ వచ్చాయే అనే తాపం అయినా బాగాచదివి ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలన్నంత వరకేగాని ఎక్కువ మార్కులు తెచ్చుకున్న తోటి విద్యార్థినిని చూసి అసహ్యించు కొనేంత వరకూ వుండకూడదు. అలా ఎవరుంటారక్కా ? అంటావా ? కొంతమంది వుంటారమ్మా చెల్లాయ్ అదే విచిత్రమైన ఈర్ష్య. "చిత్ర విచిత్రమైన మనస్తత్వాలుగల వింత వింత వ్యక్తులతో సచిత్ర విచిత్ర పత్రిక లాంటిదేనమ్మా మన పాఠశాల కూడా. మనమెంత అందరితో కలిసివుండాలన్నా వుండలేం. ప్రతి చిన్న మాటను అపార్థం చేసుకునేవారు ఎక్కువ వుంటారు, మరీ ఒక్కొక్కరు ఇంకా తమాషగా వుంటారు. తను మాట్లాడనివారితో ఇంకొకర్నెవర్నీ మాట్లాడ నివ్వరు. ఒక్కొక్కప్పుడు ఈ గొడవలను భరించలేక స్కూల్లో నిలవలేక పోతాం. నిజం మాట్లాడితేనే నిష్ఠూరం అని ఋజువు చేస్తారు. అయినా సరే చెల్లీ ఒక్కవిషయం— నువ్వునిజాన్ని చెప్పి అందువల్ల వచ్చే ఫలితాన్ని భరించలేకపోతే మౌనం వహించు. అంతేకాని ఆనిజాన్ని కప్పిపుచ్చుటకై అబద్ధాలు చెప్పి నీకు నీవే ఆత్మ ద్రోహం చేసుకోకు. నీ అబద్ధం వలన ఇతరులను మోసగించడం కాదు. నిన్ను నీవే మోసగించుకోవడం అవుతుంది.

మన జీవితబాటల్లో ఎన్నో అగాధాలుంటాయమ్మా. ఆ అగాధాల వెడల్పుచూసి లోతుతలచి భయపడక స్వయం పోషక శక్తి అనే ఆధారాన్ని సహాయం చేసుకుని జీవిత బాటలోని అగాధాల్ని దాటి గమ్యాన్ని చేర

ప్రయత్నిస్తాను. ఈ సమస్యలోనే నిగ్రహిస్తే జీవిత ప్రయాణంలో ఎలా సాగుతావమ్మా! ఈ నాడు ఉద్యోగం చేసే ప్రతివ్యక్తి పనికి జీతంతో సత్ఫలితాన్ని పొంద గలుగుతాం.

స్త్రీకి జీవితంలో ముఖ్యంగా కావల్సినది—స్వయం పోషక శక్తి. అదిలేని స్త్రీ జీవితం (ఎక్కడో ఒకటి తప్ప) మింటికి మంటికి మధ్య నిరాధారంగా వ్రేలాడి నట్లే వుంటాయి. నిలువ నీడలేని బ్రతుకులే. ఈరోజుల్లో అతి నవనాగరిక ప్రపంచంలో నవీనంగా అడుగుపెట్టిన అనేక మందికి భార్యలను వదలివేయటం పరిపాటయింది. మరీ సినిమా ప్రపంచంలోనే నమ్మా అంటుందత్త. కాని అన్ని చోట్ల అంతే. వున్న అవకాశాల్ని వుపయోగించకో లేక జారవిడుచుకొని లేనివాటికోసం ప్రయత్నించి విఫ లులై అర్థంలేని అసంతృప్తులతో జీవితాన్ని నాశనం చేసు కుంటారు. నాథుండీ అనాథలైనఅనేకమందినిచూస్తున్నా. కారణాలు వింతగా వుంటాయి. నృత్యం వచ్చిన భర్త యితే భార్యకు హృదయం లేదంటాడు. అదే రచయిత యితే భార్యకు హృదయం లేదంటాడు. ఓక భర్త భార్యకు చదువు రాదంటాడు. ఈమహానుభావులందరికీ ఇద్దరు ముగ్గురు బిడ్డల తండ్రులయ్యే వరకూ ఈ విషయం తట్టక అప్పుడకస్మాత్తుగా తట్టి ఆమెను నడివీధిపాలు చేస్తారు. ముగ్గురు బిడ్డల తల్లయిన వెనుక ఆమె వీరు చెప్పినట్లు నృత్యం, సంగీతం, చిత్రకళ, రచన ఎలా నేర్చుకో గలుగుతుంది? ఒకవేళ ఓపిగ్గా నేర్చుకున్నా ఆ మహానుభావుడి ఊహసుందరిని ఈమె అందుకో లేదు కనుక ఈమె ప్రయత్నం అంతా బూడిదలో పోసిన పన్నీరే. అప్పుడు కొత్త ఎత్తు ప్రారంభిస్తారు. అనుమాన పిశాచంతో అవమానిస్తారు. ఈ స్త్రీలు చదువుకున్న వారయితే వారిబ్రతుకు నడివీధి పాలవదు. నీవు తల్లితండ్రి వుండరా అని అనవచ్చు. వున్నా వారు వృద్ధులవటం వలన కొంచెమున్నా ఆనాడ పదిమందియు అత్తమామల్ని పోషించటం తప్పదని వ్రాయుచున్నా అలాగేనా పోషి స్తుంటే కొడుకులు, ఇక! ఏమిటటా? కోడళ్ళను తిట్టేస్తు న్నారేమి? అంతకొందరెందుకు? అంతావిను. ఏదమ్మా ఏదో వాళ్ళు తెచ్చుకునేది వాళ్ళకు సరిపోతుంది. ఇంకొక వ్యక్తిని పోషించటం కష్టంకదూ! వచ్చిన జీతంకాస్తా ఏనెలకానెల పూర్తి చేస్తే రేపు తనబిడ్డల భవిష్యత్తేమిటి? అందుచేత ఆమె అంగీకరించదు. అందుకే ఈమె జీవితం నడివీధిపాలు.

ఆమె చదువుకున్నదై వుంటే ఆమెకంత బాధ వుండేది కాదుగా? స్త్రీ వుద్యోగం చేయలేదని అబలలని (దేశంలో చదువుకున్నంతవారంతా రాకపోయినా కొంత మందయినా ఉద్యోగాలు చేస్తున్నారు ఈరోజుల్లోకూడ) అనే పెద్దలు ఇంకా వున్నారు. ఈ పెద్దల మాటల్ని బు జువు చేస్తున్నామా అన్నట్లు కొందరు మహాశయులు "నేను స్త్రీని ఎక్కువ పనిచేయలేను. పనితక్కువ కావాలి" అనటం స్త్రీ లోకానికే కళంకం. మనదేశంలో స్త్రీలు ఎక్కువగా పనిచేస్తున్న పనులు కున్నిమైనవే. ఏదే శాలలో స్త్రీలు డ్రాక్టర్లు సహితం నడుపుతున్నారు. స్త్రీకి ముఖ్యంగా కావల్సింది స్వయంపోషకశక్తి. స్వయం పోషక శక్తికి చిత్రకళ, సంగీతం, నృత్యం ఇలాచాలా వున్నాయ్. కానివీటిలో ఏకళ వచ్చివున్నప్పటికీ చదువు కూడావచ్చివుండాలి. చదువులేకపోతే మనంమన గృహ ప్రాంగణం నుండి బయటకురాలేం. అందుకేమనకు చిన్న తనంలోనే "విద్యలేనివారు వింతపశువులనే" నీతిసూక్తిని నేర్పుతారు. కనుక మిగిలినచిన్నచిన్న గొడవలను వదలి శ్రద్ధగా చదివి పరీక్షలలో కృతార్థురాలివి కావాలని మన స్ఫూర్తిగా ఆశిస్తూ ఈ లేఖ ముగిస్తున్నా.

ప్రేమతో అక్క—

రవణ



తీరని బాధ ★ "శ్రీ గిరిధర్"

"కన్నయ్య ఎందుకు తీస్తాడండీ? వాడలాటి వాడు గాదు" అన్నాది శారద కాఫీ కప్పు భర్తకందిస్తూ.

"నీకు తెలీదు శారదా!"

"వాడుదొంగ కాడండీ! వాడే తీసేమాటయితే, ఇన్నాళ్ళూవాణ్ని ఎవరాటంకం పెట్టారు? మూడేళ్ళనుంచీ మనింట్లోనే పనిచేస్తున్నాడుకదా! నేనొకనాడు బాత్ రూంలో ఉంగరంమర్చిపోతే తెచ్చియిచ్చాడు. నేడబ్బులు, అక్కడా, యిక్కడా పారేస్తే, తెచ్చియిచ్చేవాడు ..."

"అలాగే వుంటారు శారదా! ఇదంతా నమ్మించడం కోసం; వాడుతప్ప మరెవ్వరూ తియ్యరు" అని గట్టిగా చెప్పేశాడు భర్త ప్రసాద్.

"వాడి కిప్పు డెందుకండీ, యాభై రూపాయలు?" అన్నాది తిరిగి శారద.

"ఎందుకేమిటి?— నిన్న వుదయం వచ్చి నన్ను పది రూపాయలుంటే యివ్వమన్నాడు. లేవన్నాను— పదిరూపాయల కోసం. పర్సు తీశాడు. యాభై వున్నాయి .... అంతే, పర్సేదాచేశాడు...."

"రామ.... రామ.... ఎందుకండీ, పాపం మాటలు ఆడిపోసుకోవడం? ఈ అనుభవిస్తున్నది చాలదూ? కాపరానికొచ్చి ఆరేళ్ళయినా.... పిల్లాజల్లాలేక .." అంటూ పమిటచెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంది శారద.

"ఇంతకీ కన్నయ్యఏడీ?" అని అడిగాడు ప్రసాద్. "ఏం?" అందిశారద. "ఏం, ఏమిటి? వాణ్నిలారమ్మను." అన్నాడు కొంచెం కటువుగా.

"కన్నయ్యా....!" అంటూ కేకేసిందిశారద. "వస్తున్నానమ్మా!" అంటూవచ్చాడు కన్నయ్య. కన్నయ్య మరీ పెద్దవాడు గాదు. ముప్పయ్యేళ్ళవాడు, మంచివాడు,

"బాబుగారు పిల్చార్రా" అంది శారద.

"ఏంబాబూ?"

"కన్నయ్యా, నిన్నోటి అడుగుతా కాని నిజంచెప్తావు కదూ!" అన్నాడు ప్రసాద్ సిగరెట్ పొగని గాలిలోకి వదుల్తూ.

"చిత్తం!" అన్నాడు వినయంగా కన్నయ్య. రెండు చేతులూ కట్టుకొని.

"అయితె, నాపర్సు ఎవరు తీశార్రా?" ప్రసాద్ కన్నయ్యవైపు అదోరకంగా చూశాడు,

"పర్సా....!? తెల్దుబాబూ!"

"ఊఁ....హుఁ ... ఇంకా ఎందుకురా అబద్ధం? నిజం చెప్పెయ్! వూరుకుంటాను ..."

"ఛా! నా కుటుంబంలో ఆ ఎధవబుద్ది బాబూ; లేదు నా ప్రాణంపోయినా..."

"ఉపన్యాసం కట్టిపెట్టు! నువ్వుతప్ప మరెవరూ తియ్యరు, మర్యాదగా యిచ్చెయ్! లేకుంటే బొక్కలో పెట్టించేస్తాను!" అన్నాడు గుడ్లురుముతూ ప్రసాద్.

"బా....బూ! ఈమాట మీరన్నారు కాబట్టి శాంతించినా, ఇదేమరోరు అనివుంటే...."— "నోర్ముయ్....!" అంటూ చెంపమీద చాచిపెట్టి కొట్టాడు. కన్నయ్య మాట మధ్యలోనే తుంచేసి ప్రసాద్.

"హుఁ... ఎదవదెబ్బ! ఇదోలెక్కా బాబూ!" అన్నాడు కన్నయ్య.

"నిజంచెప్పు!"

"నిజం... ఆధి దేవుఁణ్ని అడగండిబాబూ! ఆయన సెప్తాడు....!"

"దేవుఁణ్నే అడుగుతాను; నాలుగు కర్ర దెబ్బలు పడితే నీ నోటంటే వస్తుంది నిజం. ప్రసాద్ కన్నయ్యని స్టేషన్‌కు ఒప్ప చెప్పాడు.

"కన్నయ్యఎముకలువిరిగాయి; చర్మంవూడిపోయింది; నెత్తురు చిమ్మింది!!! అయినా "తియ్యలేద"న్న మాట తప్పితే "తీశా" నన్న మాట కన్నయ్యనోటి వెంబడి రాలేదు, కన్నయ్యను కొట్లో పెట్టారు.

"మూర్ఖపువెధవ! నిజంచెప్పడే!" అన్నాడు భోజనం చేస్తూ ప్రసాద్.

"ఎవరూ?" అంది పరాకుగా శారద.

"వాడే, కన్నయ్య! తీశానని వొప్పుకోడు కదా! ఒప్పుకుంటే డబ్బులిచ్చెయ్యొచ్చు....!"

"పాపం! వాడు తియ్యనిదే ఎలా ఒప్పుకుంటాడూ?"

"ఏమిటీ? వాడు తియ్యలేదూ?" శారద మీద రెచ్చిపోయాడు ప్రసాద్.

"వాడే తీశాడని ఎలా చెప్పగలం? ఇంకెవరూ తియ్యకూడదా?" అన్నాది శారద.

"అంటే.... నా తమ్ముడు తీశాడంటావ్! అంతేనా?" ప్రసాద్‌కి అరికాలిమంట నెత్తికెక్కింది,

"నేనలా అన్నానా? గుమ్మడికాయలదొంగా. అంటే భుజాలు తడుముకోడం దేనికీ?" శా. ఎత్తి పొడుపుతో శారదమీద కారాలు మిరియాలు నూరాడు ప్రసాద్.

ప్రసాద్ తమ్ముడు వేణూ. పన్నెండేళ్ళ వాడు. చదువూ సంధ్యాలేదు. ఇంట్లో డబ్బు ఎత్తుకు పోవడం. సినిమాలూ అవీ చూడటం! ఇదీపని.

డబ్బుపోయిన రోజునే అంతక ముందువచ్చి: రెండు రోజులుండి వెళ్ళాడు. ప్రసాద్ వేణూని శారద దొంగగా కట్టిందని గ్రహించాడు.

శారద అన్నమాటలు అలా బాధిస్తూనే వున్నాయి ప్రసాద్‌ని. ఎలాగూ ఆదివారం సెలవుకాబట్టి శనివారం ఒక్కరోజు శెలవుపెట్టి, తల్లి దగ్గరకు వెళ్ళాడు.

భోజనం అదీ అయింది. బళ్ళోకి వెళ్ళిన వేణూ తిరిగి యింకారాలేదు. ఇంతలో ఎవరో బాకీలవాళ్ళు వచ్చారు.

"అబ్బాయీ! చిల్లరున్నాదిరా?" అని అడిగింది తల్లి ప్రసాద్‌ని.

"ఎంతదమ్మా?"

"పదిరూపాయలది! పాలవాళ్ళ కివ్వాలి."

"ఇలాతే. యిస్తాను," అన్నాడు ప్రసాద్.

తల్లి పెట్లోనుంచి పర్సు తీసుకొనివచ్చి. అందుట్లోనుంచి పదిరూపాయల కాగితం తీసియిచ్చింది. ప్రసాద్ కాయితం పుచ్చుకుంటూ తల్లి చేతిలో పర్సు చూశాడు.

"ఏదమ్మా పర్సూ." అంటూ పర్సు పుచ్చుకున్నాడు తల్లి దగ్గర్నుంచి పర్సు తనదే; ఇందులోనే యాభై రూపాయలూ పెట్టుకున్నాడు!! అది తీశాడనే కన్నయ్యని జైల్లో పెట్టించాడు!!!

"ఎక్కడిదమ్మా యీ పర్సూ?"

"మీ తమ్ముడు దగ్గరుంటే అడిగి పుచ్చుకున్నాను!" ప్రసాద్ యింకేం మాటాడలేకపోయాడు.

కన్నయ్యను విడిపించాలనుకున్నాడు. ఎలా విడిపిస్తాడు? తీరాకన్నయ్యని విడిపిద్దామని, అన్నీ చేసేవరకూ కన్నయ్యే, యీ లోకంతోటీ సంబంధం లేకుండా వెళ్ళిపోయాడు.

ప్రసాద్‌కి "చివరికి బ్రతికి వుండగా, కన్నయ్యను విడిపించలేక పోయానే!" అనే బాధ వుండిపోయింది! పాపం! అది తీరని బాధే....!

ఆటవికజాతుల సంస్కృతి - జానపద గాధలు - గీతాలు

శ్రీ కవికొండల వెంకటరావు

ఈ ప్రసంగం వినేవారి కందరకూ "ఇంకా అడవులు వున్నాయా? ఆటవిక జాతులు అనేవారున్నారా యీ భారతయూనియన్‌లో?" అని సందేహం తోచవచ్చును. నిజానికి నేనూ ఆ సందేహాన్ని తొలుదొల్త పొందినవాణ్ణే; ఎంచేత అంటే యిప్పుడెక్కడా అడవులే కనిపించవు. అడవులున్న అక్కడ పెద్దపులుల్ని, సింహాలులాంటి గండు మెకాలు గానరావు. ఒకవేళ అటువంటి మెకాలగపడ్డ చంపే బోయలు ఆచాయల కాపురం చేస్తూ తమయొక్క నిసర్గ పాటవాన్ని చూపించడంలేదు. ఎంత సేపూ ప్రభుత్వం బాటలేర్పరచి, బస్సులేర్పరచి, కొండపాడులన్నింటినీ కోనసీమగా మార్చడంలోను. ఆడవిక జాతులనబడే వాళ్ళకు అక్షరజ్ఞానము కలిపించి వారికికూడా పౌరరక్షణ అలవరచాలని సంకల్పించి, అందుకుతగ ప్రణాళికలు వస్తూతూ వుండడంలోనూ చాలాకాలం వినియోగిస్తూ వుంది. మనకు స్వాతంత్ర్యం వచ్చినక్కడా. రాజ్యాంగంలో వీళ్ళనందరినీ "ట్రైబ్సు"గా పంద్రెండవ జాబితాలో గుర్తించడం జరిగింది. ఆ పేర్లలో మనకు ముఖ్యంగా ఎరుకకువచ్చేవి "చెంచు, కోయ, కొండదొర, సవర, తోడ, గడబ, గాండ్, భిల్" ఇత్యాదులు.

వీరు నివసించేభూభాగాన్ని ఆంధ్రరాష్ట్రంలోమన్నెలని పిలుస్తారు. ఈ మన్నెం అన్నదాన్ని యింగ్లీషులో "ఏజెన్సీ" అంటారు. అందలి న్యాయశాస్త్ర పుటములు వేరుగా వుంటుంది. ఉద్యోగస్తుల అధికారం -పవర్- అమితంగా వుంటుంది. ఇదిల్లా వుండగా ఈ మన్నె ప్రదేశాన్ని కూడా నాగరీకంగా చేసేతలంపుతో, షెడ్యూలు ట్రైబ్స్‌వారి కొరకు శాసనసభలలో స్థానాలను ప్రత్యేకించి బాధ్యతవహించి. వారిలోనికికూడా దేశసేవా పరాయణులు కొందరు నూతనాభ్యాసాలను జొప్పించారు.

ఏవిధంగా క్రిందా మీదాపడ్డా చట్టం చట్టమే. అది దైనందినంగా మారవచ్చును గాని, ఆచారము, గాథ, దైవము ఈ మూడింటియొక్క స్వరూపాలు, శాశ్వతంగా ఒకానొక జాతియొక్క ఆస్తినిబట్టి అనుశ్రుతంగా వుండిపోతాయి. అవి ఒక పట్టాను మారేవికావు. అసలేమారని తత్వముత్పన్నమై యెల్లప్పుడూ ఆ తత్వమున్నప్పుడే ధర్మం సమిష్టిగా విరాజిల్లగలదు. మారితే ఆ సంఘమే నశించిందన్నమాట. ఇలా యొడతెగని ఒకానొక కట్టుబాటుకు, సంస్కృతికీ, కాణాచియై కలకాలంనుంచి వస్తూ వున్న మూర్తివంతమే ఆటవికజాతియొక్క నిజసాక్షాత్కారము. ఒకజాతి జీవప్రవాహంగా నాకు తోస్తుంది. మనం నాగరీకంగా చేసినకొద్దీ, అనాగరీకంగా వుండే అంతస్సింకా కనపడుతూనే వుంటుంది. దానికొక అప్రయత్నపు కార్యరంగంగాను, అనుకోని జీవన విధానంగానూ మన పరిశీలనలో తట్టుతుంది. దాన్ని బాగుచేయాలని చూస్తూ దానినుండి మనమే ఎదకు బాగుపడతాం. నామాట నమ్మండి.

"రంపి, టంపి, టంపి-టమ్!" అనిడోలువాయించి నప్పుడు,—

"ఓబాటో! బాటో! ఆవో!

దానాపావో! పానీ! పీవో!" అని ధన్యాలు కొడుతూ ఆడినప్పుడు మన హృదయాలు మేలుకొన్నట్లవుతాయి. గమనించండి.

"కొండవారు కోయవారు కోరియేరుకొనుచు, నా
పండిరాలు బియ్యములను వండుకొని భుజించె
దున్"

అని యొకప్పుడు "వేణువు" అనుకొన్నదట ....

ఈ కొండవారు యెవరు? కోయవారు యెవరు? అనే విషయాన్ని ఒకింత విమర్శిస్తే వారొకానొక వింత మనుష్యుల్లా మీకు కానవస్తారు. వేటకు, విడుములకు, మలగి అడవుల్లోనే కులాయాల్లో నిలయాలు నిర్మించుకుని, పొలాలను గూడెములనుండి అలవలతో కేటాయించుకుంటూ, మంచెలెక్కి కాపాడుకుంటూ, పశుసంపదను కాపురాలు చేస్తూ వుంటారు వీళ్ళు.

చాలాకాలమై నేను "రావిలంక" అనే ఒకానొక పల్లెటూరు చూచాను. అక్కడి వాళ్ళందరూ కొండదొరలే. ఊరంతా పోగుచేస్తే ఒకవీధి కొండపక్కనుంది. కొండనిండా పొడుగాటి తాడిచెట్లు, దండిగా పెరిగిన మొండిమోకలూను. ఆయూరునకు మా యూరునకు యెన్నో మైళ్ళు దూరంలేకపోయినా, యెంతో అంతరమున్నట్టుంది వాళ్ళభాష తెనుగేగాని అదో యేసతో మాట్లాడుతారు. ఒక్కొక్కప్పుడు "కూయీ" యూసాడుతారు. వాళ్ళ

స్త్రీపురుషాదులెవళ్ళు పలికినా, పక్షుల్లా మనకింపుగొలిపే గాని వ్రాతకందరు.

ఈ ఆటవికుల్లో ముఖ్యంగా తెనుంగుకు సంబంధించినవారు సవరలు, కోయలు, కోడులు, కొండవాళ్ళు, చెంచులు అనేటంటువంటివారు. వీరిలో చెంచుల ఆచారాలు తప్పతక్కినవాళ్ళవి యించుమించుగా ఒకరుగానేవుంటారు 'సవర' అన్నపదం 'శబర' నుండి వచ్చిందన్నారు. శ్రీరామచంద్రుని కాలంనాటి "శబరి" యీ సవరజాతి మనిషి అని ప్రతీతి. వీరిభాష యిప్పుడిప్పు డొకానొకలిపి రూపం దాలుస్తూవుందిట. మచ్చుకు వారిదోపాట కొంత వరకు ఉదహరిస్తాను. దయచేసి వినండి. నన్నుమాత్రం అర్ధం అడక్కండి.

"కస్లబో లోంగ్ కుడ్జబన్.
లంకదేశాలోంగ్ ద కోలన్
చెల్నె బొత్తె గడ్డవె ఒబోలోంగ్"

కోయలు, కోడులు, కొండవాళ్ళు వీరరసం యెక్కువగా ప్రదర్శిస్తూ రజస్వలానంతర ప్రణయ కలాపాన్ని స్వయంవరమార్గంగాగాని, రాక్షసమార్గంగాగాని, వివాహాలుగా మార్చుకుంటూ మిక్కిలి పెక్కుగా మెలగెదరు. అందులోనూ కోయవాళ్ళ వర్చస్సు రాజసం, రస్తాలమీట వాళ్ళమొగవాళ్ళు వేసేవేషము, ఆడేభాష చూపర నరికడతాయి. చెవుల కిత్తడి యుంగరాలు పెట్టుకు, తూరిశారం నుండి బాణాలు తొంగిచూచేలా దోపు సవరందుకు, బొట్టు గోచిపెట్టు అదోనీటుగా చూపిస్తూ, సాముర్ధ్యమూ చదువూ కలిగి యుంటారు. "కొండరాజులు కొండరాణులు" అంటూ వీరు కొలిచే దేవత లెక్కడో కొండమీద సరస్సుపొడ్డున, చీమలుదూరని- కాకులునేరని నట్టడివిను న్నారని, పేరొక్కంటారు. ఆ దేవత లీ నరమానవులకు కనిపించరని, యెరిదైనా మానవమాత్రుడాచోటకి వెళ్ళాడా తిర్యురాడని యిలావిడ్డూరపుగాథ వెల్లడిస్తారు. ఆ కారణంగా నైవేద్యాలు ఆ దేవతలకు కొండదిగువనే కావించి వచ్చేస్తారంట.

పండగవచ్చినా, పరిణయమయినా, పంట పండినా, పాపకలిగినా, వీరు వారి వారి దేవతలకు, మఱిన్ని పూసలమ్మ, గంగారమ్మ మున్నైన అమ్మవార్లకు ముందుగా పూజలు చేసేరు. నృత్యాల్లో కోయ నృత్యం చాలా అపురూపమైన నృత్యం. ఆ యయ్యలు ఇప్పకల్లు, ఐణేయ మాంసం తీసికుని బలే ఉత్సాహంగా డోళ్ళు వాయించుకుంటూ గొంగేదె కొమ్ముల్ని బూరాలుగా ఊదుకొంటూ, రంగు రంగుల పక్షి యీకలు, నెమలి పింఛాలు, తలల నాడించుకుంటూ, గుండ్రంగా గునిసిపోతూ 'గుము గుము' మంటూంటే అదో ఒయ్యారం ముత్యేల నలలు కొట్టినట్టుంటుంది. ఆ చిందు, చెంగు, తూగు, దుముకు, హేల, ఈల, ఎగురు, ఒరగు అన్నీ అన్నీ అంతరంగికపు హంగులని తెలుసుకోండి.

"అడెడెడెడెడే — సంగ డెడెడెడె" అని ఓ పాట. మరోపాట. "అడండీ - ఆడే - డెలాడెడే - డెల్లో :

నీనూ నానూ పారి — నీనూ నానూ ఓసి
నీనూ నానూ తూరా - నీనూ నానూ పాడి
నీలకో ఒల్లా - నీ ఒకొ ఒల్లా
నీయిప్పిమ్రాను - నీ మహామూను.
తేయుమడి ఒల్లా - కుచ్చామడి ఒల్లా ...

ఒకానొక నృత్యముయొక్క సత్యము శోభ అంతా ఆ కళాశిలి అడుగుతే సేలయలోను. నడుముగానే హొయలోనూ వుంటాయి. ఒక సేనా నాయకుడు తీర్చిదిద్దనక్కర లేకుండా నిపర్గంగా, నిటాగ్గా, బోర విరుచుకు నడుస్తారు కోయవారు. మళ్ళీ కావడిబద్దలా వల్లమాలిన వంపులు వైపులు వెలయిస్తారు.

కావిడిబద్దలంటే జ్ఞాపకం వచ్చింది : ఈ మధ్యనే పట్నవాసం నడుమ కావడిబద్దలు చెక్కుకుంటూవున్న చెంచుయువకుణ్ణొకణ్ణి చూచాను. వాణ్ణి పలుకరిస్తే, తాము ప్పుడే లతావుకు మూడు తరాలై వచ్చి వున్నామన్నాడు. మరి తన ముత్తాతల దేదేశమో, యే భాషోకూడా తెలియదన్నాడు. అయితే తన దేవుణ్ణి మరువలేదని, ఆదేవుడే తమ వంగడానికి కావడిబద్దలు వంచే వృత్తి కల్పించాడనీ పెద్ద కథగా, పద్మపురాణస్థ గరుడాచల నరసింహమూర్తి గురించి నివేదించాడు. పెద యహోబలముసుగురించి వక్కాణించాడు. ప్రక్కనే చెంచెత నడుస్తూవుంది. ఆ యువతి దాబుజంపైదికి చెంగు విసరుకొన్నా, దిగుభాగాన్ని గుండారుగా తమ సాంప్రదాయపు బొంతనే ధరించి, సంధ్యారాగానికి సమానమా అన్నట్టు చిరునవ్వు నవ్వింది. వెంటనే నాలో ....

"గుట్టులెక్కగలవా ? ఘన అప్పి కెక్కగలవా ?

దంటులంపిది జుంటితేనియలు తెచ్చియియ్యగలవా ?
పెరిగిన గుతిందగొమ్ములు పెర్చిసకిముతెయ్యగలవా?
పులులు కొట్టగలవా ? నరహరి ఫలములు తేగలవా ?
అన్నట్టయింది. ఆ నరసింహస్వామి ఏమన్నాడప్పుడు ?
"చెట్టు లెక్కదాన. పక్షుల చేరి కొట్టుదాన"
అని చేరబిలచి ఆ చెంచు లక్ష్మిని ...
"ఎవరి వడుచువె నీవు కొమ్మా !
నాతో విహరింపవే ముద్దు గుమ్మా !"
అని ప్రోత్సహించేడు. ఆమె [illegible]
"గుములు గుములు మా గుడెపు చెంచులు"
అని స్త్రీ చేస్తుంది.

గిరిజాచల నాలకిమున్నదాన్ని చదివితే సర్వేసర్వత్రా త్రిలింగమందు ఆటవికజాతులయొక్క ప్రవృత్తి ప్రపత్తి, తెలపడగలవు. వీరి తొల్లింటివంశీకులు ఓఢ్రంలో దేవుని ఊరేగింపులు "పోగింపు" చేసేకంట. జగన్నాథంలోను, జగన్నాథంలోను, సింహాచలంలోను, మటింకా దేవుడు మేలు చేస్తే చెప్పన్న నరసింహుల కోవెళ్ళల్లోను.... క్రమంగా రాను రాను ఆంగ్లేయకారీల సంపర్కము వల్లను, ఆటవీశాఖోద్యోగస్థుల ఒత్తిడి వల్లను ఈ ఆటవిక జాతులన్న వారు కూడా తను అసలు ఆయుధాలు అయిన బాణం బల్లెం మానెనేసి, తుపాకీలు తూటాలు ఉపయోగిస్తూ వచ్చారు. ఆ కారణంగా అడవిజంతువులను కేవలము తమ ఆహారముకొఱకే కాకుండా అమ్మకానికి కూడా గురిపెట్టి కొట్టి, వాటియొక్క చర్మాలతో గోళ్ళతో, తలలతో, కొమ్ములతో, లాభం తీయడానికి అలవాటు పడ్డారు. ఇది దుర్లక్షణము అని ఒకానొక తెల్లదొర మొరపెట్టేడు. తొలుదొల్త తుపాకీ ఈ ఆటవికులు ప్రభుత్వపు సెలవు లేనిదే వాడరాదన్నాడు. మరిన్ని అడవులను, అడవి జంతువులను స్వేచ్ఛగా పెరుగనిచ్చినప్పుడే విచ్చలవిడిగా వేటాడ్డానికి. వాలాయం కనుగొ దానికి వీలుంటుందన్నాడు. ఆ సలహా సరిమైనదనే నా యూహ. కాని తుపాకులు ముత్తులుగల దుడ్డుకర్రల్లా అగపిస్తాయిగాని ప్రవాలపుచేతుల్లో ధగధగ మెరసిపొయ్యే 'డేమోసైఫ్' వాడి నుండవు. అంతకన్న వేయిరెట్లు మేలూ మృగయూర్థం వాతీయమైన శంఖం, బల్లెం, విన్ను కత్తి, విల్లంబు.

అందుకే చెంచెత అడుగుతుంది నాగసింహుణ్ణి ఒకచోట......

"బాణమేయగలవా ? మృగముంబట్టి త్రుంచగలవా ?" అని.

ఇకను మనమొకటి నేర్చుకోవాలి. ముఖ్యాలిగానున్న మొదటి రకం ఆటవిక జాతులనుండి వినాది. ఎయిర. పక్క... [illegible] మానవుణ్ని వేరుపరచియగాలి. పిళ్ళు కావైతే కలుగుంటుకొని, జగటుందతెట్టుకొని, గోపుర్ని పన్ని. దేగర్ని వదలి. ఆరుబయటనే జీవించేరు గాని. వీరిలో విజాతీయతే తక్కువ. కోయలు. కొండదొరలు అన్నవాళ్లో తమ్ముకు నమ్మిన వాళ్ళను ప్రాణాలిస్తారు. ఇంకోసంగతికూడా ధ్రువపరచుకోవాలి. సుగాలి, లంబాడీ, బొందిలి, రోహిని వీళ్ళను అందచందములు కలవాళ్ళుగా మనం గమనింపగలినా సంతలమ్మట తిరిగే వ్యాపారస్థులని అనుకోవాలి. వీరు హెచ్చు మైసూరు, మధ్యప్రదేశ్, బస్తర్, బండినకండ్, రోహిల్కండ్ ఆ ప్రాంతాలవారుగా తోస్తారు.

ఇన్ని మినహాయింపులతో ఆలోచించి ఆనవాలుబట్టి నేడు మనము ఆతిథ్యమియ్యాలి అంటే నిజమైన ఆటవిక జాతి మనుష్యుడు యెంత అపురూపుడవుతాడో చూచారా? 'స్నోమాన్' అనగా మంచు మనిషి అంత. 'వీనటియన్' అనగా శుక్రగ్రహనివాసి అంత అంటే యేమి ? వాని 'పోగ్' అడుగుల జాడ చూడగలముగాని, అసలు మనిషి ఆకాశ పుష్పం' అన్నమాట.

(విజయవాడ రేడియో వారి సౌజన్యముతో)

ఆముఖము

శ్రీమతి యమ్. ఆదిలక్ష్మి

శ్రీ వాగ్దేవీత్రయ రూ
పా విర్భావములఁ ద్రిజగదాధారంబై
శ్రీ, విద్యా, శక్తి కినై
శ్రీ వాగ్దేవినిఁదలంతు చిత్తము లోనన్

అఖిల సృష్టికి నాధార మైనయట్టి
యమల తరమగు నాత్మవిద్యామృతమ్మె
జగమునకు భిక్ష పెట్టు నా జన్మభూమి
పరమ పావని భారతావనికి నతులు.

శ్రీకారములో కవితా
స్వీకారము చేసి మీకు వినిపించెద సు
శ్లోకంబు భారతస్త్రీ
లోకంబున నెల్లపుడు వెలుంగెడి నారిన్.

ఉదయగిరి రాజ్యలక్ష్మికిఁ బదయుగంబు
నాత్మకూరు బట్టేపాడు ననఁగ రెండు
పేరు కెక్కిన వం దాత్మకూరు వెనుక
నాతుకూరయ్యె నది వ్యవహారరీతి.

మల్లెమొల్లలలో గల మధు వదెల్ల
వెల్లి విరిసిన తెలుగు కవిత్వమునకు
తల్లియౌ మొల్ల కవయిత్రి ధన్యయౌచటఁ
బుట్టె నా యాత్మకూరు నాపుట్టుచోటు.

అందుచేతనె గాబోలు నాంధ్రమందు
కవన మల్లెడునట్టి యోగ్యతయు గల్గె
పెన్న, నెల్లూరు మేటి తిక్కన్న గన్న
పాకనాటింట బుట్టిన భాగ్యమబ్బె.

ప్రథితు లాశ్వోలవారిలోపలను మల్ల
వరము ములుమూడి వంశ్యులై వరలువారు
రుక్మిణీ ఆంజనేయ స్వరూపు లైన
తల్లిదండ్రులు నే గొల్చు దైవతములు.

ప్రేమ విలువ

వ్యంగ్యరచన : శ్రీమతి వంకదారు బసవ అన్నపూర్ణమ్మ

1 వ రంగము

[విశాలమైన గది. గోడల కొక ప్రక్కన సినిమా తారల చిత్రాలు, మరొక ప్రక్క దేశనాయకుల పటాలు వ్రేలాడుతూ వుంటాయి. నాలుగు కుర్చీలు, మధ్యలో ఒక టేబులు, దానిమీద పూల కుండీ వుంటుంది. చలం, రామం చెరొక కుర్చీలో కూర్చుని వుంటారు.]

రామం ; చలం ! నీమనస్సు రోజు రోజుకీ పాడు జేసుకొంటున్నావు. అర్థంకాని బాధేదో నిన్ను క్రుంగదీస్తుందని నీముఖ లక్షణాలు వెల్లడిస్తున్నాయి. ప్రాణమిత్రుడిని నాతోనైనా చెప్పకూడదా అబాధేమిటో ?

చలం : ఏం చెప్పమంటావు రామం : నేను సావిత్రిని ప్రేమించాను. నా ప్రేమ సామ్రాజ్యానికామెను రాణీగా నిర్మించుకున్నాను. కాని.... !

రా : కాని అని ఆపేశావేం ? ఆమె ఒప్పుకోలేదా ?

చ : అదే తేలలేదింకా. వారం రోజుల క్రితం ఆమెకి నా ప్రేమలేఖ నందజేశాను. దాని కింతవరకు ఏమీ జవాబు రాలేదు.

రా : అయితే బుట్టదాఖలా చేసిందేమో ?

చ : ఆమె అలా చేయదు. ఆమె దయానిధి, కరుణారాశి, నీలకేశిని, మత్తగజగమన, సుకుమారగాత్రి, సౌందర్యనిలయ, ప్రేమోపాశిని.

రా : ఆపు బాబూ ఆపు ! ప్రేమపిచ్చితోపాటు కవిత్వం కూడా పట్టుకుందన్నమాట. అందుకే మహానుభావుడు షేక్స్పియర్ అన్నాడు ప్రేమ, పిచ్చి కలిసేవుంటాయని !

చ : రామం ! ప్రేమను నువ్వంత చులకనగా మాట్లాడితే నేను సహించలేను. ప్రేమ మహిమను గురించి చెప్పాలంటే మన ఆంధ్ర భాషలోని పదాలేచాలవు. ప్రేమ లేనిదే ప్రపంచమే లేదు. ప్రేమకోసం ఎనిమిదవ ఎడ్వర్డు తన రాజ్యాన్నే వదలుకొన్నాడు. ప్రేమకోసం అనార్కలీ సజీవసమాధి చేయబడింది. ప్రేమకోసం జేబున్నీసా, సుల్తానారజియాలు తమ ప్రాణాలనే అర్పించారు. ఇంకా ప్రేమ చిహ్నంగా షాజహాన్ తాజమహల్‌నే నిర్మించాడు.

రా : సరేగాని, వాళ్ళంతా ప్రేమ జీవులు. నువ్వు సావిత్రిని ప్రేమించావు. సావిత్రి నిన్ను ప్రేమించిందా? లేదు. ఆమె నిన్ను తిరస్కరించింది. లేకపోతే వెంటనే నీ ప్రేమ లేఖకు జవాబిచ్చివుండేదిది. అనవసరమైన ఆవేశానికి లోనై జీవితాన్నెందుకు పాడు జేసుకొంటావు ? సావిత్రిని మరచిపో !

చ : అసాధ్యం ! సావిత్రిని మరచిపోలేను. ఆమె రూపం నా హృదయంలో హత్తుకుపోయింది. ఇప్పుడే ఆమె దగ్గరకు వెళ్ళి ఏసంగతీ తెల్సుకుంటాను.

(అని చలం గబగబా వెళ్ళిపోతాడు. రామం అతని వంకే చూస్తూ వుంటాడు) (తెర)

2 వ రంగము

[సుందరమైన భవనంలో ఒక హాలు. లోపల ఎడమ చేతి ప్రక్కన స్టేండునున్న కేన్వాస్‌మీద పూర్తిగాని చిత్రమొకటి వుంటుంది. కింద చిన్న స్టేండుమీద ఒక రంగు డబ్బా, రెండు కుంచెలుంటాయి. కుడిచేతి ప్రక్కన యీజీ ఛైరులో సావిత్రి కూర్చుని "ఐవాన్‌హూ" చదువుతూ వుంటుంది. చలం గబగబా లోపలకు వస్తాడు]

పనిమీద వచ్చావ్ ?

చ : (కూర్చుని) సావిత్రీ ! అన్నీ తెలిసివుండి కూడా ఎందుకు వచ్చావు అని అడిగితే నేనేం సమాధానం

చెప్పను? 'లవ్ యీజ్ బ్లయిండ్' అంతే! మీకు కొచ్చి ఇక్కడ పడేసింది.

సా : మీమాటలు నాకేమీ అర్థం కావటంలేదు.

చ : చదువుకొన్నదానవు నీ కర్తవ్యం తెలియకపోవటం ఆశ్చర్యంగా వుంది. పైగా నా ప్రేమ లేఖ చదువుకొని కూడా సుస్వీపితంగా అడగటం ఇంకా ఆశ్చర్యంగా వుంది. సావిత్రీ! నిన్ను నా ప్రేమ సామ్రాజ్యానికి రాణిగా చేశాను.

సా : అమ్మో! ఇండియా రాజ్యం. పాకిస్తాను రాజ్యాల్లాగా ప్రేమ సామ్రాజ్యం ఒకటి వుందటోయ్! అసలు యీ బి. ఏ. చదువుతూంటేనే పోజు పెట్టేస్తున్నారు. పైగా మీరేమో నన్ను రాజ్యానికి రాణిగా చేస్తామంటున్నారు. ఇక తలెత్తుకు తిరిగే పనేలేదు.

చ : నువ్వు నా ప్రేమ దేవతవు సావిత్రీ!

సా : ఇది ఇంకా బాగుంది. అసలు మానవ జన్మే ముఖ్య అని అంటూ వుండే మీరు దేవతల్ని కూడా సృష్టిస్తున్నారు. అహాహో! అపర విశ్వామిత్రులండీ!

చ : నారీమణీ! నీ కోమల హృదయంలో నుండే ఆ కఠోర మాటలు వెలువడుచున్నవా? నీ నీలికేశాల్ని చూసి భ్రమరాలు తత్తరపడుతున్నయ్! నీ చేతులు తామర తూండ్లవలె మృదువుగా ఎలావున్నవో చూడు! నీ నల్లని కాటుక కళ్ళలోనుంచి వెలువడే మన్మథ బాణాలు, నా హృదయాన్ని గుచ్చివేస్తున్నవి. నీ చెక్కిళ్ళు గులాబీలను ధిక్కరిస్తున్నవి. నీ అధరము లోనుంచి వెలువడే సుధారసము పురుషుల్ని ఆకర్షించేస్తుంది.

సా : సరి సరి! ఈ ప్రేమతోపాటు కవిత్వంకూడా బయలుదేరిందన్నమాట. ఇకనేం కావ్యాలు వ్రాసి అంకితం చేయండి. మీరనుకొన్నట్టు స్త్రీ చేతులు తామరతూండ్లుకావు. చెక్కిళ్ళు గులాబీలూకావు. కళ్ళు నల్లకలువలూకావు. అవన్నీ స్వార్థపరులైన మీ మగ వారు స్త్రీలను స్వాధీనం చేసుకోటానికి కల్పించిన కల్పనలు. త్వరగా మీరిక్కడనుంచి వెళ్ళిపోండి. లేకపోతే మీగతే నాకూడా పడుతుంది. ఇదిగో మీ 'ప్రేమలేఖ' ఇక దయచేయండి.

(అని కాగితం చలం చేతికిస్తుంది)

చ : సావిత్రీ నా ప్రేమ నర్థంచేసుకోకుండా తిరస్కరిస్తున్నావా? లైలా లేని మజ్నూ ఏమయ్యాడో చూడు. పార్వతిలేని దేవదాసేమయ్యాడో గ్రహించు. సావిత్రీ! బ్రతిమలాడి అడుగుతున్నా! నా ప్రేమ స్వీకరించు!

సా : నువ్వు త్వరగా ఇక్కడనుంచి వెళ్ళకపోతే ఏం జరుగుతుందో తెలుసా?

చ : తెలుసు! పువ్వుల్లో పెట్టి పూజిస్తావు. అనురాగంతో ఆదరిస్తావు. ఆప్యాయంగా పలకరిస్తావు. చిరునవ్వుతో చేయూతనిస్తావు.

సా : అనవసరం. ఎదురుచూస్తూ వుండండి. అన్నీ మా నాన్నగారొస్తే సక్రమంగా చేస్తారు. పోవోయ్!

చ : సావిత్రీ! వెళ్తున్నా! కాని ఒక్కమాట నా ప్రేమను నువ్వు తృణీకరించావు. తత్ఫలితంగా ఏం జరుగు తుందో తెలుసా? రేపు నువ్వే వింటావుగా! సెలవు.

(వెళ్ళిపోతాడు.)

సా : స్కౌండ్రల్! ప్రేమట, ప్రేమ! స్త్రీ బజారులో అమ్మే వస్తువనుకున్నాడేమో!

(తెర)

3 వ రంగము

[ఒక రూంలో చుట్టూ చిత్ర విచిత్రములైన పటాలు అలంకరించి వుంటాయి. షెల్ఫులో కొన్ని ఇంగ్లీషు పుస్తకాలు బూజు పట్టి వుంటవి. చిన్న కుర్చీలో చలం కూర్చుని వుంటాడు.]

చలం : ఇన్సల్టు! గ్రేట్ ఇన్సల్టు!! పురుషజాతికే తీరని అవమానం! ఓ పురుష సింహములారా! ఇటు చూడండి! నే నొక యువతిని ప్రేమించాను. ఆమె నాప్రేమను నిరాకరించింది. ప్రేమలేనిజీవితం జీవించే కన్నా చావటం మేలు! ప్రేమకోసం 'కోఫీట్యువా' ఒక బిచ్చకురాల్ని స్వీకరించాడు. ప్రేమకోసం 'అనార్కలీ' చేసిన త్యాగం తరతరాలుగా పాతుకుపోయింది. నేను నా ప్రేమకోసం నా జీవితాన్ని 'శాక్రిఫై' చేస్తున్నా! ఓ మహిళా మణులారా! ఇలా చూడండి! మీకోసం "వెలుగుకు ఆశపడి వచ్చే మిడతల్లా"

ఎంత మంది నశిస్తున్నారో చూడండి! ఎంతమంది దుర్భరావేదనకు గురియై బలియౌతున్నారో! ఇకనైనా కళ్ళు తెరవండి. సావిత్రి నా ప్రేమ నిరాకరించినందుకు "అయాం గోయింగ్ టు డై" (లేచి వెళ్ళి అలమారులోనుంచి పొటాసియం సైనేడ్ అని వ్రాసివున్న సీసా తీస్తాడు) ప్రేమ బలి! (పకపక నవ్వుతాడు. జేబులో నుంచి పెన్. కాగితం తీసి) అయ్ విల్ టేస్ట్ ది పొటాసియం సైనేడ్! సైంటిస్టులారా! సైంటిస్టులు! ఒక్క చుక్కైనా తీసి టేస్ట్ కనుక్కోలేకపోయారు. సంవత్సరాల తరబడి 'రీసెర్చి' చేసి కనుక్కోలేని బ్రహ్మాండమైన సంగతిని బయటపెడతాను. నా జీవితం పోయినా సైనేడ్ రుచి లోకానికి తెలిపినవాడనవుతాను. యస్. గో! (సీసా మూత తీసి గొంతులో [illegible]) అబ్బా! బాధ! (అభినయిస్తూ) ది సీడ్ [illegible]! తీపి. చేదు కలిసి వుంది. సైంటిస్టులారా! మీ డైరీల్లో వ్రాసుకోండి! [illegible] సావిత్రీ!

(అని కింద పడతాడు. ఇంతలో రామం వస్తాడు)

రా : వాట్ బ్రదర్ వాట్! ఏమిటిదంతా?

చ : (మాట్లాడకుండా కళ్ళు తేలవేసి కింద పడివున్న సీసా వంక చూపిస్తాడు.)

రా : హహ్హహ్హ! బలేవాడవు బ్రదర్! నువ్వీ అఘాయిత్యానికెలాగూ ఒడిగడతావని తెలిసి ముందుగానే దానితో మందు తీసేసి పంచదార పోశాను. అహహా ఏమి డిస్కవరీ! ఏమి డిస్కవరీ!

చ : (గబాలున లేచి) ఆఁ!

రా : మనవంటి మహాపురుషులంతా ఇప్పుడే స్వర్గానికి వెళ్తే ఇక్కడ మన కార్యాలెవరు చేస్తారు? "బ్రతుకు బ్రతికేందుకే! అన్నారు పెద్దలు! నిరాశకు స్వస్తి చెప్పి ఆశాజ్యోతిని వెలిగించు. [illegible] బ్రతుకుంటే నీ ఆశయాన్ని నెరవేర్చుకో! [illegible] హోటల్లో భోజనం పిలుస్తూంది.

చ : [illegible]!

(ఇద్దరూ కలిసి హోటలుకు వెళ్ళిపోతారు.)

(తెర)

సౌఖ్యము

శ్రీమతి ఆ. భాస్కరమ్మ

సుందరమ్మగారు చాలా పూర్వాచార పరాయణురాలు. ఆమెకు ఈ కాలపు చదువులన్నా, వేషములన్నా, చర్య లన్నా గిట్టదు. ఆమె ప్రతిదినము ఉదయమున అయిదు గంటలకు లేచి కాలకృత్యములను నెరవేర్చుకొని స్నా నముచేసి కొంతసేపు భగవద్ధ్యానము చేయును. పిమ్మట గృహకృత్యములను నెరవేర్చుకొని తీరిక సమయములో బిడ్డలకు కావలసిన దుస్తులను కుట్టుటలోనో ఏదేని యుద్గ్రంథమును తీసిచదువుటలోనో, పత్రికలకు చక్కని వ్యాసములు వ్రాయుటలోనో గృహములోనివారిని, పొరుగింటినుండి వచ్చికూర్చున్నవారిని తనగానమాధురితో నోలలాడించుటలోనో కాలము గడుపుచుండును. ఈమె పేరుకు తగినట్లు దర్శనీయముగా నుండును. ఎప్పుడు జూచినా కలకలలాడుచూ చిరునగవుతో నొప్పియుండును. గృహములోనివారినీ పైవారినీ నతియాదరణతో చూచు చుండును, నిష్కల్మషమైన హృదయముతో మనసిచ్చి మాట్లాడుచుండును. అందువలన నూరిలోనివారందరకూ నీమె యనిన నమితమగు గౌరవము.

ఈమె భర్త ప్రసాదరావుగారు జిల్లాజడ్జి. నిగర్వ చూడామణి. న్యాయాధికార పదవికి అన్నివిధముల తగిన వారు. భార్యయుత్తమ గుణవంతురాలును, విద్యావతియు, గృహనిర్వాహకత్వమునకు అన్ని విధముల సమర్థు రాలును తనమీదనే యాధారపడియున్న తల్లీ తోబుట్టు వులూ మొదలగు తనయింటగలవారి నందరనూ తన వలెనే ప్రేమించుచూ గౌరవించుచూనుండిన దగుట చేతనూ నింటిభారమంతయూ భార్యమీదనే వదలి తాను తన యుద్యోగశ్రమతప్ప యిక యేశ్రమాలేక కాలమును కులాసాగా గడుపుచుండును. వీరియింట వీరితల్లి ఒక వితంతు తోబుట్టువు, ఇరువురు తమ్ములూ, తలిదండ్రులు లేని వీరియన్నకుమార్తెగలరు. వీరుగాక యెల్లప్పుడూ వచ్చిపోవు బంధువులతోడనూ, పాఠములకొఱకు వచ్చు విద్యార్థుల తోడనూ గృహము నిండియుండును.

భర్త యింటిభారమంతయు తనమీదనే వదలిననూ పెద్దది అత్తగారుండుటచే పెత్తనమంతయూ నామెమీదనే వదలి వంట బ్రాహ్మణుడు నౌకర్లు మొదలగు వారందరూ వున్ననూ జడ్జిగారి భార్యనను గర్వమిసుమింతైననూలేక అవసరమువచ్చిన ప్రతిపనికి తానే సిద్ధపడుచూ అత్తగారు మొదలగు ఇంటిలోని వారందఱకూ ప్రాణప్రదముగా నుండును. వారుకూడా విద్యావంతులునూ, నిష్కల్మష హృదయాలు నగుటచే నీమెనమితముగా ప్రేమించుచు ఆమె చేయు పనులకు అడ్డుపెట్టక ప్రోత్సాహ మొసగు చుందురు.

ఈమెకు పదునారు సంవత్సరముల బాలికయు పది సంవత్సరములు గల యొకబాలుడును గలరు. ఆ బాలిక ఆ యూరగల ప్రభుత్వపు బాలికా పాఠశాలకు బోయి చదువుచున్నది ఆ విద్య ప్రస్తుతపు సంఘములో వెనుక బడి యుండకుండా తిరుగుటకు తప్ప బుద్ధివికాసము నకునూ, ప్రవర్తనను దిద్దుబరచుటకునూ, గృహనిర్వాహ కత్వమునకునూ, నిజమగు సంఘసేవ మాటలతోనూ, నుపన్యాసములతోనూ గాక క్రియలో చూపుటకు తగిన ఖచ్చితమగు బుద్ధినొసగుటకును తగినదిగా లేదని యామె యుద్దేశము. అందువలన నామె ఒకే వయసు లోనున్న తన కొమార్తెను బావగారి కొమార్తెను గృహ మున తానే సంస్కృతమూ, తెనుగూ బాగుగా చెప్పు చుండును. అందలి నీతికథలతో గూడిన పుస్తకములను చదివించుచుండును. ఆ కథలను వారి హృదయము లలో బాగుగా నాటి ఆచరణలో బెట్టుటకు తగినట్లు బోధించుచుండును. ఆడ పిల్లలకు ముఖ్యముగా కావల సిన సంగీతము, నృత్యము, కుట్టు మొదలగు లలిత కళ లను ఇంటి ఉపాధ్యాయులను బెట్టి నేర్పించుచుండెను.

బళ్ళారి నుండి ఒకయింజినీయరుగారు బదిలాయింపు మీద క్రొత్తగా రెండు నెలల క్రితము ఈ యూరువచ్చిరి. ఆయన భార్య అప్టు డేట్ ఫాషనబుల్ లేడి. ఎఫ్. ఎ. పరీక్షకు మూడుపర్యాయములు వెళ్ళినది. పాప మెందు చేతనో కృతార్థురాలు కాలేక పోయెను. కాని చిన్నప్పుడు కాన్వెంటులో చదువుట చేత ఇంగ్లీషు మాట్లాడటం బాగా వచ్చును. భార్యా భర్తల కన్యోన్యప్రేమ. కాని భర్తవంక వారెవరన్ననూ ఆమెకు గిట్టదు. పరిపూర్ణ స్వాతంత్ర్యం. ఇంటిలో తనకు మంచినీళ్ళు కావలసి వచ్చిననూ తాను తీసికొనదు. తనగౌరవమునకు తక్కువని నవుకరో, వంటమనిషో తీసికొని వచ్చి యీయవలయును. భర్తకు

రెండవ పెండ్లియగుటచేత మొదటి భార్యవలన పుట్టిన యొక కుమారుడు ఎనిమిదేండ్లవాడును, అయిదేండ్ల బాలికయు గలరు. ఆబిడ్డలనిన నామెకు పరమ అసహ్యము సరికదా తండ్రితో చనువుగా మాట్లాడినను, దగ్గరగా వెళ్ళినను ఆమె కమితముగు కోపమువచ్చును. తన సంతగా ప్రేమించు ఔదార్యమనస్సు నొప్పించుట కిష్టము లేక అయన బిడ్డలను మేనమామగారింటికి పంపివైచి భార్య మన్ననలకు పాత్రుడయ్యెను. ఆమె అమితముగు సంఘ సేవా పరాయణురాలు. సంఘ సేవను గురించి మన సంఘములోగల లోపములూ, వానిని నివరించు మార్గములను గురించి తీవ్రముగా నుపన్యాసము లిచ్చుచుండును. ఆమె తమయింట వచ్చిన తరువాత అప్పుడప్పుడు సుందరమ్మగారింటికి వెళ్ళుచుం. ఆమె వీరింటికి రావటము తటస్థిస్తోంది. ఒక రోజున సుందరమ్మగారు మధ్యాహ్నం మూడుగంటలకు కాళిదాసు ప్రణీతముగు మాళవికాగ్ని మిత్రమును పఠించుచుండెను, అప్పుడు ఇంజనీయరుగారి భార్య కౌసల్యాదేవి అక్కడకు వచ్చి కూర్చుండి సుందరమ్మగారూ! మీ శారదా, లక్ష్మీ ఏమి చేయుచున్నారు? అని అడిగెను.

సుంద: ఇప్పుడే వారికి నాట్యము చెప్పు నుపాధ్యాయుడు వచ్చారు: నృత్యము నేర్చుకొనుచున్నారు.

కౌసల్య: ఏమిటండీ మీ చరిత్ర అంతా చిత్రంగా ఉంది. మిమ్ము చూస్తే అతి పూర్వాచార పరాయణురాలివలె కనిపిస్తారు. ఇంత భాగ్యముండన్న మాటేగాని ఒక్క కారైనాలేదు. ప్రతిదీ స్వయంగా చూచుకుంటారు. మీరు మీ ఆయునా, పిల్లలు హాయిగా నుండకుండా ఇంటిపిండా యెక్కడలేనివారిని చేరుస్తారు. చదువుకొన్నారన్న మాటేగాని కొంచమైనా ఇంగ్లీషులో నలుగురితో మాట్లాడలేరు. ఇప్పటి చదువులన్నా, చర్యలన్నా మీకేమి గిట్టనట్లు మాట్లాడుతారు మళ్ళీ మీ అమ్మాయికి సమస్తము చెప్పిస్తారు. అంతే కాకుండా యిప్పుడు వాగా యింగ్లీషు విద్యలో నారితేరి సంఘసంస్కారులమని చెప్పుకొనువారు కూడా సాహసించి చేయలేని, ఇంకా మనకిప్పుడిప్పుడే పనికిరాదనుకొను నాట్యమును మీ అమ్మాయిలకు నేర్పించుచున్నారు. వారికి పదహారు సంవత్సరములున్ననూ పెండ్లికి త్వరపడరు. ఏమిటండీ మీ యుద్దేశము?

సుంద: మీరనుకొనునట్లు నేను పూర్వాచారపరాయణురాలినే. నాకు పూర్వపు గ్రథములు చదివిన కొలది, ఇప్పటి చర్యలు, చూచినకొద్దీ ఆ కాలపు విద్యయే యెక్కుడు శ్రేష్ఠముగా గాన్పించుచున్నది. నృత్యమనునది మనకు క్రొత్తకాదు. ఏ పాశ్చాత్య పద్ధతియూకాదు. నీతిరిదూరమూ కాదు. గణికలకొత్తే గాని కులస్త్రీలు నేర్చుకో కూడని విద్యాకాదు. మన పూర్వపు గ్రంథ మేగ్రంథము తీసి చదివినను అందు ప్రతి రాజకన్యకయు సంగీత సాహిత్య నృత్య విద్యలయందు ప్రవీణురాండ్రై యున్నటునూ. ప్రతి గృహమునందును బాలికలు నృత్య విద్య నేర్చుకొనుచుండినట్లును గానవగును. ఆ పూర్వ పద్ధతినే నేనవలంబించితినిగాని ఇందు నేత్రొక్కిన నూతన మార్గమేమీ లేదే?

కౌసల్య: అయితే ఈ నృత్యము పూర్వపు గ్రంథములలో నున్నది కదాయని మీ అమ్మాయిలకు నేర్పించుచున్నారా? లేక దానియందే మయినా గొప్పలాభమున్నదనియా? నేర్పించక పోవుట వలన వారునేర్చుకొను విద్యకేమయినా లోపము కలుగునేమోననెడి యుద్దేశముతో నేర్పించుచున్నారా?

సుంద: రెండూ కూడాను. విద్యయనునది శారీరిక, మానసిక, నైతిక శక్తుల మూటినీ వృద్ధి వికాసములను కలుగఁజేసినప్పుడే సరియగు విద్య యనిపించుకొనును గాని ఇందేదిలోటయినను అది సరియగు విద్య కాదనియే చెప్పవచ్చును. గ్రంథ పఠనము వలన నైతిక మానసిక శక్తులు వృద్ధినొందవచ్చును. కాని శరీర సౌష్ఠవమునకు వృద్ధి లేదు సరికదా పైగా భంగముకూడా కలుగుచున్నది.

శరీరమునకు బలము, ఆరోగ్యములతో గూడిన స్వాభావిక సౌందర్య మేర్పడక పోవుటచే సమస్త ప్రాణికోటికీ ఆకర్షణీయముగు ప్రేమ, భక్తి, గౌరవముల కునికి పట్టగు సౌందర్యమును కలిగి యుండుటకు కృత్రిమ మార్గము లవలంబింపవలసి వచ్చుచున్నది.

కౌసల్య: శరీర పరిశ్రమమే కావలయుననిన కసరత్తు చేయించరాదా? విహారమునకు పంపకూడదా? టెన్నిసు బేడ్మింటను మొదలగు ఆటలాడించకూడదా? అంతేకాని ప్రస్తుతమాచారములో లేనట్టియు, పరిహాస పాత్రమగునట్టియు కులటల సొత్తయినట్టియు నీ నృత్యవిద్యనే నేర్పించనేల?

సుంద : మీరుచెప్పినది నిజమేకాని మీరుచెప్పిన పరిశ్రమల వలన కలుగులాభములు వ్యాయామమువలన, మనకు తనువు కలుగవచ్చును కాని శరీరమందలి ప్రతి యవయవమునకును పరిశ్రమ కలుగుటకును స్త్రీ లక్షణమగు సౌందర్యము, మార్దవము, అభివృద్ధి నొందుటకును వీలుండదు.

నృత్యమో అట్లుకాదు. దీనివలన పైన చెప్పిన పరిశ్రమల వలన కలుగు లాభములు మాత్రమేగాక దేహము నందలి ప్రతి యవయవమునకునూ, నరములకునూ పరిశ్రమ కలుగును. నృత్యములో వ్రేళ్ళు, వ్రేళ్ళకొనలు, కండ్లు, కనుబొమలు, నొసలు సమస్తావయవములు గానమునకు తగిన హావభావ విలాసములు ప్రకటించుట కనేక విధములుగా తిరగవలసి యున్నదిగాన వాటి కన్నిటికీ తగిన బలము, దారుఢ్యము, సౌష్ఠవము లేర్పడును. అందు కలుగు ప్రతిచలనము అతి వయ్యారముగా నుండవలయునుగాన స్త్రీకి రావలసిన ముఖ్యలక్షణమగు వయ్యారము లబ్బును. చక్కని యంగసౌష్ఠవమును, పరిశుభ్రమగు రక్తము దేహమంతటా వ్యాప్తమగునట్లు ప్రవహించుటచేత దేహమునకు కాంతితోఁగూడిన చక్కని రంగు, ముఖములో తేజస్సు కలిగి స్వాభావికమగు చక్కని యందమేర్పడును. ఇది స్త్రీలు ముఖ్యముగా నభ్యసింపవలసిన లలిత కళలలో నొక కళ.

ఈ విద్యను గణికలు నేర్చుకొనుచున్నారని యిట్టి కారణముగా ప్రవర్తనలేనివారు, ఎట్టియుత్కృష్టమగునాట్యశాస్త్రము యంగసౌష్ఠవము, విలాసము, దేహపటుత్వము, వశీకరణము. మనము ఉద్యోగము చెడనుండా సుందరమా దగ్గినదియులుగను, వారందరియులుగను నుండుటకు కారణభూతమైనది. అవిద్య సంపాదించి యొద్దనే యున్నదో పూర్వపు చంద్రబింబాననలు, పద్మహస్తలు, సింహమధ్యలు, బింబాధరలు, వదారువన్నె పసిడి బంగారు దేహచ్ఛాయ గలవారు బయల్వెడలకుందురా ?

కౌసల్య : అమ్మా ! మీదంతా చాలా చిత్రమైన చర్యగా గాన్పించుచున్నది. మీరు చూడ నేమియునెరుగని శుద్ధ ముత్తైదువులవలె కన్పింత్రు మీజ్ఞానము, పాండిత్యము చూడ నపారము. అదృష్టమువలన మీసహవాసము లభించినదిగాన మీయొద్ద కొంత జ్ఞానమును బడసెదను. మీరుచెప్పినట్లు ఈ నృత్యవిద్యయొక్క విలువను ప్రతివారు గ్రహించి తమ బాలికలకు నేర్పించినచో ప్రస్తుతము విద్యావతులగు బాలికలకు విద్యాధిక్యతనొందు కొలది శరీరము కృశించుచుండుటను మాటపోయి స్త్రీసంఘము దారుఢ్య వంతమగుట కవకాశ మేర్పడును.



స్థాపితం: 1923

ఆంధ్ర బ్యాంకు లిమిటెడ్

హెడ్డాఫీసు: మచిలీపట్టణము.

(షెడ్యూల్డుబ్యాంకు)

30-6-55 నాటికి చెల్లింపబడిన మూలధనము, రిజర్వులు రు. 45, 81, 720

డిపాజిట్లు ,, రు. 8, 00, 00, 000-/ మించినవి

అమలులోనున్న వ్యాపారము రు. 9, 50, 00, 000/- మించినవి.

కర్యాలు ఆఫీసులు:

1/9 మెయిన్ బజారు, పేట,

[illegible] భవనము (ఈ పై ఆఫీసు అసెంబ్లీ సెషన్సు జరుగుచున్నంతకాలము తెరచియుండబడును)

మద్రాసులోని శాఖలు:

6, లింగిచెట్టి వీధి, మద్రాసు 1. 77, కచ్చేరి రోడ్డు, మైలాపూరు, మద్రాసు 4,
87, పాండిబజారు, త్యాగరాయనగర్, మద్రాసు 17.

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు:

అముదాలపురం, అనకాపల్లి, బాపట్ల, భీమవరం, చీరాల, ఏలూరు, గుడివాడ, గూడూరు (నెల్లూరు జిల్లా,) గుంటూరు, అరండల్ పేట (గుంటూరు). కాకినాడ, రామారావుపేట (కాకినాడ), మచిలీపట్టణము, నరసారావుపేట, నెల్లూరు, ఒంగోలు, పాలకొల్లు, రాజమండ్రి, శ్రీకాకుళం, తెనాలి, కొత్తపేట, (తెనాలి), తుని, విజయవాడ, గవర్నరుపేట, (విజయవాడ), గాంధీనగర్ (విజయవాడ). విశాఖపట్టణము, మహారాణీపేట (విశాఖపట్టణము), విజయనగరం సిటీ, ఆముదాలవలస, (శ్రీకాకుళం జిల్లా), అనంతపురం, భట్టిప్రోలు (గుంటూరు జిల్లా). బళ్లారి, బొబ్బిలి (శ్రీకాకుళం జిల్లా) చల్లపల్లి (కృష్ణా జిల్లా), చోడవరం (విశాఖ జిల్లా), కడప, దుగ్గిరాల, గొల్లప్రోలు, ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా) జగ్గయ్యపేట (కృష్ణా జిల్లా), కొవ్వూరు (ప.గో.జిల్లా). నరసన్నపేట (శ్రీకాకుళం జిల్లా), నిడదవోలు, పామర్రు (కృష్ణాజిల్లా), పార్వతీపురం. పెడన (కృష్ణా జిల్లా), పెద్దాపురం, పెనుగొండ (ప.గో. జిల్లా), పిఠాపురం, సాలూరు, సామర్లకోట, తణుకు,(ప. గోదావరిజిల్లా). తిరుపతి, వినుకొండ. వుయ్యూరు. (కృష్ణాజిల్లా)

ఆకర్షణీయమైన వడ్డీరేట్లకు డిపాజిట్లు అంగీకరించబడును.

సెక్యూరిటీలు, బంగారు నగలు, బులియను మరియు తదితర సరకుల మీదను అప్పులు యివ్వబడును.

వివరములు బ్యాంకు యొక్క ఏ ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

తాడేపల్లి శ్రీరాములు, మేనేజింగ్ డైరెక్టర్.

ఏలేశ్వరపు రామచంద్రమూర్తి, యం.ఏ., సి.ఏ.ఐ.ఐ.బి., జనరల్ మేనేజర్.

గుత్తి డి. మునసఫ్ కోర్టు

O. S. No. 280/54 E. P. 212/55

వాది గుర్రం శ్రీరాములు | ప్రతివాది పాటీలు లింగనగౌడు

నోటీసు

పైనంబరు వాది ప్రతివాదియొక్క ఆస్తులు ఆయుకానికి లోబడి డిక్రీ బాకీకి భూములు వేలానికి కోరినాడు సదరి భూములు వేలం నాయిగా ద 2-11-55 పగలు 1 గంటలకు పడినది. నాటి దినం కోర్టువారి యొక్క మేరకు వేలం కాబడును. సమాలుదార్లు యెవరైనా సవాలు చేయవచ్చునని తెల్పడమైనది.

ఆర్. నంజుండరావు. బి. ఏ.
వాది వకీలు.

ANDHRA MAHILA SABHA

NURSING HOME

REPORT FOR THE MONTH OF AUGUST '55.


IN - PATIENT DEPARTMENT:

No. of Patients admitted for Deliveries:	98
,, ,, Medical cases	1
,, ,, Abortion ,,	6
,, ,, Ante-Natal ,,	26
,, ,, Post-Natal ,,	1
,, ,, Abnormal deliveries	8
,, ,, Normal	90
,, ,, Babies	95
Total	225

OUT - PATIENT REGISTER:

Surgical cases	99
Medical ,,	781
Ante-Natal ,,	201
Post-Natal ,,	88
E. E. N. T. ,,	78
Gyaec - ,,	84
Total No. of New Pts.	1331
,, ,, ,, Old Pts.	1741
Grand Total	3072

57 Women undergoing Training as
AUXILIARY MIDWIFE-NURSES



"To train women workers and harness their services in the building up of the future of our Nation and Womanhood"

అక్టోబరు 1955

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
30	31	•	•	•	•	1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29

1. ఆంధ్రరాష్ట్ర దినోత్సవం, 2. గాంధీజయంతి, 15. మహాలయ అమావాస్య, 26. విజయదశమి.

ANDHRA MAHILA SABHA

MYLAPORE : MADRAS 4.

Edited by Mrs. K. Lakshmi Raghu Ram,
Printed & Published by Mrs. A. C. Krishna Rao, M.A., L.T.,
at the Andhra Mahila Press, Mylapore, Madras 4.